హైవేలపై నడక మార్గాలను పెంచాలి

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలి
- రహదారి భద్రతపై సమీక్షలో మంత్రి పొన్నం



హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారులపై రద్దీగా ఉండే ప్రాంతాల్లో పాదచారుల నడక మార్గాల సంఖ్యను పెంచడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పాదచారుల భద్రతను మెరుగుపరచడంతోపాటు రద్దీగా ఉండే హైవే స్ట్రెచ్‌లలో ప్రమాదాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారి భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై శుక్రవారం హైదరాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో అత్యున్నత సమీక్షా సమావేశం జరిగింది. రవాణా శాఖ కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వంలోని అన్ని విభాగాలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం, అత్యవసర సేవలను మెరుగుపర్చడం, రోడ్డు భద్రతా చట్టాలను, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయడంపై చర్చించారు. రహదారి భద్రత చర్యల్లో భాగంగా జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు నెలవారీగా సమావేశం కావాలని నిర్ణయించారు. రవాణా, ట్రాఫిక్, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, రోడ్లు-భవనాలు, ఎన్‌హెచ ఏఐ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్లకు రూ.174.96కోట్లు మంజూరు

హైదరాబాద్, ఆగస్టు23 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ పరిధిలోని పలు ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు కలిపి మొత్తంగా రూ.174.96 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ కార్పొరేషన్ రూ.4కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1.13కోట్లు, తాడిటాపర్ కార్పొరేషన్‌కు రూ.1.22కోట్లు, వాషర్‌మెన్ ఫెడరేషన్‌కు రూ.16.51లక్షలు, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.18.66లక్షలు, బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.29.83లక్షలు, బీసీ గురుకుల సొసైటీకి రూ.167.94కోట్లను మంజూరు చేశారు.



ఏసీబీకి పట్టుబడిన వసంత

ఏసీబీ వలలో సీటీవో

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నారాయణగూడ సర్కిల్‌కు చెందిన డిప్యూటీ వాణిజ్య పన్నుల అధికారి (సీటీవో) బీ వసంతను లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధకారులు పట్టుకున్నారు. ఓ వ్యక్తి ఖాతాలో ఆర్థిక అవకతవకలను ఉపేక్షించేందుకు ఆమె రూ.35వేలు లంచంగా డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని ఆమె సదరు వ్యక్తి నుంచి స్వీకరిస్తుండగా పట్టుకున్నట్టు తెలంగాణ ఏసీబీ అధికారులు శుక్రవారం వెల్లడించారు.



ఈ నెల 19న వనపర్తి జిల్లాలో బస్సులోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి సంధ్య

ఆటోలోనే గర్భిణి ప్రసవం



ఆటోలోనే జన్మించిన బాబు

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లికి చెందిన కాంపెల్లి లత అనే గర్భిణి ఆటోలోనే ప్రసవించింది. శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ఆశవర్కర్ సాయంతో 108కి ఫోన్‌చేయగా అందుబాటులో లేదని చెప్పారు. దీంతో ఆ మహిళను మల్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఆటోలో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆటోలో ప్రసవించిన లతను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జగిత్యాల దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.



నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో అశ్విని బెడ్ వద్ద ఘటనకు సంబంధించి విచారణ చేపడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

సర్కారు దవాఖానలో కుర్చీలోనే కాన్పు

- అర్ధరాత్రివేళ నల్లగొండ జనరల్ దవాఖానలో ఘటన
- పురిటి నొప్పులతో దేవరకొండ దవాఖానకు వెళ్తే డ్యూటీకి రాని డాక్టర్
- అర్ధరాత్రి అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలింపు
- దేవరకొండ డాక్టర్, స్టాఫ్ నర్సుల సస్పెన్షన్
- నల్లగొండ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

నీలగిరి, ఆగస్టు 23: పురిటినొప్పులతో కాన్పు కోసం ప్రభుత్వ దవాఖానకు వెళ్లిన నిండు గర్భిణి అర్ధరాత్రి నానా అవస్థలు పడింది. మొదట సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్తే డాక్టర్లు లేరు. అక్కడి నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్ర దవాఖానకు అంబులెన్స్‌లో వస్తే, చివరకు కుర్చీలోనే ప్రసవించాల్సిన దుస్థితి ఎదురైంది. అదృష్టవశాత్తు తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలానికి చెందిన నల్లవెల్లి అశ్విని నిండు గర్భిణి. గురువారం రాత్రి 10 గంటలకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ డ్యూటీ డాక్టర్, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నర్సులు నల్లగొండ జిల్లా దవాఖానకు వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో బయల్దేరి అర్ధరాత్రి 12:30 గంటలకు నల్లగొండలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి చేరుకున్నారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్ నిఖిత, నర్సులు పరీక్షించి ప్రసవానికి ఇంకా సమయం ఉన్నదని చెప్పారు. 30 నిమిషాల తరువాత రెండోసారి బీపీ చెక్ చేసి బాగానే ఉన్నదన్నారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో అశ్వినిని వాకింగ్ చేయాలని సూచించడంతో వాకింగ్ చేస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దాంతో ఆమె పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నది. నిమిషాల వ్యవధిలో కుర్చీలోనే శిశువుకు జన్మనిచ్చింది. అశ్విని తల్లి బిడ్డను గట్టిగా పట్టుకుని వెంటనే డాక్టర్‌ను పిలిచింది. అదృష్టవశాత్తు బిడ్డకు ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. లేబర్‌రూమ్ నుంచి వచ్చిన సిబ్బంది అశ్వినిని వార్డులోకి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఘటనపై కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశం మేరకు అదనపు కలెక్టర్ టీ పూర్ణచంద్ర శుక్రవారం జిల్లా దవాఖానను సందర్శించారు. అశ్విని, ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దవాఖాన పర్యవేక్షకులు, ఆర్‌ఎంవో, డ్యూటీ డాక్టర్లతో మాట్లాడారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ దవాఖానలో విధుల్లో లేని డ్యూటీ డాక్టర్ శాంతిస్వరూప, విధుల్లో ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్టాఫ్ నర్సులు విజయలక్ష్మి, సైదమ్మ, మౌనిక, సరితను సస్పెండ్ చేయాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. నల్లగొండ దవాఖానలోని డ్యూటీ డాక్టర్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

అశ్విని మూడో కాన్పు కోసం దేవరకొండ దవాఖానకు వెళ్లగా అక్కడ వైద్యులు లేకపోవడంతో నల్లగొండ జిల్లా దవాఖానకు పంపారు. ఇక్కడ రెండుసార్లు పరీక్షించిన వైద్యులు డెలివరీకి ఇంకా సమయం ఉన్నట్టు గుర్తించారు. ఆగి ఆగి నొప్పులు వస్తుండటంతో లేబర్ రూమ్‌లోకి వెళ్లి బట్టలు మార్చుకోవాలని సూచించారు. ప్రసవానికి ఇంకా సమయం ఉండటంతో వైద్య నిబంధనల ప్రకారం వాకింగ్ చేయాలని చెప్పారు. రాత్రి 2 గంటల సమయలో అశ్విని నడుస్తుండగా, లేబర్ రూమ్ ముందు నొప్పులు ఎక్కువై అక్కడే ఉన్న కుర్చీలో బిడ్డను ప్రసవించింది. డాక్టర్లు, సిబ్బంది వెంటనే వచ్చి వైద్యసేవలు అందించారు. ఈ ఘటనలో గురువారం రాత్రి డ్యూటీలో ఉండాల్సిన దేవరకొండ దవాఖాన డ్యూటీ డాక్టర్‌తోపాటు విధుల్లో ఉన్న నర్సులను సస్పెండ్ చేయాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించాం. నల్లగొండ దవాఖానకు సంబంధించి అనుభవం ఉన్న వారి సహాయం లేకుండా వాకింగ్ చేయాలని సలహా ఇవ్వడం వల్ల కుర్చీలోనే ప్రసవం జరిగిందని గుర్తించాం. అందుకు బాధ్యులైన డ్యూటీ డాక్టర్ నిఖితతోపాటు నలుగురు స్టాఫ్ నర్సులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. వారి వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటాం.

-టీ పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్, నల్లగొండ

సర్కారు దవాఖానను నమ్ముకుంటే నిర్లక్ష్యం చేశారు

నా భార్యకు మొదటి రెండు కాన్పులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానలోనే అయ్యాయి. గురువారం రాత్రి మూడో కాన్పు కోసం వెళ్తే అక్కడ నిర్లక్ష్యం చేశారు. నిద్రమత్తులో ఉండి కనీసం చెక్ చేయకుండా నల్లగొండ దవాఖానకు పంపించారు. ఇక్కడికి వస్తే డెలివరికి టైమ్ ఉన్నదని వాకింగ్ చేయాలని చెప్పారు. వాకింగ్ చేస్తుండగా నొప్పులు రావడంతో నా భార్య కుర్చీలోనే ప్రసవించింది.

-ఆంజనేయులు, అశ్విని భర్త

పడకేసిన ప్రజారోగ్యం

- విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిందేనా?
- ముందస్తు కార్యాచరణ లేక ప్రజలకు తీవ్ర అవస్థలు
- ప్రాణాలంటే లెక్కలేదా.. ఇప్పటికైనా చర్యలు తీసుకోండి
- సీఎం రేవంత్‌కు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ



హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు ప్రజారోగ్యాన్ని పాతరేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సీఎం సహా రాష్ట్ర యంత్రాంగమంతా ప్రజారోగ్య వ్యవస్థను గాలికొదిలేయడంతో జనం విషజ్వరాలతో మంచం పట్టే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గత 8 నెలలుగా పారిశుద్ధ్య నిర్వహణ దిగజారిపోవటంతో దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాతో ప్రజలు అవస్థలు పడుతున్నారని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ఉదహరించారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్టణం తేడాలేకుండా రోగుల సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్‌కు ముందే చర్యలు తీసుకోవాలనే కనీస అవగాహన సర్కారుకు లేకపోవటంతో ప్రజలు విషజ్వరాల బారిన పడే దుస్థితి నెలకొన్నదని దుయ్యబట్టారు.

జ్వరాలతో ప్రజలు.. ఢిల్లీ టూర్లలో సీఎం, మంత్రులు

ఈ ఏడాది దాదాపు 5,700 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయని, అనధికారికంగా ఈ సంఖ్య పదిరెట్లు ఎక్కువగా ఉంటుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. డెంగ్యూకు సరైన సమయంలో చికిత్స అందకపోవటంతో ఇటీవల దాదాపు 50మంది చనిపోయారని, ఇందులో చిన్నపిల్లలూ ఉండటం బాధాకరమని అన్నారు. ఒక్క రోజే డెంగ్యూతో ఐదుగురు చనిపోయిన సంఘటన ప్రతి ఒక్కరిని కలిచివేసిందని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవటం, సరిపడా మందులు లేని కారణంగా ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నారు. ప్రజారోగ్యాన్ని పట్టించుకోవాల్సిన సీఎం, మంత్రులు ఢిల్లీకి రాజకీయ యాత్రలు చేయటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యంపై సీఎం స్థాయిలో సమీక్షలు జరగకపోవటం వల్లే వైద్యారోగ్యశాఖ విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజా ఆరోగ్యం అంటే పట్టింపు లేదా? అని సీఎంను ప్రశ్నించారు.

ముందస్తు కార్యాచరణతోనే సగం జబ్బుల నివారణ

విష జర్వాలు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, దోమల బెడద లేకుండా ఇప్పటికైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు కాస్త ఆలసమైనా ఇబ్బందులు రావని, ప్రాణం పోతే తిరిగిరాదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వర్షకాలానికి ముందే ప్రజారోగ్యంపై సమీక్షలు, ముందస్తు కార్యాచరణతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకున్న సందర్భాలను గుర్తుచేశారు. ఇకనైనా రాజకీయాలపై దృష్టిపెట్టడం మాని డెంగ్యూ, మలేరియా ఇతర విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఓఆర్‌ఆర్ లీజును రద్దు చేయండి!

- మీ చేతిలో పనే కదా.. చర్యలు చేపట్టాలి
- ప్రతిపక్షంలో ఉన్నట్టే ఆరోపణలెందుకు?
- కాంగ్రెస్ మంత్రులకు కేటీఆర్ సవాల్

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఓఆర్‌ఆర్ లీజు విషయంలో కాంగ్రెస్ మంత్రులు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టుగానే ఆరోపణలు చేస్తుండటంపై జాలేస్తున్నదని కేటీఆర్ అన్నారు. ఓఆర్‌ఆర్ లీజును బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇష్టమొచ్చిన ధరకు ఓ సంస్థకు అప్పగించిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించటంపై అభ్యంతరం వ్యక్తం చేసిన కేటీఆర్.. 'బీఆర్‌ఎస్ నిజంగానే తక్కువ ధరకు లీజుకు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నది? మేం తక్కువ ధరకు లీజుకు ఇచ్చింది నిజమే అయితే సదరు లీజును రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. టీవోటీ (టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) లీజును రద్దు చేసి తాజాగా కొత్త బిడ్‌లు పిలవాలని సవాల్ విసిరారు. చేతిలో ఉన్న పని చేయకుండా బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని తేల్చిచెప్పారు. ఓఆర్‌ఆర్ లీజు విషయంలో తాము ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలనే అనుసరించామని స్పష్టంచేశారు. ఆ లీజు విషయంలో తప్పు జరిగి ఉంటే సర్కార్ చర్యలు తీసుకోవచ్చని.. బీఆర్‌ఎస్ మీద దుష్ప్రచారం చేసే ప్రయత్నం చేస్తే ఎంతోకాలం దాగదని వెల్లడించారు.



తిరుమలలో గోల్డెన్ బాయ్స్ సందడి

మహారాష్ట్రలోని పుణెకు చెందిన గోల్డెన్ బాయ్స్ సన్నీ నన వాగ్చోరే, సంజయ్ దత్తాత్రేయ గుజర్, ప్రీతి సోనీ శుక్రవారం తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు. ఈ సమయంలో ఒంటి నిండా బంగారం ధరించుకున్నవారిని చూసిన భక్తులు ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. వారి రక్షణకు 15 మంది సెక్యూరిటీ రావడం విశేషం. వాగ్చోరే, సంజయ్ గుజర్ ఇద్దరూ చెరో 10 కిలోల బంగారం ధరించగా.. ప్రీతి సోనీ 5 కేజీల బంగారం ధరించినట్టు సమాచారం.

– హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

- నాన్ టీచింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు షరీపుద్దీన్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 23: కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వఉద్యోగుల పట్ల మొండి వైఖరిని అవలంభిస్తున్నదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ షరీపుద్దీన్, టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ హరికృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ఎదుట ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా షరీపుద్దీన్ మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కంట్రిబ్యూషన్ విధానాన్ని రద్దుచేయాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్, కరువు భత్యం డీఏను విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్స్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. ధర్నాలో ప్రధాన కార్యదర్శి పీ సుదర్శన్, సీనియర్ నాయకులు అంజయ్య, అశోక్, నిరంజన్, రమా, మధుసూదన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు జగదీశ్వర్, శ్రీనివాస్‌రావు

27 మందితో ఉద్యోగ జేఏసీ స్టీరింగ్ కమిటీ

- త్వరలో వంద మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీ
- హక్కులు ఎలా సాధించుకోవాలో మాకు తెలుసు
- ప్రభుత్వం ఇచ్చిన ఆగస్టు 15 గడువు ముగిసింది
- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు

హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 27 మందితో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఉద్యోగుల జేఏసీ నేతలు జగదీశ్వర్, శ్రీనివాసరావు వెల్లడించారు. రెండు రోజుల్లో వందమందితో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శుక్రవారం జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన ఆగస్టు 15 గడువు ముగిసిందని పేర్కొన్నారు. 'ఉద్యమంలో ఫుల్‌టైం ట్రైనింగ్ అయినోళ్లం. మా డిమాండ్లు ఎలా సాధించుకోవాలో మాకు తెలుసు' అని వ్యాఖ్యానించారు. కొత్త ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా తమ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడం నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమల్లోకి వచ్చిన సెప్టెంబర్ 1న బ్లాక్‌డేగా పరిగణించి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

'బీపీఈడీ, యూజీడీపీఈడీ'లో 753 మందికి సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): టీజీ పీఈసెట్‌లో భాగంగా రెండేండ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ), అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్(యూజీ డీపీఈడీ) కోర్సుల్లో అడ్మిషన్లు మొదలయ్యాయి. శుక్రవారం టీజీ పీఈసెట్ కన్వీనర్ విద్యార్థులకు తొలిదశ కౌన్సెలింగ్‌లో సీట్లను కేటాయించారు. కన్వీనర్ కోటాలో 1,737 సీట్లకు తొలిరోజు 753 సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు 28లోగా కాలేజీల్లో రిపోర్టు చేసి ట్యూషన్ ఫీజు చెల్లించాలని కన్వీనర్ సూచించారు.

30, 31న 'డిపార్టుమెంటల్' వైవా పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల చేశారు. 30, 31న వైవా-వోకో పరీక్షలు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. స్పెషల్ లాంగ్వేజీ తెలుగు టెస్ట్ ఆఫ్ ఆఫీసర్స్ కోసం ఈ వైవా పరీక్షలు నిర్వహించనున్నారు.

స్పోర్ట్స్ కోటాలో 'ఏఎంవీఐ'కి అభ్యర్థి ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏఎంవీఐ ఉద్యోగాల భర్తీకి స్పోర్ట్స్ కోటాలో పెండింగ్‌లో ఉన్న అభ్యర్థి ఎంపికైనట్టు శుక్రవారం టీజీపీఎస్సీ అధికారులు వెబ్‌నోట్ విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థికి 28న ఉస్మానియా దవాఖానలో వైద్య పరీక్షలు జరుగుతాయని, సదరు అభ్యర్థి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.


ప్రమోషన్ల అర్రాస్ వెనుక కాంగ్రెస్ నేత!

- సాంఘిక సంక్షేమ గురుకుల బదిలీల్లో ఇష్టారాజ్యం
- వచ్చే ఏడాది 'ఎమ్మెల్సీ' కోసం ఇప్పటినుంచే పావులు
- అక్రమాలకు సహకరించిన ఓ యూనియన్ నాయకుడు
- గురుకులాల్లో నమస్తే తెలంగాణ కథనం దుమారం
- అవకతవకలపై ఆరా తీస్తున్న సీఎం కార్యాలయం
- చక్రం తిప్పిన డాటా ఎంట్రీ ఆపరేటర్ అదృశ్యం

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీలో వెలుగు చూస్తున్న అక్రమాల వెనుక ఉన్నది ఎమ్మెల్సీ ఆశావహులేనని తెలిసింది. తమ రాజకీయ భవిష్యత్తు కోసం గురుకుల ఉపాధ్యాయులను ఆగం పట్టించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ సొసైటీలోనూ లేనివిధంగా సోషల్ వెల్ఫేర్ సొసైటీలోనే బదిలీలు ఇంత గందరగోళంగా ఉండడానికి కాంగ్రెస్ పార్టీలోని కీలక నేతతోపాటు మరో యూనియన్ నేత కారణమన్న చర్చ జరుగుతున్నది. డీఎల్ బదిలీలు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టుల ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై 'సీఎం శాఖలోనే పదోన్నతుల అర్రాస్' పేరిట 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన ప్రత్యేక కథనం దుమారం రేపుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం గుట్టుగా విచారణను చేపట్టడం గమనార్హం.

ఎమ్మెల్సీ ఆశావహుల 'హస్తం'

వరంగల్-ఖమ్మం-నల్లగొండ, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా, పార్టీలో కీలకంగా ఉన్న నాయకుడు వరంగల్-ఖమ్మం-నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కన్ను గురుకులాలపై పడింది. గురుకుల సొసైటీకి చెందిన ఓ యూనియన్ నేతతో కలిసి బదిలీలను ఆసరాగా చేసుకుని ప్రణాళికలను రూపొందించి అమలు చేశారని టీచర్లు చర్చించుకుంటున్నారు. ఆ యూనియన్ నేత కూడా కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి బరిలో నిలవాలని కుతూహలం చూపుతున్నారు. దీంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని యూనియన్ నేతను ముందు పెట్టి వెనకాల ఈ తతంగమంతా నడిపించారని గురుకుల ఉపాధ్యాయ వర్గం కోడై కూస్తున్నది. కేసీఆర్ హయాంలో పెద్ద ఎత్తున ఏర్పాటైన గురుకులాల వల్ల టీచర్ల సంఖ్య బాగా పెరిగింది. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరు కీలకంగా మారారు. ఈ నేపథ్యంలో వారిని మంచి చేసుకోవడం ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే తాము పోటీలో నిలబడబోయే స్థానాల్లో ముందుగానే తమవారిని నియమించుకునేందుకు, అక్కడి గురుకుల సిబ్బందిని మచ్చిక చేసుకునేందుకు ఈ బదిలీలు, ప్రమోషన్లను పావుగా వాడుకున్నారు. తమకు అనుకూలమైన వారి కోసం, అనుకూలమైన స్థానాలను ఇప్పించడంలో చక్రం తిప్పారు. అందుకోసమే ఏ సొసైటీలోనూ లేనివిధంగా ఇక్కడమాత్రమే పట్టుబట్టి ఆఫ్‌లైన్‌లోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టేలా చేసి తమ ప్రణాళికలను గుట్టుగా అమలు చేశారని చెప్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అర్హులు, మెరిట్ ఉన్నవారు తీవ్రంగా నష్టపోయారని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల కోసం తమ జీవితాలతో చెలగాటమాడరని వాపోతున్నారు.



ఉలిక్కిపడిన ఉపాధ్యాయులు

'నమస్తే తెలంగాణ' పత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనంతో సొసైటీ ప్రధాన కార్యాలయ ఉద్యోగులతోపాటు, బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో భాగస్వాములైన ఉపాధ్యాయులు ఉలిక్కిపడ్డారు. 'ఇప్పుడెలా?' అని చర్చించుకున్నట్టు తెలిసింది. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులను సొసైటీ సెక్రటరీ హెడ్ ఆఫీస్‌కు పిలిపించుకుని ఆరా తీసినట్టు సమాచారం. టీచర్ల జాబితాల ఎంట్రీలో కీలకంగా వ్యవహరించిన డాటా ఎంట్రీ ఆపరేటర్ రెండ్రోజులుగా ఎవరికీ అందుబాటులో లేకుండా పోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'నమస్తే' కథనంతో గురుకుల సొసైటీల్లోని ఇతర టీచర్లందరిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గుట్టుగా సీఎంవో ఎంక్వైరీ

గురుకుల సొసైటీ బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి 'నమస్తే'లో ప్రచురితమైన కథనంతో ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందిపై ప్రభుత్వం సీరియస్‌గానే స్పందించినట్టు విశ్వసనీయ సమాచారం. సాంఘిక సంక్షేమశాఖ ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వద్దనే ఉన్నది. సీఎం అజమాయిషీలోని శాఖలోనే అక్రమాలు వెలుగుచూడడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కాంగ్రెస్ నాయకుడు ఎవరు? యూనియన్ నేత ఎవరు? ఇందులో భాగస్వాములైన ఉద్యోగుల ఎవరు? ఇంకా ఎవరెవరున్నారు? సెక్రటరీ కనుసన్నల్లోనే ఇది జరిగిందా? లేదంటే తప్పుదోవపట్టించారా? అనే కోణంలో గుట్టుగా విచారణ ప్రారంభించినట్టు సచివాలయ అధికారులు చెప్తున్నారు. సొసైటీలోని ఇతర సిబ్బంది ద్వారా సదరు ఉద్యోగుల వివరాలతో, బదిలీలు, ప్రమోషన్లు కొనసాగించిన ప్రక్రియపైనా గుట్టుగా ఆరా తీస్తున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశమున్నది.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ప్రశ్నిస్తే.. దాడులకు తెగబడతారా?



ఎస్పీకే

'మేమొస్తే కంచెలు తొలగిస్తం, హద్దులు చెరిపేస్తం, స్వర్గాన్ని భూలోకానికి దించుతం, ప్రజలను ఆనందలోకాల్లో విహరింపజేస్తం, ప్రజల జీవితాలను బంగారుమయం చేస్తం, రాష్ట్రంలో ప్రజా పాలన తెస్తాం...' ఇవీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఊదుడు బుగ్గల మాటలు. ఆ మాటలతో కట్టిన కోటలు. వారనుకున్నట్టే ప్రజలను నమ్మించి, వంచించిర్రు. కుర్చీ దక్కిన తర్వాత ముఖాలకు వేసుకున్న ముసుగులు తొలగించేసిర్రు. అందుకే, నాడు చెప్పిందేమిటి? నేడు ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారంలో నిజం ఎంత? అనేది నిగ్గు తేల్చేందుకు మీడియా ప్రతినిధులు కొందరు సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లికి పోయిండ్రు. అంతే వారిపై రౌడీమూకలు దాడులకు తెగబడ్డయి. అసలేం జరుగుతున్నది ఈ తెలంగాణ రాష్ట్రంల?

శుక్రవారం, పొద్దున 8.30 గంటల సమయం, కొండారెడ్డిపల్లి గ్రామం. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ అయిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో నిజమెంత? అని తెలుసుకునేందుకు సరిత, విజయారెడ్డి అనే ఇద్దరు మహిళా జర్నలిస్టులు కొండారెడ్డిపల్లికి వెళ్లారు. ప్రజలను కలుస్తూ 'రుణమాఫీ అయిందా, కాలేదా?' అని అభిప్రాయా లను రికార్డు చేస్తున్నారు. అది గమనించిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వారిని అడ్డుకున్నారు. మహిళలనే ఇంగితజ్ఞానం లేకుండా దురుసుగా ప్రవర్తించారు. జర్నలిస్టు సరితను తోసేస్తే బురదలో పడ్డది. ఆమె మొబైల్, మెమొరీకార్డులను గుంజుకున్నారు. జర్నలిస్ట్ విజయారెడ్డితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో మధ్యలోకి వెళ్లిన సరితను అసభ్యంగా తాకుతూ వేధించారు.

ఆ ఇద్దరు జర్నలిస్టులు ఏడుస్తూ వంగూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ, పోలీసులు ఫిర్యాదును స్వీకరించలేదు. అంటే, రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు ఆ ప్రాంతంలో ఎలాంటి భయానక వాతావరణాన్ని సృష్టించారో అర్థమవుతున్నది. 10 గంటల కల్లా ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. న్యూస్‌లైన్, వైఆర్ టీవీ, తెలుగు స్క్రైబ్ చానళ్లు వారికి మద్దతుగా అక్కడికి వెళ్లారు. తోటి జర్నలిస్టులను చూసిన ఆ ఇద్దరు మహిళా జర్నలిస్టులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ క్రమంలో ఎన్నడూ కొండారెడ్డిపల్లికి రాని కొండల్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వస్తున్న ఇతర జర్నలిస్టులను అడ్డుకునేందుకు చాలా ప్రయత్నం చేశాడు. ఈ జర్నలిస్టులకు కొండల్‌రెడ్డి కాన్వాయ్ ఎదురైంది. కారులో వెళ్తున్న జర్నలిస్ట్ శంకర్‌ను చూసిన కొండల్‌రెడ్డి సినీ తరహాలో వేలు చూపిస్తూ బెదిరించాడు. ఆ కారును టార్గెట్ చేసి రెండుమూడు సార్లు అటకాయించే ప్రయత్నం చేశారు. వారు తప్పించుకొని హైదరాబాద్ వైపు వచ్చారు. ఇంతలోనే నాలుగైదు కార్లు శంకర్ కారును తరుముతూ, అడ్డంగా అతి వేగంగా అటకాయించే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో జర్నలిస్ట్ శంకర్ వెనకాల వస్తున్న సహచర జర్నలిస్టులను అప్రమత్తం చేశారు. ఓ నలుపు రంగు



కారు శంకర్ కారుకు అడ్డంగా వచ్చి 'మీరు హైదరాబాద్ ఎట్ల పోతరో చూస్తం బిడ్డా, కొండారెడ్డిపల్లికి వచ్చేంత దమ్ముందారా మీకు?' అంటూ రాయలేని అసభ్యకర భాషలో మాట్లాడుతూ దాడి చేయబోయారు. వారినుంచి తప్పించుకున్న శంకర్ కారు నేరుగా వెల్దండ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నది. ఇతర జర్నలిస్టులూ అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సుమారు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. పోలీస్ స్టేషన్‌లోనే సరిత, విజయారెడ్డి, శంకర్‌లను బెదిరించారు. అప్పుడే వచ్చిన సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి.. కాంగ్రెస్ నాయకులను, కిరాయి గుండాలను అక్కడినుంచి పంపించేశారు. జర్నలిస్టులపై దాడి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తదితర బీఆర్ఎస్ నాయకులు కూడా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

దాడి ఉదంతాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఎస్పీకి ఫోన్ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో రెండు పోలీసు వాహనాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. దీంతో జర్నలిస్టులు సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు.

> **కొండారెడ్డిపల్లి పొరుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జర్నలిస్టులకు ఫోన్‌చేసి.. 'ఈ రోజు కొండారెడ్డిపల్లిలో మీరు దొరికి ఉంటే సగం మంది తిరిగి ప్రాణాలతో ఉండేవారు కాదు' అని చెప్పడం గమనార్హం. ఇవీ.. కొండారెడ్డిపల్లిలో సినీ ఫక్కీలో జరిగిన ఘటనలు.**

ముఖ్యమంత్రి సొంతూరు అయినంత మాత్రాన గ్రామంలోకి వెళ్తే జర్నలిస్టులపై దాడులు చేస్తారా? చంపుతామని బెదిరిస్తారా? గతంలో జర్నలిస్టుల మీద ఈ స్థాయిలో దాడులు ఏనాడైనా జరిగాయా? ప్రజాపాలన అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ హయాంలో గత ఎనిమిది నెలల్లో పదుల సంఖ్యలో జర్నలిస్టుల మీద దాడులు జరిగాయి. ఇప్పుడు ఏకంగా చంపేస్తామని బెదిరింపులు మొదలయ్యాయి. ఈ ప్రభుత్వం ప్రశ్నించే జర్నలిస్టుల గొంతుకలపై ఉక్కుపాదం ఎందుకు మోపుతున్నది? ఏ తప్పూ చేయకపోతే జర్నలిస్టులను బెదిరించుడు ఎందుకు? ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే హక్కు జర్నలిస్టులకు లేదా? ప్రశ్నించినంత మాత్రాన ప్రైవేటు గ్యాంగ్‌లతో సీఎం తమ్ముళ్లు బెదిరింపులకు పాల్పడతారా? జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? కచ్చితంగా ఉన్నది. 'మాకు ఓటేయండి' అని తెలంగాణ ప్రజలను నమ్మించిన రాహుల్‌గాంధీ మీద, కాంగ్రెస్ పార్టీ మీద కూడా ఆ బాధ్యత ఉన్నది. ప్రశ్నించే గొంతుకలను కాపాడుకోవాల్సిన అవసరం తెలంగాణ సమాజానికి ఉన్నది.

జై తెలంగాణ! జైజై తెలంగాణ!!

> **జర్నలిస్టులను చంపేస్తామని బెదిరించినవారిలో నయీం ముఠాలో కీలక సభ్యుడిగా పనిచేసిన శేషన్న కూడా ఉన్నట్టు తర్వాత తెలిసింది. ఆయనే కాదు, నయీం గ్యాంగ్‌లో పనిచేసిన పలువురు మాజీ సభ్యులను యాక్టివేట్ చేసి చురుగ్గా పనిచేస్తున్న జర్నలిస్టులను, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న డిజిటల్ చానళ్ల ప్రతినిధులను బెదిరించడం, టార్గెట్ చేయడం, చంపేయమని టాస్క్ ఇవ్వడం దేనికి సంకేతం? స్వరాష్ట్రం వచ్చిన పదేండ్లలో ఇలాంటి హింసాత్మక ప్రేరేపణలు చూశామా? ఇంతకన్నా ఘోరం ఇంకోటి ఉండదేమో!**



సిద్ధు మెడకు చుట్టుకున్న ముడా

> **'ముడా' స్థలం కేటాయింపు కుంభకోణానికి సంబంధించి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరిపేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ అనుమతి ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఓ వైపు కాంగ్రెస్-రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు బీజేపీ-గవర్నర్‌ల మధ్య ఈ విషయమై వాగ్వాదం జరుగుతున్నది.**

గవర్నర్ నిర్ణయాన్ని ఆ రాష్ట్ర క్యాబినెట్ ఖండించింది. అంతేకాదు, దీన్ని రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్ధరామయ్య సర్కార్ ఎదుర్కొన్న అత్యంత తీవ్రమైన రాజకీయ సవాల్ ఇదే. ఈ నేపథ్యంలో గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని సిద్ధరామయ్య అన్నారు. గవర్నర్ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాల్ చేస్తామని కూడా ఆయన చెప్పారు. తన ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రలో ఇది భాగమని పేర్కొన్నారు.

> **ఈ కేసులో ఒకసారి విచారణ ఊపందుకున్నట్టయితే.. సిద్ధరామయ్యపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి రావడం ఖాయం. అయితే ఇది మరో రకంగా కాంగ్రెస్‌కు మేలు చేసే అవకాశం ఉంది. సిద్ధరామయ్య నేతృత్వంలో పార్టీ నేతలను ఏకం చేసేందుకు ఇది దోహదం చేయవచ్చు. మరోవైపు ఈ అంశాన్ని వాడుకొని తమ పార్టీ నాయకులను కూడా ఏకతాటిపైకి తీసుకురావాలని బీజేపీ ఆశిస్తుండవచ్చు.**

విచారణకు అనుమతించవద్దని క్యాబినెట్ చేసిన సూచనను గవర్నర్ గెహ్లోత్ తిరస్కరించారు. ప్రాథమిక దర్యాప్తు నివేదికల పట్ల సంతృప్తి చెందానని, అందుకే విచారణకు అనుమతించినట్టు గవర్నర్ చెప్పారు. ఈ సంతృప్తి అనేది ప్రాథమిక ఆధారాల ద్వారా కాకుండా రాజకీయంగా ఉండవచ్చు. మన దేశంలో గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగపరుస్తున్న తీరును గనుక పరిగణనలోకి తీసుకుంటే.. ప్రభుత్వాన్ని కూల్చాలనే కుట్రలో భాగమేనని వస్తున్న అభియోగాలు రాజకీయ ఆరోపణలు మాత్రమే కాకపోవచ్చు.

'ఆపరేషన్ కమలం'తో పోలిస్తే.. ఇలా గవర్నర్‌ను వినియోగించుకొని తిరుగుబాటును మరింతగా ఎగదోయడమనేది చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్న మార్గం. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు పార్టీ ఫిరాయింపులను వాడుకున్నప్పుడు బాధితుడు నైతికంగా ఉన్నతస్థితిలో ఉంటాడు. అలా కాకుండా అవినీతి అనేది ప్రధానాంశమైతే మాత్రం ప్రభుత్వాన్ని పడగొట్టినవారు కూడా నైతిక విజయం సాధిస్తారు. అయితే బీజేపీ నేతల అవినీతి ఆరోపణలపై కూడా గవర్నర్ ఇదే విధంగా స్పందిస్తారా? అనేది ఇక్కడ ప్రశ్న. ఒకవేళ గవర్నర్ అలా చేయకపోతే అది అతని పక్షపాత వైఖరిని బహిర్గతం చేయవచ్చు. కానీ, ఆయన తీసుకున్న చర్యను మాత్రం ప్రభావితం చేసే అవకాశం లేదు.

> **ముడా కుంభకోణం విషయమై సిద్ధరామయ్య వాదన కూడా నమ్మశక్యంగా లేదు. అతని భార్యకు భూముల కేటాయింపునకు సంబంధించి లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు ఆయన వద్ద సంతృప్తికరమైన సమాధానాలు లేవు. అంతేకాదు, ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రభుత్వం నియమించిన కమిషన్ ఎక్కడికీ వెళ్లకపోవచ్చు. ఈ వాదోపవాదాలు, మాటల యుద్ధం నేపథ్యంలో అవినీతి అనేది చాలా చిన్న అంశంగా మారిపోతున్నది. ముందుగా ఒక అవగాహనకు రావడం, ఆ తర్వాత ప్రభుత్వంపై పోరాటం చేయడమనేది సాకు మాత్రమే. రాజకీయ గోడపై ఉన్న అద్దంలో గనుక చూసుకుంటే ఎవ్వరూ సచ్ఛీలురు కారనే విషయం అవగతమవుతుంది.**

ఇరుపార్టీల నాయకులు ఒకరికొకరు వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటే ఏది గెలుస్తుంది? రాజకీయమా, నైతికతా, ప్రజా ప్రయోజనాలా, వ్యక్తిగత సర్దుబాట్లా? ప్రజలకు తెలుసుకోగల హక్కున్న ఈ వ్యవహారంలోని వాస్తవం ఎప్పటికైనా ఈ వివాదాల నుంచి బయటపడుతుందా? ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేని సంస్థ ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా విచారణ జరగడం ఇప్పుడు తక్షణావసరం, ఆహ్వానించదగినది కూడా.

('డెక్కన్ హెరాల్డ్' సౌజన్యంతో)

-ఎడిటోరియల్ డెస్క్

జనగణన దిశగా అడుగులు

దేశ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జనగణనకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ నుంచి దేశంలో జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతుండటం శుభపరిణామం. పదమూడేండ్ల తర్వాత జరగనున్న ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు 18 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. చైనాను దాటి అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించిందని గతేడాది ఐక్యరాజ్య సమితి నివేదిక వెలువరించిన నేపథ్యంలో ఈ జనగణన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

2021లో జరగాల్సిన జనగణన ప్రక్రియ కొవిడ్ కారణంగా ఆలస్యమైన విషయం విదితమే. ఆ తర్వాత పలు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇది వాయిదా పడుతూ వచ్చింది. జాప్యం కారణంగా పలు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ జనగణనను పూర్తిచేయడం అనివార్యం. దేశ ప్రజల అవసరాలు, సమస్యలను పరిష్కరించేందుకు ఆ డేటా దోహదపడుతుంది. భారత్ లాంటి దేశాలకు ఈ డేటా ఎంతో సహాయకారిగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే, జనాభాలో సంభవిస్తున్న మార్పులు, లింగ నిష్పత్తి, వలసలు, అక్షరాస్యత, పేదరికం, అసమానతలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర వివరాలు దీని ద్వారా తెలుస్తాయి. కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, పట్టణీకరణ వంటి అంశాలు అవగతమవుతాయి. రాష్ర్టాలకు కేంద్ర నిధుల కేటాయింపు నుంచి మొదలుకొని విద్యాసంస్థల ఏర్పాటు, నియోజకవర్గాల విభజన వరకు అనేక అంశాలు ఈ డేటాపైనే ఆధారపడి ఉంటాయి.

తాజా అంచనా ప్రకారం ఆగస్టు 21 నాటికి మన దేశ జనాభా సుమారుగా 145.27 కోట్లు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇది ప్రపంచ జనాభాలో 17.78 శాతం కావడం గమనార్హం. ఈ లెక్కన ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ గుర్తింపు పొందింది. అసలు జనగణన అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. దేశంలోని ప్రతీ కుటుంబంలోని సభ్యులను క్రమపద్ధతిలో లెక్కించడం, అవసరమైన ఇతర సమాచారాన్ని సేకరించడం, వాటిని నమోదు చేయడం.. ఇలా అనేక ప్రక్రియలతో ముడిపడినదే జనగణన. సంక్షేమం, అభివృద్ధిపై ఇది ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాదు, జాతీయ శాంపిల్ సర్వే, (దేశ ప్రజల జీవన విధానాలకు సంబంధించి అన్ని అంశాలపై సమాచారాన్ని సేకరించే వరుస సర్వేలు), జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వంటి పలు కీలకమైన అధ్యయనాలకు కూడా ఈ డేటా కీలకం. ఈ నేపథ్యంలో దేశ ప్రగతిలో ఎంతో కీలకమైన జనగణన దిశగా ఇప్పటికైనా అడుగులు పడటం సంతోషకరం.

- డాక్టర్ కృష్ణకుమార్ వేపకొమ్మ
98495 62910

తిడితే మహనీయులు కాలేరు!

> **సమాజాభివృద్ధి కోసం, ప్రజా శ్రేయస్సు కోసం కృషిచేసే మహనీయుల ప్రయత్నాలకు ఆటంకం కలిగించేవారు అడుగడుగునా ఉంటారు. వారిపై దుమ్మెత్తిపోసే వారూ ఉంటారు. ప్రపంచ చరిత్రను ఒకసారి పరికిస్తే మనకు ఈ విషయం అవగతమవుతుంది. కారల్‌మార్క్స్, లెనిన్, స్టాలిన్ లాంటి మహనీయులపై కూడా కొందరు దుష్ప్రచారం చేశారు. అలా దుష్ప్రచారం చేసినవారే కాలగర్భంలో కలిసిపోగా.. ఆ మహనీయులు మాత్రం నేటికీ చిరస్మరణీయులుగా మిగిలిపోయారు. ఈ వాస్తవాన్ని కొంతమంది, ముఖ్యంగా రేవంత్‌రెడ్డి లాంటి గాలివాటం ముఖ్యమంత్రులు అస్సలు తెలుసుకోలేరు. కేసీఆర్‌పై, గత బీఆర్ఎస్ సర్కార్‌పై దుష్ప్రచారం చేస్తూ, రోత మాటలు మాట్లాడుతున్న రేవంత్.. కేసీఆర్ గొప్పతనాన్ని, ఆయన చేసిన మంచి పనులను ఎప్పటికీ గ్రహించలేరు.**



పాతూరి వేంకటేశ్వరరావు
98490 81889



గాలివాటమని ఎందుకు అంటున్నానంటే.. కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్‌కు పెట్టుబడి పెట్టి మరీ తెలంగాణలో పార్టీని నడిపించే వారికోసం వెతుకుతున్న సోనియాగాంధీకి కొత్తగా పార్టీలో చేరిన, ఆశావహుడైన రేవంత్‌రెడ్డి కనిపించారు. అంతే, ఆయనను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షున్ని చేసేశారు. అదే సమయంలో తెలంగాణలోనే కాదు, ఇతర రాష్ర్టాలకూ విస్తరించి తనకు, తన పార్టీ బీజేపీకి సవాల్ విసురుతున్న కేసీఆర్‌పై ప్రధాని మోదీ కక్ష పెంచుకున్నారు. అందుకే తెలంగాణలో తన పార్టీ ఓడిపోయినా ఫర్వాలేదు గానీ, రేవంత్‌ను గెలిపించాలనే లక్ష్యంతో ఆయన కేసీఆర్‌ను దెబ్బకొట్టారు. ఇలాంటి పరిస్థితులు దాపురిస్తేనే గదా, మంత్రి కూడా కాని రేవంత్ ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. దీన్ని దేవుడు తనకిచ్చిన సదవకాశంగా భావించి సద్వినియోగం చేసుకునే దిశగా కాకుండా, చరిత్ర చెత్తబుట్టలో పడిన వదరుబోతు నేతల బాటన పరుగులు పెడుతున్నారు పాపం రేవంత్.

అలాగే ప్రాణాలకు తెగించి మరీ ప్రత్యేక రాష్ర్టాన్ని సాధించడమే గాక, దశాబ్దంలోనే తెలంగాణను భారతాగ్ర రాష్ర్టాల సరసన చేర్చిన రాజనీతిజ్ఞుడు కేసీఆర్. అలాంటి కేసీఆర్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తున్న రేవంత్‌ను తెలంగాణ ప్రజలే కాదు, ఇరుగుపొరుగు రాష్ర్టాలవారూ ఛీత్కరిస్తున్నారన్న వాస్తవాన్ని గ్రహించలేకపోవడం నిజంగా ఆయన దురదృష్టమే. సర్వోత్తమ సచివాలయాన్ని నిర్మించి, దానికి రాజ్యాంగకర్త అంబేద్కర్ పేరు పెట్టడం, దాని ముందు సమున్నతమైన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడమే కేసీఆర్ ఔన్నత్యానికి, రాజనీతిజ్ఞతకు, మేధోసంపత్తికి నిలువెత్తు నిదర్శనాలు. సచివాలయం ముంగిట సురుచిర, సుందర తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణే కేసీఆర్ తదుపరి లక్ష్యం. అక్కడ స్థల కేటాయింపే అందుకు నిదర్శనం.

> **అంతేగాని, అక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని నెలకొల్పడమన్నది ఏ కోణంలో చూసినా అసందర్భం, అహేతుకం. రాజీవ్‌గాంధీ దేశ సేవలో ప్రాణాలు కోల్పోయారన్నది వాస్తవం. ఆయన చిరస్మరణీయుడే. కానీ, రాజీవ్ విగ్రహ స్థాపనకు, తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణకో, హితానికో సంబంధం ఉండాలి కదా?**

ఈ విషయంలో కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీల మెజారిటీ ప్రజల అభిప్రాయం ఇలా ఉంది రేవంత్ జీ. అధిష్ఠానం మెప్పు కోసం గాక, రాజీవ్‌గాంధీపై మీకు అవ్యాజమైన ప్రేమ ఉండి ఉంటే, మిమ్మల్ని ముఖ్యమంత్రిని చేసినందుకు సోనియాగాంధీ కుటుంబం పట్ల కృతజ్ఞతతో మీ సొంత నిధులతోనో లేదా మీలాగే కాంగ్రెస్ పట్ల కృతజ్ఞత కలిగిన మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల విరాళాలతోనో తెలంగాణ ప్రగతికి తోడ్పడే వైద్య కళాశాల, యూనివర్సిటీ లాంటి కట్టడం నిర్మించండి. అందులో మీ అభిమాన రాజీవ్‌గాంధీ సుందర విగ్రహాన్ని ప్రతిష్ఠించి, సోనియాగాంధీతో ఆవిష్కరింపజేయండి. అప్పుడు మిమ్మల్ని తప్పుబట్టే హక్కు ప్రజలకు గాని, పార్టీలకు గాని ఉండదు గాక ఉండదు. అంతేకాదు, తద్వారా తెలంగాణ ప్రజల హృదయాల్లో మీదంటూ ఓ ముద్ర వేసుకోగలుగుతారు.


అంతేకానీ, ఎంతోమంది బలిదానాలతో తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాధనంతో నిర్మించుకున్న సచివాలయంలో అధికార బలంతో రాజీవ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం సబబు కాదు. అది ఎలా ఉంటుందంటే?.. ఎన్టీఆర్ శ్రమించి నిర్మించుకున్న టీడీపీలో చంద్రబాబు దూరి దాన్ని సొంతం చేసుకున్నట్టు, చీమలు కష్టపడి నిర్మించుకున్న పుట్టలో సర్పం దూరి దాన్ని సొంతం చేసుకున్నట్టు ఉంటుంది. మీ శ్రేయోభిలాషులు సహా మెజారిటీ తెలంగాణ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు రేవంత్ జీ. తస్మాత్ జాగ్రత్త!

వాళ్లది మహిళా వ్యతిరేక ఆలోచనాధోరణి!



> *బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులది మహిళా వ్యతిరేక ఆలోచనాధోరణి. వారు నారీశక్తి గురించి మాట్లాడతారు కానీ, దేశంలో మహిళలపై దారుణాలు జరిగినప్పుడు మౌనం వహిస్తారు. థానే జిల్లాలోని బద్లాపూర్ (మహారాష్ట్ర)లో బాలికలపై లైంగికదాడి జరిగితే ప్రధాని మోదీ గాని, ఆర్ఎస్ఎస్ నేతలు గాని కనీసం స్పందించలేదు. బీజేపీ నేతృత్వంలోని ఏక్‌నాథ్ షిండే సర్కార్ ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. ప్రజలు రోడ్డెక్కాకే షిండే సర్కార్ విచారణను ముందుకు జరిపింది.*

- రాగిణి నాయక్, మహారాష్ట్ర కాంగ్రెస్ నేత



వీటిని కూల్చే దమ్ముందా?!





అనితర సాధ్యం..అద్దాల ప్రహరి!!



అద్దాల మేడ గురించి వినే ఉంటారు. చూడటం కూడా జరిగే ఉంటుంది. అయితే, కాంపౌండ్ వాల్‌ను కూడా అద్దాలతో నిర్మించడం, అవి కూడా మనిషి కంటే ఎక్కువ ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయడం ఎక్కడైనా చూశారా? అయితే, వెంటనే పక్కనున్న ఫొటోలు చూసేయండి. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో కనిపిస్తున్న ఈ అద్దాల మేడ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సమీప బంధువుదని ఆ ఇంట్లో పనిచేసేవారే చెప్పారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కోడలు ఆమె. ఇందులో కొంతమేర ఎఫ్‌టీఎల్ పరిధి ఉండగా... బఫర్‌జోన్‌లోనూ చాలా మేరకు ఉన్నట్లు తెలుస్తుంది. ఇక్కడ విశేషమేమంటే... ఈ అద్దాల మేడ చుట్టూ గండిపేట జలాశయం విస్తరించి ఉన్నప్పటికీ భూతద్దం వేసి వెతికినా ఎక్కడా ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు కనిపించవు. అవేమయ్యాయో ప్రత్యేకంగా చెప్పాలా?



కూల్చివేతల్లో ఇదో వింత








గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ... తన పరిధిని దాటుకొని పోయి హైడ్రా కూల్చివేసిన మూడు బహుళ అంతస్తుల నిర్మాణాలు ఇవే. ఈ కూల్చివేతలతోనే హైడ్రా అడుగులపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అవుటర్ రింగు రోడ్డు వరకు మాత్రమే హైడ్రా పరిధి అని జీవో నెంబరు 99లో స్పష్టంగా ఉన్నప్పటికీ... అవుటర్ దాటి 15 కిలోమీటర్ల దూరంలోని అప్పోజిగూడలో ఉన్న ఈ నిర్మాణాలను హైడ్రా యంత్రాంగం భారీ క్రేన్లు, పొక్లెయినర్లతో వచ్చి నేలమట్టం చేసింది. హైడ్రా జీవోలో ఎక్స్‌టెండెడ్ యూఎల్‌బీ, జీపీ జాబితాలో కూడా అప్పోజీగూడ లేదు. నోటీసులు ఇవ్వడం మాట దేవుడెరుగు... కనీసం అందులో ఉన్న ఫర్నీచర్, ఇతర సామగ్రిని తీసుకునేందుకు కూడా సమయం ఇవ్వకుండా క్షణాల్లో ఈ నిర్మాణాలను కూల్చివేశారు. అయితే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే... ఈ నిర్మాణాలు ఒక వెంచర్‌లో ఉన్నాయి. వెంచర్ ముఖద్వారం నుంచి లోపలికి వెళ్లగానే కుడివైపు గండిపేట చెంతనే భారీ నిర్మాణాలు (ఇప్పుడు కూల్చివేసిన నిర్మాణాలకు సమాంతరంగా) కొనసాగుతున్నాయి. హైడ్రా యంత్రాంగం వాటి ముందుగానే కూల్చివేతలకు వెళ్లిందని అర్థమవుతుంది. ఇక హైడ్రా కూల్చివేసిన మూడు నిర్మాణాల వెనక (మధ్యలో రోడ్డు) మరో భారీ నిర్మాణం రూపుదిద్దుకుంటున్నది. దీంతో ఆ నిర్మాణం ముందు నిలబడే హైడ్రా యంత్రాంగం కూల్చివేతలు చేపట్టింది. ఇంకాస్త ముందుకు వెళితే రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సమీప బంధువుగా చెబుతున్న అద్దాల మేడ ఉంటుంది. కూల్చివేసిన నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే మిగిలిన నిర్మాణాలు అవే పరిధిలో ఎందుకు రావో అటు జలమండలి, ఇటు హైడ్రా యంత్రాంగానికే తెలియాలి. కనీసం సామాన్యుడు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించుకునేందుకు అక్కడ ఎక్కడా హద్దు రాళ్లు లేవు. పోనీ... కూల్చివేసిన నిర్మాణాల వరకు మాత్రమే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందనే సాకును చూపినా... ఎలాగూ వంద ఫీట్ల బఫర్ జోన్ ఉంటుంది. బఫర్ జోన్‌ను రక్షించాల్సిన బాధ్యత కూడా ఇదే యంత్రాంగంపై ఉంది. కానీ ఆ బాధ్యతను విస్మరించడమే ఇప్పుడు హైడ్రా అడుగులపై విస్తృత చర్చకు దారి తీసింది.










గండిపేటకు చెంత చెలి‘మేడ’!!

గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో రూపుదిద్దుకున్న ఈ గెస్ట్ హౌస్ గ్రీన్‌కో గ్రూపు ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ది. ప్రధాన రహదారి నుంచి మొదలై జలాశయం ఎఫ్‌టీఎల్‌లోకి చొరబడి మరీ ఈ గెస్ట్‌హౌస్ నిర్మాణాన్ని చేపట్టారు. అంటే ఈ గెస్ట్‌హౌస్ ఏ మేరకు విస్తరించి ఉందో మీరే ఊహించుకోండి. ఇందులో మరో విశేషమేమిటంటే... రోడ్డు వైపునకు ఎవరైనా ఇంటి గేటు పెడతారు. అయితే ఈ గెస్ట్‌హౌస్‌కు రహదారివైపు ప్రహరి నిర్మాణాన్ని చేపట్టి.. లోపల జలాశయం వైపు మాత్రం ఇనుప కంచె వేశారు. అంతటితో ఆగకుండా ఆ ఐరన్ ఫెన్సింగ్‌తోనే జలాశయం ఎఫ్‌టీఎల్‌ను వీళ్లు నిర్ధారించారనే ఆరోపణలు ఉన్నాయి. అంటే ఒకవిధంగా గండిపేటకే హద్దు నిర్ణయించారన్న మాట.



హద్దురాయి సాక్షిగానే నిర్మాణాలు





సాగరం ఒడ్డున.. పంట పొలాల మధ్యలో రాజసాన్ని ఒలకబోసేలా నిర్మించిన ఈ ఫాంహౌస్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిది. హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ హద్దు రాయి సాక్షిగా ఈ భారీ నిర్మాణం రూపుదిద్దుకున్నది. నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. అయినప్పటికీ ఈ భారీ నిర్మాణాన్ని చేపట్టారు. అంతేకాదు.. ఈ ఫాంహౌస్ గేటు ముందు ఉన్న ఖాళీ ప్రదేశంలోనే ఫ్లోరింగ్‌ను గ్రానైట్ బండలతో నింపడాన్ని చూస్తే, ఈ భవనం ఎంత ఖరీదైందో అంచనా వేసుకోవచ్చు.




రంగరంగా..పక్కది కూలిందెట్ల... ఇది కూలదెట్ల?!

ఇటీవల హైడ్రా కూల్చివేసిన నిర్మాణం ఇది. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నందున కూల్చివేశామనేది హైడ్రా స్పష్టీకరణ. మరి... దానిని ఆనుకునే మరో నిర్మాణం ఉంది. అది ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదా? అనేది సామాన్యుడి సందేహం. ఒకవేళ కూల్చివేయని నిర్మాణం పక్కనుంచే ఎఫ్‌టీఎల్ గీత వెళ్లిందనే సాకు చూపే అవకాశాలు ఉండొచ్చు. అదే నిజమైతే... ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని వంద ఫీట్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది. బఫర్‌జోన్‌ను కాపాడాల్సింది కూడా అదే హైడ్రా కదా! కానీ ప్రత్యేకంగా ఓ నిర్మాణాన్ని కూల్చడం.. మరో నిర్మాణాన్ని కూల్చకుండా వదిలేయడం అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.




హైడ్రాకు కనిపించని గెస్ట్‌హౌస్..



గండిపేట జలాశయం బఫర్‌జోన్‌తో పాటు కొంతమేర ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ నిర్మాణమైన ఈ గెస్ట్‌హౌస్ కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజుది. అందుకే హైడ్రాకు ఇది కనిపించలేదు. ఇదే వరుసలో ఉన్న ఒక స్పోర్ట్స్ అకాడమీ పరిధిలోని నిర్మాణాలను ఇటీవలే హైడ్రా యంత్రాంగం కూల్చివేసింది. కానీ దీని జోలికి మాత్రం రాలేదు. అసలు హైడ్రా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. విషయమేంటని ఆరా తీస్తే, కూల్చివేతలకు హైడ్రా సిద్ధమైందని తెలియగానే.. సదరు కేంద్ర మాజీ మంత్రివర్యులు ఆగమేఘాల మీద ఢిల్లీ నుంచి ఫోన్లు చేయించారని రాజకీయవర్గాల్లో గుప్పుమన్న ప్రచారం. ఇది సక్రమ నిర్మాణమా?? అక్రమ నిర్మాణమా?? అని దీన్నిబట్టి అర్థమవ్వట్లేదూ..!

అసలు గండిపేట ఎఫ్‌టీఎల్ ఎంత?



జలమండలి గందరగోళం

ఒకసారి 1792 అడుగుల ఎఫ్‌టీఎల్... మరోసారి 1790 అడుగుల ఎఫ్‌టీఎల్

ఇందులో ఏ ఎఫ్‌టీఎల్ సరైనది.. ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గించింది ఎవరు?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఉస్మాన్‌సాగర్ (గండిపేట) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యంపై ఆది నుంచి గందరగోళం కొనసాగుతుంది. జలమండలి రికార్డుల్లోనే 1792 అడుగుల ఎఫ్‌టీఎల్, 1790 అడుగుల ఎఫ్‌టీఎల్ ఉంది. ఈ మేరకు నిర్ధారణ మ్యాప్‌లు కూడా ఉన్నాయి. ఇదేమంటే... 1970 దశకంలో హైదరాబాద్ నగర తాగునీటికి జంట జలాశయాలు మాత్రమే శరణ్యమైనందున ఎక్కువ నీటి కోసం 1792 అడుగుల వరకు నీటిని నిల్వ చేసేవారు. అందుకు అనుగుణంగా గతంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కూడా జరిగింది. అంటే ఆ రెండు అడుగుల్లో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అంటే అదే స్థాయిలో నిర్మాణాలూ ఉన్నాయి. అయితే కాలానుగుణంగా మంజీరా, కృష్ణా, గోదావరి జలాలు వచ్చాక అవసరాలు తగ్గి 1790 ఎఫ్‌టీఎల్‌ను కొనసాగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఒకసారి ఎఫ్‌టీఎల్‌ను నిర్వహించిన తర్వాత దానిని తగ్గించడమేంది? అనేది నిపుణుల విస్మయం. నీటిని నిల్వ చేసుకోకపోవచ్చుగానీ ఎఫ్‌టీఎల్‌ను రికార్డుపరంగా తగ్గించడమేందని వారు ప్రశ్నిస్తున్నారు. జలమండలి అధికారులు చెబుతున్న కారణాన్ని ప్రామాణికంగా తీసుకుంటే... జంట జలాశయాల నుంచి అవసరం తగ్గినందున ఎఫ్‌టీఎల్ కుదించారనుకుంటే అసలు ఆ రెండు జలాశయాలు లేకున్నా ఇప్పుడు హైదరాబాద్ తాగు నీటి అవసరాలు తీరతాయి. అలాంటప్పుడు అసలు ఎఫ్‌టీఎల్ పరిధి అవసరమా? అనేది నిపుణుల సూటి ప్రశ్న. చారిత్రక జలాశయాలను ఇంకా పది కాలాలు కాపాడాల్సిన బాధ్యత జలమండలిపైనే ఉంది. పైగా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్ నుంచి ఐదు టీఎంసీల గోదావరిజలాలను జంట జలాశయాలకు తరలించేందుకు కొన్నిరోజుల కిందటనే వేల కోట్లతో తాగునీటి పథకానికి పాలనా ఆమోదం కూడా ఇచ్చింది. దీంతో జలాశయాల్లో పుష్కలంగా గోదావరిజలాలను నిల్వ చేసుకునే వీలుంటుంది. అయినా అధికారులు 1790 అడుగులను ప్రామాణికంగా తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

వాస్తవంగా చెప్పాలంటే...


జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ అనేది ఓ బ్రహ్మ పదార్థం. జలమండలి దశాబ్దాల నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణం. ఈ రెండు జలాశయాల పరిరక్షణ వ్యవహారం అనేది సుప్రీం కోర్టు పరిధిలోకి కూడా వెళ్లింది. ఆ సందర్భంగా జలాశయాల పరిరక్షణకు జలమండలి చాంతాడంత ప్రణాళిక రూపొందించుకొని సుప్రీం కోర్టుకు సమర్పించింది. అందులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌తో పరివాహక పరిరక్షణకు ప్రత్యేక స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాల నివారణతో పాటు నిర్మాణ వ్యర్థాలను అందులో పడబోయకుండా ఉండేందుకు 24 గంటల నిఘా ఉండేలా బృందాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం ఏటా కోట్ల రూపాయలు వెచ్చించారు. కానీ అన్నీ ఉన్నా అల్లుడి నోట్ల శని! అన్నట్లు అధికార యంత్రాంగం సాక్షిగానే ఏటా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఫాంహౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు మాత్రమే కాకుండా ఏకంగా విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, రెస్టారెంట్లు, పబ్‌లు కూడా వెలిశాయి. దీంతో దశాబ్దాల కిందట జలమండలి అధికారులు అమర్చిన ఎఫ్‌టీఎల్ రాళ్లు కొన్ని నడక నేర్చి ముందుకు జరిగితే, చాలా వరకు జల సమాధి అయ్యాయి. ప్రస్తుతం రెండు జలాశయాల పరిధుల్లో పట్టుమని పది హద్దు రాళ్లు కూడా కంటికి కనిపించవు.



ముందు నాయకుల అక్రమ కట్టడాలు కూలగొట్టండి


శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా ఎఫ్‌టీఎస్, బఫర్‌లోని ప్రతి నిర్మాణాన్ని చూడాలని, అవసరమైతే రంగనాథ్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ హితవు పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వీ6 వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, పట్నం మహేందర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి వంటి నాయకుల అక్రమ కట్టడాలు నేలమట్టం చేసి, ఆ తర్వాత సామాన్యుల మీద పడాలని స్పష్టంచేశారు.

• 1792 అడుగులు.. 1790 అడుగులు..?



అసలు గండిపేట జలాశయం ఫుల్‌ట్యాంక్ లెవెల్ ఎంత? జలమండలి లెక్కల ప్రకారమే ఒక మ్యాప్‌లో 1792 అడుగులు అని పేర్కొనగా.. మరొక మ్యాప్‌లో 1790 అడుగులు అని తెలిపింది. అదేమంటే ఎఫ్‌టీఎల్‌ను తగ్గించినట్టు జలమండలి చెప్తున్నది. ఎందుకంటే నగరానికి తాగునీళ్ల కోసం ఇతర వనరులు అందుబాటులోకి వచ్చినందున ఎఫ్‌టీఎల్‌ను రెండు అడుగులు తగ్గించినట్టు దాని వివరణ. రెండు అడుగులు తగ్గించడమంటే ఎఫ్‌టీఎల్‌కి బఫర్‌కు మధ్యన విశాలమైన భూమిని వదిలేసినట్టు. అసలు ఫుల్‌ట్యాంక్ లెవల్ అంటేనే జలాశయం భర్పూర్‌గా, పూర్తిగా నిండినప్పుడు నీళ్లు ఎక్కడిదాకా నిలిచి ఉంటాయనే లెక్క. ఎవరైనా మన అవసరాల కోసం ఆ లెక్కను తగ్గిస్తారా? మరి జలమండలి ఎలా తగ్గించింది.

హైడ్రాపై హైకోర్టు ఏమన్నది?



1. *హైడ్రాకు ఉన్న పరిధులు ఏమిటి? అధికారాలు ఏమిటి? రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొని, స్థానిక కార్యాలయ అనుమతితో నిర్మాణాలు చేపడితే.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారు? అక్రమ కట్టడాలైనా చట్ట ప్రకారం చేయాలి కదా? నిర్మాణం జరిగిన 15-20 ఏండ్లకు హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణం అని కూల్చివేయటమేమిటి? పదేండ్లుగా ఇంటి పన్ను కట్టించుకొని.. ఇప్పుడు కూల్చివేస్తే ఆ వసూళ్లకు అర్థమేమిటి? ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా?*
2. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉంటే నిబంధనల ప్రకారం నోటీసులు జారీచేసి.. చట్టప్రకారం అనుసరించాలి. విక్రయ దస్తావేజులు, నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను రశీదు.. మొదలైన వాటిని పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకోవాలి.
3. పిటిషనర్ ఫాంహౌజ్ ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు జారీచేసి ఉంటే అవి ఎప్పుడు జారీ చేశారో ఆ వివరాలను ప్రభుత్వం సమర్పించాలి.
4. కూల్చివేతలకు ముందు సంబంధిత అధికారి చట్టప్రకారం భవన యజమానికి నోటీసు ఇవ్వాలి కదా? నోటీసు ఇవ్వకుండా కూల్చివేయొచ్చా? ఏ అధికారం కింద కూల్చివేస్తారు? నోటీసు ఇవ్వాలి. ఆక్రమణదారుల, అనధికార నిర్మాణదారుల హక్కుల పత్రాలను ప్రాథమిక పరిశీలన చేయాల్సిందే.

నా ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేయండి



- **హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నా**
- **బీఆర్‌ఎస్ నేతలు నా ఇంటిని కొలుచుకోండి**
- **ఒక్క ఇటుక బఫర్ జోన్‌లో ఉన్నా కూల్చేయండి**
- **మీడియాతో మంత్రి పొంగులేటి సవాల్**

హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): తన ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో గానీ, బఫర్ జోన్‌లో గానీ ఉన్నట్టయితే వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక్క ఇటుక బఫర్ జోన్‌లో ఉన్నా, ఇల్లు మొత్తం కూల్చేయాలని సూచించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన పొంగులేటి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఈ మేరకు సమాధానమిచ్చారు. తన ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదంటూ బీఆర్‌ఎస్ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యతపై తనపై ఉన్నదని చెప్పారు. 'రెవెన్యూ మంత్రి ఇల్లు హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉన్నదని అంటున్నారు. నేను చాలెంజ్ విసురుతున్నా. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నాను. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా ఎంతమంది వస్తారో రమ్మనండి. అందర్నీ తీసుకెళ్లి నా ఇల్లు కొలవండి. ఒకవేళ నా ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉన్నదని తేలితే మొత్తం కూలగొట్టండి. ఒక్క ఇటుక పెద్ద ఉన్నా సరే మీరే కూలగొట్టండి. ఇది నా చాలెంజ్' అని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ నేతలు తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. పేదలు నష్టపోవద్దనే మంచి ఉద్దేశంతోనే ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చిందని తెలిపారు. ఎవరు నిబంధనలకు వ్యతిరేకంగా ఇల్లు నిర్మించినా కూల గొడతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న తమ పార్టీకి చెందిన మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు సోదరుడికి సంబంధించిన బిల్డింగ్‌ను కూడా కూల్చేసినట్టు తెలిపారు.



అప్పోజిగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

'పరిధి' దాటిన హైడ్రా

గత నెల 19వ తేదీన హైడ్రా ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు (జీవో 99) జారీ చేసింది. అందులో స్పష్టంగా 'పరిధి'ని పేర్కొంది. అవుటర్ రింగు రోడ్డును సరిహద్దుగా నిర్ధారిస్తూ.. అందులోకి వచ్చే పట్టణ, గ్రామీణంలోని స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల పేర్లను కూడా పొందుపరిచింది. అయితే జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధుల్లో ఉన్నాయంటూ ఈ నెల 18వ తేదీన హైడ్రా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌తో పాటు మొయినాబాద్ మండలంలోని అప్పోజీగూడ, చిలుకూరు, హిమాయత్‌నగర్ పరిధుల్లో పలు భారీ నిర్మాణాలను కూల్చివేసింది. వాస్తవానికి ఈ గ్రామాలన్నీ అవుటర్ రింగు రోడ్డు బయట ఉన్నాయి. అంటే ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరిచిన పరిధిని దాటి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఖానాపూర్ అంటే అవుటర్ లోపల ఉన్న నార్సింగి మున్సిపాలిటీ పరిధి అని సమర్థించుకుంటున్నారు. కానీ అప్పోజీగూడ, చిలుకూరు, హిమాయత్‌నగర్ వేటికవే స్వతంత్ర గ్రామపంచాయతీలతో పాటు అవుటర్ వెలుపల ఉండటంతో హైడ్రా అడుగులపై అనుమానాలు మొదలయ్యాయి. అవి అక్రమ నిర్మాణాలే కావచ్చుగానీ హైడ్రా ఎందుకు పరిధి దాటి వాటిని కూల్చివేయాల్సి వచ్చిందనేది సామాన్యుడిలోనూ సందేహాన్ని రేకెత్తించింది. అదే రాజకీయ మలుపునకు కారణమైంది.

111 జీవో రైతుల త్యాగానికి అర్థమేది?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాల పరిరక్షణకు 111 జీవో అమలులోకి వచ్చింది. ఈ జీవో పరిధిలోని 84 గ్రామాల్లో లక్ష ఎకరాలకు పైగా భూముల్లో ప్రత్యేక ఆంక్షలు అమలవుతున్నాయి. ఉన్న విస్తీర్ణంలో కేవలం పది శాతం మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి, మిగతా దాని లో సాగు సంబంధిత కార్యకలాపాలు మాత్ర మే చేయాలి. అందుకే చెంతనే హైదరాబాద్ నగరంలో ఆకాశహర్మ్యాలు వెలిసినా ఆ లక్ష ఎకరాలకు పైగా భూముల్లో మాత్రం ఏమీ చేయలేని పరిస్థితి ఉండటంతో భూముల విలువ కూడా పెద్దగా పెరగలేదు. అంటే రైతుల త్యాగా ల మీద జంట జలాశయాల పరిరక్షణ కొనసాగుతుంది. కానీ ప్రభుత్వ, అధికార యంత్రాంగాల నిర్లక్ష్యం పుణ్యాన ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధుల్లోనే భారీ నిర్మాణాలు వెలియడంతో ఆ రైతుల త్యాగాలకు సార్థకత కూడా లేకుండాపోయింది.

రేవంత్ రాజకీయ హైడ్రామా!

➤ మొదటిపేజీ తరువాయి...

కూడా ఆ ఏజెన్సీపైనే ఉంది. అంతకుమించి జంట జలాశయాల పరిధిలో దశాబ్దాలుగా విలాసవంతమైన ఫాంహౌస్‌లు ప్రజల అనుభవంలోనే ఉన్నప్పటికీ నాలుగైదు నిర్మాణాల్ని లక్ష్యంగా ఎంచుకొని హైడ్రా వాటిని నేలమట్టం చేయడమే ఇప్పుడు 'దాల్‌మే కుచ్ కాలాహై!' అన్న అనుమానాలను కలిగిస్తున్నది. అంతకుమించి ప్రభుత్వ ఉత్తర్వుల్లో నిర్ధారించిన హద్దును దాటి ఆ ఏజెన్సీ అడుగులు వేస్తుండటం రాజకీయ ప్రతీకార చర్యలకు హైడ్రా పావుగా మారుతుందనే సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్తులు... వారసత్వ సంపదగా వస్తున్న అమూల్యమైన నీటి వనరులను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గిరిగీసి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలి... నిర్మాణమెవరిదైనా సరే రాజకీయాలకు అతీతంగా కూల్చివేతల యజ్ఞాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలి. అప్పుడు ప్రజలు 'శభాష్' అంటారు. కానీ అయినవారికి అంచున... కానివారికి కంచాన అన్నట్లుగా బుల్డోజర్లు ప్రయోగిస్తామంటే ప్రభుత్వమే అభాసుపాలవుతుంది. ముఖ్యంగా దశాబ్దాలుగా జంట జలాశయాల గొంతునులిమే రీతిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా 'సంతృప్తి'కరంగా నిర్లక్ష్యం చేసిన జలమండలి మాటలు పట్టుకొని కూల్చివేతల్ని కొనసాగిస్తే అంతిమంగా ప్రజలకు సమాధానం చెప్పాల్సింది హైడ్రానే అన్న వాస్తవాన్ని కమిషనర్ రంగనాథ్ గుర్తించాల్సిన ఆవశ్యకత ఉంది.



ఈ ప్రశ్నలకు బదులేది?!

- జంట జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం నడుం బిగించడంలో భాగంగానే ఈ నెల 18న హైడ్రా కూల్చివేతలకు పాల్పడవచ్చు. కానీ కేవలం ఈ నిర్మాణాలు మాత్రమే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయా? అనేది కీలకమైన ప్రశ్న.
- ముఖ్యంగా వీటికి ముందు జలమండలి రెండు జలాశయాల పరిధుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించిందా? అందుకు అనుగుణంగా హద్దు రాళ్లను అమర్చిందా? గతంలోనే అమర్చామని అధికారులు చెబుతున్నా... 80 శాతానికి పైగా రాళ్లు ఇప్పుడు లేవు. అలాంటప్పుడు అధికారులు కండ్లతో చూసి ఎఫ్‌టీఎల్‌ను ఎలా నిర్ధారిస్తారు?
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని హైడ్రా కూల్చివేసిన నిర్మాణాలను నిర్ధారించింది ఎవరు? ఒకవేళ జలమండలి అధికారులే నిర్ధారిస్తే పక్కనే ఉన్న నిర్మాణాలను ఎందుకు విస్మరించారు? అసలు కూల్చివేసిన చోట్ల ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు ఎక్కడ ఉన్నాయి?
- అత్యంత కీలకమైనది... హైడ్రా కూల్చివేసిన ప్రతి చోటా దాని చెంతనే మరికొన్ని నిర్మాణాలు ఉన్నాయి. దీంతో కూల్చివేసిన నిర్మాణాల వరకే ఎఫ్‌టీఎల్ ముగుస్తుందని సమర్థించుకున్నా... ఎఫ్‌టీఎల్‌ను అనుసరించి వంద ఫీట్ల (30 మీటర్లు) వరకు బఫర్‌జోన్ ఉంటుంది కదా. కనీసం కూల్చివేయని నిర్మాణాలు బఫర్‌జోన్ పరిధిలోకైనా వస్తాయి కదా.. ఎఫ్‌టీఎల్‌ను రక్షించే బాధ్యత తీసుకున్న హైడ్రా, జలమండలి బఫర్‌జోన్‌ను నిబంధనల ప్రకారం ఎందుకు పరిరక్షించడంలేదు? ఆబాధ్యత ప్రభుత్వంపై లేదా?!
- గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ వరకు జలాలను తరలించేందుకు నిజాం కాలంలోనే కాండ్యూట్ (రాతి కాల్వ) నిర్మాణం జరిగింది. నిబంధనల ప్రకారం ఈ కాండ్యూట్‌కు ఇరువైపులా వంద ఫీట్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. కానీ అనేకచోట్ల దానిని ధ్వంసం చేసి మరీ నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు ఉన్నాయి. ఇరువైపులా దేవుడెరుగు... ఏకంగా కాండ్యూట్‌పైనే బహుళ అంతస్తులు ఉన్నాయి. మరి హైడ్రా నుంచి వాటికి మినహాయింపు ఎందుకు?
- హైడ్రా జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాల కూల్చివేతలకు ముందు జలమండలి అధికారులు గండిపేటకు సంబంధించి 1792 అడుగులు, 1790 అడుగుల మ్యాప్‌లను సిద్ధం చేసుకున్నారు. దీనిపై విస్తృతంగా చర్చించారు. గతంలో జలాశయాల పరిధిలో పని చేసిన అధికారులను సైతం పిలిపించుకొని సమీక్షించారు. అలాంటప్పుడు గండిపేట ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి 1790 అడుగులను మాత్రమే ఎందుకు ప్రామాణికంగా తీసుకున్నారు?

జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరిగిందా?

ఉస్మాన్‌సాగర్ (గండిపేట) ఎఫ్‌టీఎల్ 1792 అడుగులు... 1790 అడుగులు. అంటే వీటికి అదనంగా వంద ఫీట్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది.

హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ 1763 అడుగులు. దీనికి అదనంగా వంద ఫీట్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది.

ఎఫ్‌టీఎల్ అంటే...

ఒక చెరువుగానీ పెద్ద జలాశయం గానీ దాని పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం పరిధిని ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) అంటారు. వర్షాలు వచ్చినపుడు, దాని పరివాహక ప్రాంతం నుంచి వరద వచ్చినపుడు అది నిండుకుండలా మారుతుందో... కొన్ని దశాబ్దాల రికార్డులను పరిశీలించి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తారు. నగర శివారులోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) ఎఫ్‌టీఎల్‌ను కూడా నిర్మాణ డిజైన్ సమయంలోనే నిర్ధారించారు. ఈ క్రమంలో ఇప్పుడు నీళ్లున్న ప్రాంతం మాత్రమే ఎఫ్‌టీఎల్ అనుకోవడానికి వీలు లేదు. ఎగువ నుంచి వరద వచ్చే మార్గాలు మూసుకుపోవడం, గతంలో కురిసిన స్థాయిలో ఎగువన వర్షాలు లేకపోవడంతో రెండు జలాశయాలు ప్రతి ఏటా పూర్తిస్థాయిలో నిండటం లేదు. అందుకే ఇప్పుడు జలాశయాల్లో నీళ్లున్న ప్రాంతాన్ని చూపి... నిర్మాణాలు దూరంగా ఉన్నాయంటే అవి నిజంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో లేనట్లు కాదు! ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములు ఉన్నా నీళ్లు లేనపుడు వ్యవసాయం చేసుకోవచ్చు. వచ్చినపుడు ఆ భూముల్ని వదిలివేయాలి. ఎఫ్‌టీఎల్ పరిధిలో సెంటు జాగాలో కూడా నిర్మాణాలు చేపట్టవద్దనేది నిబంధన.

బఫర్‌జోన్ అంటే...

ప్రతి నీటి వనరు బతికి బట్టకట్టాలంటే దాని పరీవాహక ప్రాంతం నుంచి అందులోకి వరద నీరు సక్రమంగా రావాలి. దీంతో పాటు అది కలుషితం కాకుండా ఉండాలి. అందుకే ప్రతి నీటి వనరు దాని విస్తీర్ణం ఆధారంగా బఫర్‌జోన్‌ను నిర్ధారిస్తారు. ఈ క్రమంలో 25 హెక్టార్లు, అంతకుమించి విస్తీర్ణంలో ఉన్న చెరువు, జలాశయాల బఫర్‌జోన్‌లో నిర్ధారణకు 30 మీటర్లను ప్రామాణికంగా తీసుకున్నారు. అంటే జంట జలాశయాల పరిధిలో చుట్టూ ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని 30 మీటర్లు (వంద ఫీట్లు) బఫర్‌జోన్‌గా ఉంటుంది. ఇక్కడ కూడా కేవలం సాగు సంబంధిత కార్యకలాపాలు మాత్రమే చేపట్టాలి తప్ప నిర్మాణాలు చేపట్టకూడదు అనేది నిబంధన.

'లీడర్' సినిమాలో గొల్లపూడి డైలాగ్స్



ఒకడు కష్టపడి పనిచేసి చికెన్ బిర్యానీ తెచ్చుకుంటాడు. వాడి దగ్గర చికెన్ ముక్క లాక్కున్నామనుకో..అన్నంలో పప్పు కలుపుకొని తింటాడు..పప్పు లాక్కున్నామనుకో..చారు కలుపుకొని తింటాడు.. అన్నమే లాక్కున్నామనుకో..వాడు కంగారుపడి అటూఇటూ చూస్తాడు.. అప్పుడు మనం రైస్ ఫ్రీ అనాలి...వాడు ఎగిరి గంతేసి..పనిని..చికెన్ బిర్యానీని మరచిపోయి మన దగ్గర బానిసలా పడి ఉంటాడు.

***

బిల్లు పాసవ్వాలని ఉందా? అయితే ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను అందులోంచి మినహాయించు.. ఎవరు చెప్పారయ్యా నీకు మా మీదే ఎంక్వైయిరీలు వేయించుకోవడానికి మేమే చట్టాలు చేయాలా? నేను చెప్పినట్లు చేయి..బిల్లు పాసైపోద్ది..



జలమండలి వైఫల్యం

- **హద్దు రాళ్ల ఏర్పాటు, నిర్వహణలో ఫెయిల్**
- **ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణలోనూ అంతే**
- **జలాశయాల నీటి విడుదలలోనూ హైడ్రామా**
- **ప్రముఖుల గెస్ట్‌హౌజ్‌లు మునగకుండా జాగ్రత్త**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం నిర్ణయిస్తే... జలమండలి ముందుగా కనీస బాధ్యతగా చేపట్టాల్సింది... ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ. ఆ మేరకు క్షేత్రస్థాయిలో హద్దు రాళ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి. అప్పుడు హైడ్రా రంగంలోకి దిగి వాటి పరిధిలో ఉన్న వాటిని రాజకీయాలకు అతీతంగా నేలమట్టం చేయాలి. కానీ గండిపేట పరిధిలో కేవలం ఏడు నిర్మాణాలను మాత్రమే ఎందుకు కూల్చారు? వీటిని కూల్చాలని, అవి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని నిర్ధారించింది ఎవరు? ఆ బాధ్యత జలమండలిదే అయినందున అధికారులు మిగిలిన వాటిని ఎందుకు విస్మరించారు? ముఖ్యంగా గతంలో అనేకసార్లు జలమండలి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలపై సర్వే చేసింది. ప్రముఖుల ఫాంహౌస్‌లు ఉన్నాయని కూడా గుర్తించింది. అదే నివేదికను హైడ్రా ముందు ఉంచితే సరిపోతుంది కదా. దానిని అటకెక్కించి ఈ ఏడు నిర్మాణాలను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? ఒకవేళ అవి ఇప్పుడు నిర్మాణమైనందున అని అధికారులు సమర్థించుకున్నా... అప్పోజిగూడలో నిర్మాణ దశలో ఉన్నవి కూడా ఉన్నాయి. వాటిపై ఎందుకు శీతకన్ను ప్రదర్శించారు? ఇలా అనేక సందేహాలు, అనుమానాలకు అటు హైడ్రా, ఇటు జలమండలి... వీరికి మించి రేవంత్ సర్కారు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరముంది.

నీటి విడుదలల్లోనూ మతలబు...

జంట జలాశయాల నుంచి నీటి విడుదలలోనూ హైడ్రామా చోటుచేసుకుంటుందని స్థానికులు చెబుతున్నారు. జలాశయాల్లో ఏస్థాయిలో ఎంత నీటిమట్టం వస్తే ఏ ప్రముఖుడి గెస్ట్‌హౌస్ కిందకు నీళ్లొస్తాయనే వివరాలూ జలమండలి యంత్రాంగానికి తెలుసునని స్థానికుడు ఒకరు తెలిపారు. అందుకే చాలా సందర్భాల్లో పూర్తిస్థాయి నీటి నిల్వ రాకుండానే ఎగువ నుంచి భారీ వరద వస్తుందంటూ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. లోతుగా పరిశీలిస్తే... జలాశయాల్లో భారీ ఎత్తున పూడిక పేరుకుపోయింది. దీంతో జలాశయాల్లోకి ఎఫ్‌టీఎల్ స్థాయిలో నీళ్లు వచ్చినట్లు బండ్ వద్ద సాంకేతికంగా కొలత చూపినా... అందుకు అనుగుణంగా జలాశయంలో వరద (ఫోర్‌షోర్ పరిధి నిర్ధారణ మేరకు ఉండదు) పరుచుకోదు. ఇది కూడా యంత్రాంగానికి ఒక వరంగా మారిందంటున్నారు. దీనికి తోడు ఆక్రమణల సందర్భంగా ఏడెనిమిది అడుగుల మేర మట్టి నింపడం కూడా బండ్ దగ్గర ఎఫ్‌టీఎల్ మేర నీటి నిల్వ లేకున్నా సాంకేతికంగా నీటిమట్టం పెరిగినట్లు కనిపిస్తుందని చెబుతున్నారు. ఇలా జలాశయాల నిర్వహణ, సాంకేతిక అంశాల్లో అనేక లోపాలు ఉన్నాయి. ఇవన్నీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే గతంలో నిర్ధారణ జరిగిన ఎఫ్‌టీఎల్‌కు ఇప్పుడున్న క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య తేడాలు ఉన్నాయని రిటైర్డ్ ఇంజినీర్లు స్పష్టం చేస్తున్నారు.

ఏపీలో మరో ఫార్మా కంపెనీలో ప్రమాదం

- పరవాడ ఫార్మాసెజ్‌లో కార్మికులకు తీవ్రగాయాలు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏపీలోని అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్ సంస్థలో గురువారం అర్ధరాత్రి నలుగురికి గాయాలయ్యాయి. బీ-బ్లాక్‌లోని మొదటి అంతస్తు రియాక్టర్‌లో కెమికల్ చార్జింగ్ చేస్తుండగా మ్యాన్‌హోల్ నుంచి రసాయనం ఉప్పొంగి కార్మికులపై పడింది. దీంతో జార్ఖండ్‌కు చెందిన లాల్‌సింగ్, కోహర్, రోస, విజయనగరానికి చెందిన కెమిస్ట్ సూర్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను విశాఖలోని ఇండస్ దవాఖానకు తరలించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇటీవల ఇదే జిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 18 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా..

- మద్యం మత్తులో నాటుపడవ ఎక్కిన యువకులు
- విజయవాడ రూరల్ పాతపాడులో ఇద్దరు మృతి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని విజయవాడ రూరల్ మండలం పాతపాడులో ఐదుగురు స్నేహితులు మద్యం సేవించి చేపల చెరువు వద్దకు వెళ్లారు. నాటుపడవ ఎక్కి సెల్ఫీలు దిగుతుండగా అది పుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో శివానంద్ (23), రవికుమార్ (21) మృతిచెందగా మరో ముగ్గురిని స్థానికులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి మెట్టుమార్గంలో ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని చిత్తూరు నగరం బంగారురెడ్డిపాలేనికి చెందిన సతీశ్, రాధిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చిన వీరు శుక్రవారం తిరుమలలో 450వ శ్రీవారి మెట్టు వద్ద పురుగుల మందు తాగారు. గమనించిన భక్తులు టీటీడీ సెక్యూరిటీకి సమాచారం అందించడంతో వారు ప్రేమ జంటను దవాఖానకు తరలించారు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు.

టీ-ఫైబర్‌కు 1,779 కోట్ల రుణమివ్వండి

- రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ కనెక్షన్ ఇస్తాం
- 93 లక్షల గృహాలకు ఫైబర్ కనెక్షన్ మా లక్ష్యం
- జాతీయ క్రీడల నిర్వహణకు చాన్స్ ఇవ్వండి
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): టీ-ఫైబర్‌కు రూ.1,779 కోట్ల మేర వడ్డీలేని దీర్ఘకాలిక రుణం ఇవ్వాలని కేంద్ర టెలికం, కమ్యూనికేషన్లశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. టీ-ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్-3గా మార్చేందుకు సమర్పించిన డీపీఆర్‌ను ఆమోదించాలని విజ్ఞప్తిచేశారు. ఢిల్లీలో శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం కేంద్రమంత్రులను వేర్వేరుగా భేటీ అయ్యారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లోని 30 లక్షల గృహాలకు నెలకు రూ.300కే ఫైబర్ కనెక్షన్ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర మంత్రి సింధియాకు తెలిపారు. టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని వివరించారు. రాష్ట్రంలో 300 రైతు వేదికలకు టీ-ఫైబర్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, సాంఘిక సంక్షేమ పాఠశాలలకూ టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ (ఎన్‌వోఎఫ్‌ఎన్) తొలిదశను భారత్‌నెట్-3 ఆర్కిటెక్చర్‌కు మార్చడానికి గత అక్టోబరులో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను పంపించామని, దానిని త్వరగా ఆమోదించాలని కోరారు.

జాతీయ క్రీడల నిర్వహణకు అన్ని వసతులు

జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు తెలంగాణలో ఉన్నాయని, వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను నిర్వహించే అవకాశం ఇవ్వాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్‌స్పోర్ట్స్, ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అంతర్జాతీయ క్రీడలను తెలంగాణలో నిర్వహించే అవకాశం ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. జీఎంసీ బాలయోగి స్టేడియం, షూటింగ్ రేంజ్, ఎల్‌బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం అప్‌గ్రేడేషన్‌కు సమర్పించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్రమంత్రిని కోరారు.



రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

గవర్నర్.. సార్!

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొద్దిసేపు టీచర్‌గా మారారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. అక్కడి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల నైపుణ్యాలను గవర్నర్ స్వయంగా పరీక్షించారు. చదవడం, రాయడాన్ని గమనించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ధృడ సంకల్పంతో తమ కలలను సాకారం చేసుకోవాలని, సమాజం పట్ల బాధ్యతను పెంచుకోవాలని విద్యార్థులకు హితబోధ చేశారు. విద్యార్థుల ప్రతిభను ఈ సందర్భంగా ప్రశంసించారు. పిల్లలతో ఆయన కొద్దిసేపు సన్నిహితంగా కలిసిపోయారు.

బాబు ఎత్తుకు రేవంత్ చిత్తు!

I పేజీ తరువాయి...

స్పందించకపోగా.. ఈ పరిణామాలతో తెలంగాణ ఆర్థిక శాఖ అధికారులు విస్తుపోతున్నారు. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 54 [1] స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం నిర్ణయం తీసుకున్నదని మండిపడుతున్నారు.

బాబు.. మొదటి నుంచీ కొర్రీలే

రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ, ఏపీ మధ్య జనాభా దామాషాలో ఆస్తులు, అప్పుల విభజన జరగాలని ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 54 [1] స్పష్టం చేస్తున్నదని నిపుణులు చెప్తున్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం దేశీయంగా కేంద్ర ప్రభుత్వం, ఇతర సంస్థల నుంచి తెచ్చిన రుణాలతోపాటు జపాన్‌కు చెందిన జైకా, వరల్డ్ బ్యాంకు వంటి విదేశీ సంస్థల నుంచి తెచ్చిన అప్పులు కూడా పంపకాల్లో భాగంగా ఉన్నాయి. విదేశీ బ్యాంకుల నుంచి తెచ్చిన నిధులు రూ.30వేల కోట్ల వరకు ఉంటాయని అంచనా. ప్రాజెక్టు చేపట్టిన ప్రాంతం, నిధుల వినియోగాలతో సంబంధం లేకుండా రెండు రాష్ట్రాల మధ్య అప్పుల పంపకం జరగాల్సి ఉంటుంది. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 15 ప్రాజెక్టులకు చెందిన అప్పులపై కొర్రీలు పెట్టారు. తొమ్మిది ప్రాజెక్టుల అప్పును వినియోగం ఆధారంగా, మరో నాలుగు ప్రాజెక్టుల రుణాలను అవి ఉన్న ప్రాంతం ఆధారంగా, మరో రెండు ప్రాజెక్టుల రుణాలను జనాభా ప్రాతిపదికన పంచాలని పట్టుబట్టారు. కానీ.. ఆ అప్పులను సెక్షన్ 54 [1]కు లోబడి జనాభా ప్రాతిపదికన పంచాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తేల్చి చెప్పిందని, దీంతో బాబు ఆటలు సాగలేదని పరిశీలకులు పేర్కొన్నారు.

ఒక్క భేటీతో తలకిందులు..

ఏపీలో చంద్రబాబు గెలిచిన వెంటనే తనదైన మార్క్ రాజకీయాలు మొదలు పెట్టారు. ఇక్కడ రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావడంతో పాత బంధాన్ని గుర్తుచేస్తూ 'విభజన సమస్యలపై చర్చించుకుందాం రా' అంటూ స్నేహ హస్తం చాచారు. ఈ ఏడాది జూన్ 6వ తేదీన ఇరు రాష్ట్రాల సీఎంలు భేటీ అయ్యారు. అయితే ఇక్కడి నుంచే చంద్రబాబు పాచికలు వేయడం మొదలు పెట్టారని బీఆర్‌ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. సీఎంలు చర్చించిన అంశాలపై అధికారులు, మంత్రుల కమిటీల్లో చర్చించి, రెండు రాష్ట్రాలు ఒక పరిష్కార మార్గం వెతుక్కోవాల్సి ఉంటుంది. కానీ చంద్రబాబు నేరుగా కేంద్ర మంత్రిత్వశాఖ వద్దకు వెళ్లారని.. సమైక్య రాష్ట్రంలో విదేశీ నిధులు తెచ్చి చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు, హుస్సేన్ సాగర్ పనులకు సంబంధించి తెలంగాణ తన వాటా చెల్లించడం లేదని, ఏపీనే ఆ మొత్తం కట్టిందని చెప్పారని అంటున్నారు. ఈ నిధులను తెలంగాణ నుంచి వసూలు చేసి, ఏపీకి చెల్లించాలంటూ చక్రం తిప్పినట్టు చెప్తున్నారు. దీంతో చంద్రబాబుకు తలొగ్గిన కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నదని.. తెలంగాణ ప్రభుత్వం ప్రమేయం లేకుండానే రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రూ.2,500 కోట్లను ఏపీ ఖాతాలో వేసిందని చెప్తున్నారు. ఇప్పటికే ఆర్థికంగా సతమతం అవుతున్న తెలంగాణకు ఇది ములిగే నక్కపై తాటిపండు పడ్డట్టు అయ్యింది. ఈ పరిణామాలపై ఆర్థిక శాఖ అధికారులు సైతం విస్తుపోతున్నారు. అప్పుల్లో తెలంగాణ వాటా తేల్చడంపై విజ్ఞప్తి ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా నిధులు ఎలా బదలాయిస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది.

తెలంగాణకు రావాల్సినవి అడుగుతారా?

ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై ఢిల్లీలోనే ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అడుగుతారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ (సీఎస్‌ఎస్) నిధులు రూ.454 కోట్లు ఏపీ ఖాతాలో పడ్డాయి. ఈ నిధులు తిరిగి ఇప్పించాలని తెలంగాణ ప్రభుత్వం పదేండ్లుగా అడిగినా కేంద్రం స్పందించలేదు. ఇప్పుడు తెలంగాణ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రూ.2,500 కోట్లు మళ్లించిన కేంద్రం.. ఇదే పద్ధతిలో సీఎస్‌ఎస్ నిధులను ఏపీ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఎందుకు ఇవ్వదని ప్రశ్నిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఈ అంశంపై నిలదీయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతోపాటు వాటా తేలకుండా మిగిలిపోయిన అప్పులు, ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్తు బకాయిల వంటివి కూడా కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఇప్పించాలని డిమాండ్ చేయాలని సూచిస్తున్నారు.

పీసీసీ సారథి ఎవరు?

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్‌కు నూతన సారథి, మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో శుక్రవారం జోరుగా చర్చలు జరిగాయి. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో మధ్యాహ్నం చర్చలు జరిపారు. రాత్రి పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు అంశాలపై చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఫలితంగా ఈ నెలాఖరుకు మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం.

పీసీసీ చీఫ్ ఎవరో?

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పదవీ కాలం ముగియడంతో కొత్త నేతను ఎంపిక చేయాల్సి ఉంది. పీసీసీ రేసులో బలరాం నాయక్, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ ఉన్నారు. వీరిలో మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరి మధ్యే పోటీ నెలకొన్నది. ఢిల్లీలో జరిగిన చర్చల్లో అధిష్ఠానంతోపాటు రాష్ట్ర మెజార్టీ నేతలు మహేశ్‌కుమార్ గౌడ్ వైపే మొగ్గు చూపినట్టు తెలిసింది. ఈ మేరకు నేడో రేపో అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

వైద్య రంగంలోకి వరల్డ్‌బ్యాంకు!

I పేజీ తరువాయి...

పరికరాల కొనుగోలుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హామీ ఇచ్చారు. దీంతోపాటు టీవీవీపీ పరిధిలోని దవాఖానల్లో పరికరాల కొనుగోలుకు సైతం నిధులు ఇస్తామని చెప్పారు. ఆరోగ్య మహిళా క్లినిక్స్‌ను పెంచడానికి కూడా నిధులు ఇస్తామని తెలిపారు. ట్రామా సెంటర్లు, క్యాన్సర్ స్క్రీనింగ్, కిడ్నీ ఇన్‌ఫెక్షన్లను గుర్తించే ఆధునిక యంత్రాలను అందించడానికి అవసరమైన ప్రతిపాదనలను అందించాలని మంత్రికి సూచించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాక్షి, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు జుంకో ఓనిషి, అపర్ణ సోమనాథ్, బత్తుల అమిత్ నాగరాజ్, అజయ్‌టాండన్, లక్ష్మీ శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాలం చెల్లిన మందులు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పీహెచ్‌సీల్లో కాలం చెల్లిన మందులను నిల్వ ఉంచుతున్నారని డీపీహెచ్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. ఆ మందులను పడేయకుండా, నిల్వ ఉంచినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే వాటిని గుర్తించి పడేయాలని తాజాగా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయాలని మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులను ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు జరుపుతామని, కాలం చెల్లిన మందులు దొరికితే దవాఖాన సిబ్బందితోపాటు డీఎంహెచ్‌వోలపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూడాల సమ్మె విరమణ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు (జూడా) సమ్మె విరమించారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ దవాఖాన ఘటన నేపథ్యంలో ఈ నెల 14 నుంచి వారు సమ్మెలో కొనసాగుతున్నారు. తాము లేవనెత్తిన డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ఈ నేపథ్యంలోనే సమ్మె విరమిస్తున్నట్టు జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి సేవలు కొనసాగిస్తామని, ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోతే మళ్లీ సమ్మెకు సిద్ధమని చెప్పారు.



మల్దకల్‌లో పత్తి చేనులో భారీ మొసలి కనిపించింది. అటవీ అధికారులు బంధించేందుకు యత్నించగా తప్పించుకొని సమీపంలోకి బావిలోకి దూరింది. నీటిని ఎత్తిపోసి, మొసలిని తాళ్లతో పట్టుకొని కృష్ణానదిలో వదిలేశారు

రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?

బ్లిట్జ్ కథనంపై వివరణ ఇవ్వండి: బీజేపీ ఎంపీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?.. పెళ్లయ్యిందంటూ బ్లిట్జ్ పత్రికలో ప్రచురితమైన కథనంపై వివరణ ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో రాహుల్‌గాంధీ కార్యాలయానికి వెళ్లి, అక్కడి సిబ్బందికి బ్లిట్జ్ పత్రిక ను అందజేశారు. ఆయన స్వయంగా పత్రికను చదివి, అందులో వచ్చిన కథనంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. భారతదేశ వ్యవహారాలకు సంబంధించి విదేశీ మీడియా సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక సరైనదేనని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ వాదిస్తున్నపుడు, బ్లిట్జ్ కథనం కూడా సరైనదేనా? అని ప్రశ్నించారు.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘట న వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవా రం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.



జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారాన్ని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఐటీడీఏ పీవోల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను పరిశీలించేందుకు చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేయడంపై హస్నాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ కే శరత్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు.

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు



ఇంటిముందు విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు పోచమ్మ, బాలయ్య

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇంటి నుంచి వెళ్లిన పల్లెపాటి రాధ అటు నుంచి అటే అదృశ్యమై పోయిందనీ, ఏడేండ్ల తర్వాత విగతజీవిగా తిరిగి వచ్చిందని మావోయిస్టు రాధ అలియాస్ నీల్సో తల్లిదండ్రులు పల్లెపాటి పోచమ్మ, పల్లెపాటి బాలయ్య భోరున విలపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి బాలయ్య జీవనోపాధి కోసం కుటుంబంతో 35 ఏండ్ల క్రితం కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రాధ అలియాస్ నీల్సో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)కోర్సు పూర్తి చేసింది. మహిళలను చైతన్యం చేసేందుకు, వరకట్న దురాచారాలను, మద్యం వంటి చెడు అలవాట్లనుంచి కుటుంబాలను దూరం చేసేందుకు ఆమె స్వచ్ఛంద సంస్థలో చేరింది. చక్కటి గొంతు, తెలివితేటలు, సమాజాన్ని చైతన్య పరిచాలనే దృక్పథం నచ్చి ఆమెను స్వచ్ఛంద సంస్థ వారు చేర్చుకున్నారు. ఆ సంస్థవారే తమ బిడ్డను ఉద్యమం బాట పట్టిస్తారని ఊహించలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. 2017లో 17 ఏండ్ల వయస్సులో రాధ తమను విడిచి వెళ్లిందని, ఎంత వెతికినా దొరకలేదని చెప్పారు. ఆమె మావోయిస్టుల దళంలో చేరినట్టు మూడేండ్ల క్రితం తెలిసిందని అన్నారు. ఈ నెల 19న ఆమె మృతి చెందిందని, భద్రాచలం వద్ద మృతదేహం ఉన్నట్టు సమాచారం వచ్చిందని తెలిపారు. రాధను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులే చంపారని చెప్పారు. ఆమె ఉద్యమానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి అయితే ఏడేండ్లు ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దళితురాలు అయినందునే కోవర్టు ఆరోపణతో హతమార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంతోమంది ఎన్నో ఏండ్లు నక్సల్స్‌గా పనిచేసి ఏదో ఒక దశలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని, తన బిడ్డకు మాత్రం ఆ అవకాశం లేకుండా చేశారని విలపించారు. 'ఏడేండ్లు సేవ చేయించుకున్నారు, నా బిడ్డను ఎలా చంపాలనిపించిందయ్యా మీకు' అని తల్లి పోచమ్మ గొల్లుమంది. పేదరికంలో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.



కొంగరకలాన్‌లో కేన్స్ సంస్థ ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు. చిత్రంలో కంపెనీ ఉన్నతాధికారులు

ఫ్యూచర్ సిటీకి కేన్స్ చుక్కాని..

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 23: కొత్తగా ఏర్పాటవుతున్న ఫ్యూచర్ సిటీకి సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీస్ సాంకేతిక చుక్కానిగా నిలువనున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. కొంగర్‌కలాన్‌లో సంస్థ ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రూ.2,800 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ యూనిట్‌తో రెండు వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. తమ ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ పరిశ్రమలకు ఆర్థిక రాయితీలు, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. హై ప్రెసిషన్ ఎలక్ట్రానిక్ అసెంబ్లీ, 3 డీ ఆప్టికల్, కృత్రిమ మేథస్సు ఆధారంగా అత్యాధునిక ఇన్‌స్పెక్షన్ వ్యవస్థలు కేన్స్ టెక్నాలజీ ప్లాంటులో అందుబాటులోకి రానున్నట్లు మంత్రి వివరించారు. భారత సెమీ కండక్టర్ మిషన్ కింద కేన్స్ టెక్నాలజీకు త్వరలో చిప్ తయారీ అనుమతి లభించే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. కొంగర్‌కలాన్ ప్లాంట్లో స్మార్ట్ మీటర్లు, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ వాహన రంగం, ఏరోస్పేస్ ఇండస్ట్రీకి అవసరమైన ఉన్నతస్థాయి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేస్తున్నదని శ్రీధర్ బాబు వివరించారు. ఈ కార్యక్రమానికి కేన్స్ టెక్నాలజీస్ చైర్మన్ సబిత రమేశ్, కంపెనీ సీఈవో రఘు పనిక్కర్, ఎండీ రమేశ్ కణ్ణన్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

గోల్డ్ బాండ్లకు గుడ్‌బై!



అమ్మకాల్ని ఆపేసే దిశగా కేంద్ర ప్రభుత్వం

అధిక బంగారం ధరలతో చెల్లింపులు భారం

మదుపరులకు లాభాలున్నా.. ఖజానాకు నష్టాలు

అందుకే ఎస్‌జీబీలకు స్వస్తి అంటున్న సర్కారీ వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: కేంద్ర ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ)కు గుడ్‌బై చెప్పనుందా?.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వాటి జారీని ఇక నిలిపివేయనుందా?.. ఈ ప్రశ్నలకు అధికార వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తున్నదిప్పుడు. ఎస్‌జీబీలు వ్యయభరితం, సంక్లిష్ట సాధనాలుగా మారడంతో వాటి అమ్మకాలకు దూరంగా ఉండాలన్న నిర్ణయానికి కేంద్రం వస్తున్నట్టు సంబంధిత వర్గాలు ప్రముఖ జాతీయ వార్తా చానెల్ సీఎన్‌బీసీ-టీవీ18తో అన్నాయి. కాగా, ఎస్‌జీబీలకు ఇన్వెస్టర్లలో నానాటికీ పెద్ద ఎత్తున డిమాండ్ పెరుగుతున్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం ఎక్కువ చెల్లించైనా కొనేందుకు ముందుకొస్తున్నారు. భౌతిక బంగారంతో పోలిస్తే నిల్వ, చోరి వంటి ఇబ్బందుల్లేకపోవడం, ఏటా స్థిరంగా 2.5 శాతం వడ్డీ రాబడులుండటం, పన్ను మినహాయింపులకూ వీలుండటమే ఇందుకు కారణం. ఇక ధరల విషయానికే వస్తే.. మార్కెట్‌లో బంగారం ధరలు ఏ స్థాయిలో పరుగులు పెడుతున్నాయో చూస్తూనే ఉన్నాం. 2015తో పోల్చితే ఇప్పుడు బంగారం ధర 180 శాతం ఎగిసింది. దీంతో ఎస్‌జీబీల్లో పెట్టుబడులు పెట్టినవారికి విపరీతమైన లాభాలొస్తున్నాయి. 2015 నవంబర్‌లో తొలి విడుత బాండ్ల జారీ గ్రాము రూ.2,684 వద్ద జరిగింది. కానీ అదే బాండ్ కాలపరిమితి తీరినప్పుడు గ్రాముకు రూ.6,132 చెల్లించాల్సి వచ్చింది. ఇలా ప్రతీ విడుతలో మెచ్యూరిటీ చెల్లింపులకు ఖజానాపై భారం పడుతూనే ఉన్నది. దీన్ని గుర్తించే ఇక ఈ బాండ్లు లాభసాటి కాదని ప్రభుత్వం వీటికి దూరంగా ఉండాలని చూస్తున్నదంటున్నారు.

రూ.72,274 కోట్లు

గడిచిన దాదాపు 9 ఏండ్లలో ఆర్బీఐ ఇప్పటిదాకా మొత్తం 67 విడుతల్లో ఎస్‌జీబీలను జారీ చేసింది. వీటిల్లో మదుపరులు రూ.72,274 కోట్ల పెట్టుబడుల్ని పెట్టారు. కాగా, తొలి 4 విడుతల్లో జారీ చేసిన ఎస్‌జీబీల కాలపరిమితి ఇప్పటికే పూర్తిస్థాయిలో తీరిపోయింది. వాటికి సంబంధించిన చెల్లింపులు కూడా మదుపరులకు జరిగిపోయాయి. అయితే పెట్టిన పెట్టుబడులకు రెట్టింపునకుపైగా రాబడులను ఇన్వెస్టర్లు పొందారు.

ఎస్‌జీబీ అంటే?

2015 నవంబర్‌లో సావరిన్ గోల్డ్ బాండ్లు పరిచయమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్బీఐ ఈ బాండ్లను జారీ చేస్తున్నది. ఇందులో బంగారంపై మదుపరులు చేసే పెట్టుబడులు పేపర్ల రూపంలోనే ఉంటాయి. దేశంలోకి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్న పసిడికి అడ్డుకట్ట వేయడానికే ఈ ఎస్‌జీబీల అమ్మకానికి మోదీ సర్కారు వచ్చింది.

ధర ఎలా?

బాండ్లు జారీ చేసేటప్పుడు ఆర్బీఐ వాటి ధరను నిర్ణయిస్తుంది. ఈ ఇష్యూ ప్రైస్ ప్రకారమే ఇన్వెస్టర్లు గ్రాముల లెక్కన కొనాల్సి ఉంటుంది. కాలపరిమితి 8 ఏండ్లు. అయినప్పటికీ ఐదేండ్లు గడిచిన తర్వాత ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. 24 క్యారెట్ బంగారానికిగాను భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ అసోసియేషన్ లిమిటెడ్ రోజూ సూచించే ధరల్లో చివరి మూడు రోజుల ధరల సగటు ప్రకారం ఇన్వెస్టర్లకు వారి పెట్టుబడులపై చెల్లింపులు జరుగుతాయి.

ఎవరు అర్హులు?

భారతీయ పౌరులు, ట్రస్టులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఛారిటబుల్ సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఎస్‌జీబీలను కొనవచ్చు.

ఎలా కొంటారు?

షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు) ఈ బాండ్లను అమ్ముతాయి. ఎస్‌హెచ్‌సీఐ, పోస్టాఫీస్‌లు, బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలూ విక్రయిస్తున్నాయి. అన్ని ఎస్‌జీబీలు సెకండరీ మార్కెట్‌లో నమోదవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా క్రయవిక్రయాలు జరుగుతాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలపై ఎస్‌జీబీల అమ్మకంపై వచ్చే సొమ్ముకు పన్ను ఉంటుంది.

74 వేల దిగువకు పసిడి

గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మరింత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా ధరలు దిగిరావడం విశేషం. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం ధర రూ.74 వేల దిగువకు చేరుకున్నది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.350 తగ్గి రూ.73,800కి దిగొచ్చినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతక్రితం ధర రూ.74,150గా ఉన్నది. పసిడితోపాటు వెండి రూ.200 తగ్గి రూ.87 వేలకు తగ్గింది. యూఎస్ ట్రెజరీ ఈల్డ్ పుంజుకోవడం, డాలర్ మరింత బలోపేతం కావడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని వెల్లడించారు.

మోర్గాన్ స్టాన్లీ చీఫ్ జోనాథన్ మృతి

ఇటలీలో విహార నౌక మునకతో...



సిసిలీ, ఆగస్టు 23: కార్పొరేట్ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను తట్టుకుని నిలిచిన మోర్గాన్ స్టాన్లీ ఇంటర్నేషనల్ చైర్మన్ జోనాథన్ బ్లూమర్(70) జీవితం చివరకు విషాదాంతంగా ముగిసింది. పెను తుఫాన్‌ను ఆయనను కబళించివేసింది. కోర్టు కేసులో గెలిచిన ఆనందంలో బ్రిటిష్ టెక్ టైకూన్ మైక్ లించ్‌తో కలిసి చేసిన విహార యాత్ర చివరకు విషాదాంతమైంది. ఆయనతోపాటు ఆయన సతీమణి జుడీ, మిత్రుడు లించ్ కూడా ప్రాణాలు కోల్పోయారు. లించ్ కుమార్తె హన్నా(18), కేసును వాదించిన న్యాయవాది క్రిస్టఫర్ మర్విలో, ఆయన భార్య నెడా, మరో మహిళ జాడ తెలియరాలేదు. 'బ్రిటిష్ బిల్ గేట్స్'గా పేరున్న మైక్ లించ్ మోసానికి పాల్పడినట్లు దాఖలైన కేసులో అమెరికన్ కోర్టు తుది తీర్పును వెల్లడించింది. ఆయన నిర్దోషి అని కొద్ది వారాల క్రితం తీర్పు చెప్పింది. ఈ కేసులో ఆయన తరపున జోనాథన్ బ్లూమర్ సాక్ష్యం చెప్పారు. ఈ సంతోషాన్ని అందరితో కలిసి పంచుకోవడం కోసం జోనాథన్ ఆహ్వాన మేరకు వీరంతా ఇటలీలోని సిసిలీకి విలాసవంతమైన సూపర్ యాట్ బయేసియాన్‌లో దాదాపు 22 మంది ఆనందంగా గడిపారు. పోర్టిసెల్లో తీరంలో వచ్చిన పెను తుఫాన్ దెబ్బకు ఈ సూపర్ యాట్ ఈ నెల 19న మునిగిపోయింది. దీనిలోని ఐదుగురిని మాత్రమే సహాయక బృందాలు కాపాడగలిగాయి.

ఒడిదుడుకుల్లో బ్లూమర్ కెరీర్

ఆర్థిక కష్టాలు ఒకవైపు ఇబ్బందులకు గురిచేస్తున్నప్పటికీ బ్లూమర్ మాత్రం కంపెనీలను నడపడంలో వెనుకంజవేయలేదు. ఆయన కెరీర్ ప్రారంభించిన నాటి నుంచి అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదట్లో 20 ఏండ్లపాటు ఆర్థర్ అండర్సన్‌తో కలిసి సంస్థను నడిపారు. ఆ తర్వాతి 1995 నుంచి 2005 మధ్యకాలంలో ప్రుడెన్షియల్ పీఎల్‌సీలో కీలక హోదాల్లో పనిచేశారు. రైట్స్ ఇష్యూ జారీ చేయడంతో వాటాదారులతో వచ్చిన విభేదాల కారణంగా ఆ కంపెనీ నుంచి వైదొలిగారు. 2006 నుంచి 2012 మధ్యకాలంలో సెర్బెరస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ఎల్‌పీలో ఆపరేటింగ్ భాగస్వామిగా పనిచేశారు. ఆ తర్వాతి కాలంలో పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ కెరీర్‌ను ప్రారంభించి స్వల్పకాలంలో అగ్రస్థాయికి చేరుకున్నారు. ఆ తర్వాతి డీడబ్ల్యూఎఫ్ గ్రూపు లిమిటెడ్, యూరో గ్లోబల్ గ్రూపు లిమిటెడ్ వంటి కంపెనీల బోర్డు చైర్మన్ హోదాలో సేవలందించారు. మోర్గాన్ స్టాన్లీస్ యూరోపియన్ డివిజన్ చైర్మన్‌గా 2018 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

మరో 150 నెక్సా ఔట్‌లెట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: కొనుగోలుదారులకు మరింత చేరువకావాలనే ఉద్దేశంతో మారుతి సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మరో 150 నెక్సా ఔట్‌లెట్లను తెరవబోతున్నట్లు ప్రకటించింది. వీటిలో అత్యధికంగా ద్వి, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం బెంగళూరులో తన 500వ ఔట్‌లెట్‌ను తెరిచింది. ఈ సందర్భంగా మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ మాట్లాడుతూ...నెక్సా రిటైల్ స్టోర్లను వేగవంతంగా విస్తరిస్తున్నట్లు, ఇక నుంచి తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలనుకుంటున్నట్లు చెప్పారు.

అనిల్ అంబానీపై సెబీ వేటు



స్టాక్ మార్కెట్ల నుంచి ఐదేండ్లపాటు నిషేధం

రూ.25 కోట్ల జరిమానా • మరో 24 మందిపైనా కొరడా

రిలయన్స్ హెచ్‌ఎఫ్‌ఎల్ నిధుల దుర్వినియోగమే కారణం

న్యూఢిల్లీ, ఆగస్టు 23: ప్రముఖ వ్యాపార-పారిశ్రామికవేత్త, రిలయన్స్ అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ఆర్‌అడాగ్) అధినేత అనిల్ అంబానీపై మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ కొరడా ఝుళిపించింది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగాగానీ దేశీయ స్టాక్ మార్కెట్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా ఐదేండ్లపాటు నిషేధించింది. అలాగే మార్కెట్ నమోదిత లేదా సెబీలో రిజిస్టరైన సంస్థల్లో డైరెక్టర్‌గాగానీ, ఇతర కీలకమైన పదవుల్లో మరే రకమైన హోదాల్లో ఉండకుండా గురువారం ఆంక్షలు విధించినట్టు శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అంతేగాక రూ.25 కోట్ల జరిమానా కూడా వేస్తున్నట్టు సెబీ ప్రకటించింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) నిధుల దుర్వినియోగమే కారణమని 222 పేజీల ఆదేశాల్లో సెబీ పేర్కొన్నది. ఈ వ్యవహారంలో అసలు సూత్రధారి అనిల్ అంబానీయేనని వెల్లడించింది. ఇక ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌నూ సెక్యూరిటీ మార్కెట్ లావాదేవీల నుంచి 6 నెలలపాటు తొలగించింది. రూ.6 లక్షల ఫైన్ కూడా వేస్తున్నట్టు స్పష్టం చేసింది.

ఇదీ సంగతి..

రిలయన్స్ హెచ్‌ఎఫ్‌ఎల్‌లో నిధుల దుర్వినియోగం/మళ్లింపులపై అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సెబీ ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే అన్ని ఆరోపణలపై దర్యాప్తు చేపట్టింది. నిబంధనల ఉల్లంఘనలేవైనా జరిగాయా? అన్న కోణంలో విచారణ జరిపింది. ఈ క్రమంలోనే ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్లు, అందులో ఇతర కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారి అండతో అనిల్ అంబానీ అక్రమాలకు పాల్పడినట్టు సెబీ గుర్తించింది. అమిత్ బాప్నా, రవీంద్ర సుధాల్కర్, పింకేశ్ ఆర్ షాలతో కుమ్మక్కై అనిల్ అంబానీ కంపెనీ నిధులను దారి మళ్లించినట్టు తేలింది. వీరందరిపైనా ఐదేండ్ల నిషేధం పడింది. కాగా, అనిల్ అంబానీకి చెందిన సంస్థలకు రుణాలిస్తున్నట్టు ఈ నిధుల గోల్‌మాల్ జరిగింది. అయితే ఈ అవకతవకలపై ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ బోర్డులోని ఇతర డైరెక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కార్పొరేట్ రుణాలపై సమీక్ష జరుపాలని పట్టుబట్టారు. అయినప్పటికీ యాజమాన్యం దాన్ని పట్టించుకోలేదని తేలింది.

మరో 24 మందిపై..

ఈ మొత్తం వ్యవహారంతో సంబంధమున్న మరో 24 మందిపైనా సెబీ కఠిన చర్యలు తీసుకున్నది. రూ.21 కోట్ల నుంచి రూ.27 కోట్ల మేర జరిమానాలు వేసింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి అక్రమంగా రుణాలు అందుకున్న అనిల్ అంబానీ సంస్థలపైనా వేటు పడింది. సంస్థ ప్రయోజనాలను తాకట్టుపెట్టి ప్రమోటర్‌తో మేనేజ్‌మెంట్ చేతులు కలిపిందని సెబీ ఈ సందర్భంగా ఆక్షేపించింది. ఆస్తులు, ఆదాయం, విలువ అసలు ఏ అర్హత లేకపోయినా వందలాది కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశారని మండిపడింది.

- అనిల్ అంబానీతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడిన ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్లలో బాప్నాపై రూ.27 కోట్లు, సుధాల్కర్‌పై రూ.26 కోట్లు, షాపై రూ.21 కోట్ల ఫైన్‌ను సెబీ వేసింది.
- రిలయన్స్ యునికార్న్ ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్ ఎక్స్ఛేంజ్ నెక్స్ట్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ క్లీన్‌జెన్ లిమిటెడ్, రిలయన్స్ బిజినెస్ బ్రాడ్‌కాస్ట్ న్యూస్ హోల్డింగ్స్ లిమిటెడ్, రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లపై 25 కోట్ల చొప్పన జరిమానా.
- ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి అక్రమంగా రుణాలు పొందినందుకు లేదా ఆ సంస్థ నిధుల దుర్వినియోగంలో పాలుపంచుకున్నందుకు ఈ సంస్థలపై జరిమానాలు వేస్తున్నట్టు ప్రకటించిన సెబీ.
- పీడబ్ల్యూసీ, గ్రాంట్ థోంటన్ తదితర ఏజెన్సీల రిపోర్టుల్లో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్టు వెల్లడి. నివేదికలో 2018 మార్చి 31న దాదాపు రూ.900 కోట్లుగానే ఉన్న రుణాల మంజూరు.. 2019 మార్చి 31కల్లా సుమారు రూ.7,900 కోట్లకు చేరినట్టు తేలింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌కు రుణాలిచ్చిన వాటిలో పెద్దదైన బ్యాంక్ ఆఫ్ బరోడా చేయించిన ఫోరెన్సిక్ నివేదికలోనూ సదరు కంపెనీ నుంచి రుణాలు పొందిన వాటిలో అనిల్ అంబానీకి చెందిన సంస్థలే ఎక్కువగా ఉన్నట్టు బయటపడింది.

అందువల్లే రుణాలు వసూలవక ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ దివాలా తీసిందని చెప్పుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ రుణగ్రహీతలపై సెబీ దృష్టి సారిస్తున్నదిప్పుడు. రుణాలు పొందినవారంతా అనిల్ అంబానీకి చెందిన వారేనా? అన్న కోణంలోనూ ఆరా తీస్తున్నది.

మదుపరులకు నష్టాలు

ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ బోర్డు డైరెక్టర్లు, ప్రమోటర్ అనిల్ అంబానీ అవినీతితో అమాయక మదుపరులు, వాటాదారులు నష్టపోయారని సెబీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. 2018 మార్చిలో సంస్థ షేర్ విలువ దాదాపు రూ.59.60గా ఉన్నది. 2020 మార్చిలో కంపెనీలో అవకతవకలు బయటపడటంతో షేర్ విలువ 75 పైసలకు దిగజారింది. ఇప్పటికీ ఇది కోలుకోలేకపోతున్నది. ఫలితంగా ఇంకా 9 లక్షలకుపైగా మదుపరులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. మరోవైపు దీనిపై అనిల్ అంబానీ గ్రూప్ స్పందించలేదు.

భారత వృద్ధి అంచనాల్లో కోత!

న్యూఢిల్లీ, ఆగస్టు 23: అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్..భారత్‌కు గట్టి షాకిచ్చింది. ప్రస్తుత, వచ్చే ఏడాదిలో వృద్ధి అంచనాల్లో కోత విధించింది. 2024లో 6.7 శాతం మాత్రమే వృద్ధిని సాధించనున్న భారత్.. ఆ తర్వాతి ఏడాది 6.4 శాతానికి పరిమితం కానున్నదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం ఇందుకు కారణమని విశ్లేషించింది. సార్వత్రిక ఎన్నికలు జరగడంతో ఈ ఏడాది మొత్తం ప్రభుత్వం పెట్టే ఖర్చు భారీగా తగ్గిందని అమెరికా బ్యాంకింగ్ దిగ్గజ ఆర్థికవేత్త సంతను సేన్‌గుప్తా రాసిన నివేదికలో వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయడానికి ప్రభుత్వ నిర్ణయం వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదన్నారు.



జడ్చర్లలో పిడిలైట్ ప్లాంట్

హైదరాబాద్, ఆగస్టు 23: హైదరాబాద్‌కు సమీపంలోని జడ్చర్ల వద్ద ఏర్పాటు చేసిన పెయింటింగ్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు పిడిలైట్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మార్కెట్లలో అధిక నాణ్యత కలిగిన టైల్స్‌ను అంటుపెట్టే ఉత్పత్తులకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ సరికొత్త ప్లాంట్‌ను తెరిచినట్లు కంపెనీ ఎండీ భరత్ పూరి తెలిపారు. ప్రీమియం, ప్రత్యేక ఉత్పత్తులకు క్రమంగా డిమాండ్ పెరుగుతున్నదన్నారు. ఈ యూనిట్‌లో 80 శాతం సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఈ ప్లాంట్లోనే వినియోగిస్తున్నట్లు చెప్పారు.

బద్లాపూర్ చిన్నారులపై పలుమార్లు వేధింపులు

విచారణ కమిటీ అనుమానం

ముంబై, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య కమిటీని నియమించింది. చిన్నారుల పరిస్థితిని పరిశీలించగా 15 రోజుల్లో వారిపై పలుమార్లు లైంగిక వేధింపులు జరిగి ఉండొచ్చని ఈ కమిటీ అనుమానిస్తున్నది. ఈ మేరకు కమిటీ ప్రాథమిక నివేదికను ఉటంకిస్తూ ఓ మీడియా సంస్థ పేర్కొన్నది. కాగా, ఘటన జరిగిన పాఠశాల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, పాఠశాల ప్రాంగణంలో సీసీటీవీ పర్యవేక్షణ సరిగ్గా లేదని కమిటీ గుర్తించింది. నిందితుడు ఇంతకుముందు కూడా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడి ఉండవచ్చని కమిటీ భావిస్తున్నది.

నేటి మహారాష్ట్ర బంద్ ఉపసంహరణ

మహావికాస్ అఘాడీ శనివారం చేపట్టాలనుకున్న మహారాష్ట్ర బంద్ చట్టవిరుద్ధమని బాంబే హైకోర్టు తీర్పునిచ్చిన తర్వాత, బంద్‌ను ఉపసంహరించుకోవాలని ఎన్సీపీ శరద్‌చంద్ర పవార్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ విజ్ఞప్తి చేశారు. ఆయన పిలుపుకు కాంగ్రెస్, శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే సానుకూలంగా స్పందించారు. బంద్‌ను విరమించి ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య శాంతియుతంగా నిరసన చేపట్టాలని ఈ పార్టీలు నిర్ణయించాయి. ఈ ఉద్యమం అవినీతికి వ్యతిరేకంగా చేస్తున్నదని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు.

విశ్వాస ఘాతుకానికి, మోసానికి తేడా తెలియదా?

కింది కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి



న్యూఢిల్లీ: విశ్వాస ఘాతుకం (నేరపూరిత విశ్వాస ఉల్లంఘన), మోసానికి మధ్య తేడాను కోర్టులు అర్థం చేసుకోలేకపోవటం బాధాకరమని, రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. శుక్రవారం ఓ కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని తప్పు బట్టింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా కొట్టేసింది. విశ్వాస ఘాతుకం, మోసం రెండింటికీ పోలీసులు ఒకే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేస్తున్నారని, చట్టాల్ని ఉల్లంఘించారా? లేదా? అన్నది న్యాయమూర్తులు పరిశీలించాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. బులంద్‌షహర్‌లోని ఓ ట్రయల్ కోర్టు ఐపీసీ-406 (నేరపూరిత విశ్వాస ఉల్లంఘన) కింద కొంతమందికి సమన్లు జారీ చేసింది. అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేయగా, వారికి నిరాశే ఎదురైంది.

'కాసుల' రాకెట్.. ఇస్రో

- పెట్టిన ప్రతి రూపాయి ఖర్చుపై 2.54 రెట్ల రాబడి
- ఇది అద్భుతమైన ప్రయోజనమన్న ఆర్థికవేత్తలు
- సంస్థ ఉత్పత్తులకు వాణిజ్యపరంగా మంచి డిమాండ్
- శాటిలైట్ల ద్వారా అనేక రంగాల్లో బహుళ సేవలు



న్యూఢిల్లీ, ఆగస్టు 23: ఇస్రో.. అంతరిక్ష రంగంలో విస్తృత పరిశోధనలు, నూతన ఆవిష్కరణతో ఆశ్చర్యపరుస్తున్న ఈ సంస్థ వైపు అమెరికాలోని నాసా సహ ప్రపంచ దేశాలన్నీ దృష్టి సారిస్తున్నాయి. అతి తక్కువ వ్యయంతో అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో చేస్తున్న ఆవిష్కరణలు వారిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతున్నాయి. అయితే రోదసి రంగంలో ప్రయోగాలు, ఆవిష్కరణలకే ఇస్రో పరిమితం కాలేదు. ఇప్పుడది పెట్టుబడికి ఒక సురక్షితమైన ప్రదేశం. దేశానికి ఆదాయాన్ని ఆర్జించిపెట్టే ఒక సాంకేతిక పరిశోధన సంస్థ. వాణిజ్యపరంగా వాటి ఉత్పత్తులకు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఇస్రోపై ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై 2.54 రెట్ల రాబడి వస్తున్నదని ఒక కొత్త నివేదిక సూచిస్తున్నది. 2.54 రెట్ల రాబడి అంటే అద్భుతమైన రాబడి రేటని ఆర్థిక నిపుణులు సైతం పేర్కొంటున్నారు.

దేశంలో బీద, ధనిక తేడా లేకుండా ప్రతి భారతీయుడి జీవితాన్ని ఇస్రో తాకిందని దాని చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ అనూహ్య ప్రగతిని సాధించిందని యూరప్‌లోని నోవాస్పేస్‌కు చెందిన నిపుణుడు స్టీవ్ బోచింగర్ తెలిపారు. గత 10 ఏండ్లలో ఈ రంగం వాటా భారత ఆర్థిక వ్యవస్థలో 60 బిలియన్ డాలర్లకు పెరిగిందని దీని ద్వారా 47 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగగా, 34 బిలియన్ డాలర్లు పన్ను రూపంలో ఆదాయంగా లభించిందని నోవాస్పేస్ ఒక నివేదికలో తెలిపింది.

నాసా కన్నా అతి తక్కువ బడ్జెట్ ఉన్నా...

గత 55 ఏండ్లుగా రోదసి రంగంపై భారత్ పెట్టిన పెట్టుబడి.. అమెరికా రోదసీ సంస్థ నాసా ఒక్క ఏడాది బడ్జెట్ కన్నా తక్కువని బోచింగర్ చెప్పారు. ఇస్రో ప్రస్తుత వార్షిక బడ్జెట్ సుమారు 1.6 బిలియన్ డాలర్లు కాగా, నాసా వార్షిక బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. అంటే భారత్ బడ్జెట్ కన్నా 15.5 రెట్లు ఎక్కువ. ఇస్రో రోదసి ప్రయాణం మొదలు పెట్టినప్పటి నుంచి 2023 డిసెంబర్ 31 వరకు 127 భారత ఉపగ్రహాలు ప్రవేశపెట్టింది. ఇందులో ప్రైవేట్ సంస్థలు, విద్యాసంస్థలు తయారు చేసినవి కూడా ఉన్నాయి. భారత్ ప్రయోగించిన ఉపగ్రహాలలో తక్కువ భూమి కక్ష్యలో ప్రవేశపెట్టినవి 22, జియో సింక్రోనస్ ఆర్బిట్‌లోకి పంపినవి 29 ఉన్నాయి. వీటికి అదనంగా చంద్రయాన్-2, ఆదిత్య-ఎల్1, చంద్రయాన్-3 లాంటి మూడు లోతైన అంతరిక్ష ప్రయోగాలు కూడా విజయవంతంగా కొనసాగుతున్నాయి. భారత్ ఇప్పటివరకు 97 రాకెట్లను, 432 విదేశీ ఉపగ్రహాలను కూడా ఇస్రో వేదికగా ప్రయోగించారు.

ఎన్నో రంగాలకు ప్రయోజనం

వాతావరణం, తుపానుల పర్యవేక్షణ, కమ్యూనికేషన్, నావిగేషన్, నగర ప్రణాళిక, పంటల విశ్లేషణ, ఏటీఎం వంటి రంగాలను విశ్లేషించగలిగే రూ.50 వేల కోట్ల విలువైన 50 ఉపగ్రహాలను భారత్ తయారు చేసింది. అంతేకాకుండా ఇస్రో తయారు చేసిన శాటిలైట్ల వల్ల ప్రతి రోజూ 8 లక్షల మంది జాలర్లకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రతి రోజూ చేసే వాతావరణ హెచ్చరికల ద్వారా 104 కోట్ల మంది భారతీయులకు లబ్ధి చేకూరుతున్నదని నోవాస్పేస్ తన నివేదికలో వెల్లడించింది.

నిఘా ఉపగ్రహాలతో భరోసా

భారత శాటిలైట్ల ద్వారా రక్షణ రంగానికి అనూహ్యమైన ప్రయోజనాలు చేకూరుతున్నాయ. భారత దేశ పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో రాత్రి, పగలు నిరంత నిఘా కారణంగా శత్రు దేశాల కదలికలు ఎప్పటికప్పుడు తెలిసిపోతున్నాయి. ఈ నిఘా ఉపగ్రహాలు ఎంత శక్తివంతమైనవి అంటే పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఆ దేశ ప్రధాని ఇంటిలో పార్కు చేసిన కార్ల నెంబర్ ప్లేట్ల చిత్రాలను కూడా ఇవి స్పష్టంగా పసిగడతాయి. ఇక అంతర్‌గ్రహ అన్వేషణ రంగంలో భారత్ తన తొలి ప్రయత్నంలోనే చంద్రుడు, అంగారక గ్రహాల కక్ష్యను పట్టుకొని చరిత్ర సృష్టించాయి.

దేశ ప్రజలకు మోదీ అభినందనలు

శుక్రవారం మొదటి జాతీయ అంతరిక్ష దినం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. రోదసి రంగానికి సంబంధించి తమ ప్రభుత్వం భవిష్యత్తు నిర్ణయాల శ్రేణిని చేపట్టిందని, రాబోయే కాలంలో కూడా ఇది మరింత అధికంగా కొనసాగుతుందని అన్నారు. అంతరిక్ష రంగంలో మనం సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకుని, వాటి సాకారానికి కృషి చేసిన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలుపుదామని అన్నారు. కాగా, బహుళ సంఖ్యలో ఉపగ్రహాల ప్రయోగం కారణంగా అంతరిక్షంలో వ్యర్థాలు పేరుకుపోవడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. 2030 నాటికి వ్యర్థ రహిత లక్ష్యంగా ఇస్రో అంతరిక్ష ప్రయోగాలు చేపట్టాలని ఆమె సూచించారు.

కేజ్రీవాల్ బెయిల్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో శుక్రవారం మరోమారు ఎదురుదెబ్బ తగలింది. బెయిలు కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబర్ 5కు వాయిదా వేస్తూ, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. రిజాయిండర్ వేసేందుకు కేజ్రీవాల్‌కు రెండ్రోజుల సమయం ఇచ్చింది. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను విచారించేందుకు తమకు అనుమతి లభించినట్టు సీబీఐ తెలిపింది.

స్నాతకోత్సవ డ్రెస్ కోడ్ మార్చండి

కొత్తది రూపొందించాలన్న ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 23: స్నాతకోత్సవాల్లో ధరించడానికి ఆయా రాష్ట్ర సంప్రదాయాలకు సరిపడేలా భారత సంప్రదాయాలకు అనుగుణంగా తగిన దుస్తుల కోడ్‌ను రూపొందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ తన అధీనంలోని సంస్థలను కోరింది. వలస వారసత్వంగా ప్రస్తుతం ధరిస్తున్న టోపీతో ఉన్న నల్ల దుస్తులను మార్చాల్సిన అవసరం ఉందని ఆ శాఖ పేర్కొంది. ఐరోపాలో మధ్య యుగాలలో ఉద్భవించిన దానిని బ్రిటీష్ వారు మన దేశంలో ప్రవేశపెట్టగా అదే వారసత్వంగా వస్తున్నదని తెలిపింది.



బీఆర్ఎస్ శ్రేణులు, జర్నలిస్టులపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీజీపీకి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

దాడిచేస్తే తిప్పికొడ్తాం!

మొదటిపేజీ తరువాయి...

జిల్లాకేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకత్వంలో రైతు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఆ ధర్నాలో పెద్ద సంఖ్యలో రైతులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కార్యకర్తలు పాల్గొన్నారని వెల్లడించారు. ధర్నా రోజు జరిగిన అరాకచకాలపై డీజీపీ జితేందర్‌కు ఆధారాలతో సహా విన్నవించామని వివరించారు.

పిరికిపంద పాలనకు నిదర్శనం

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో గాదరి కిశోర్ నాయకత్వంలో 500 మందికి పైగా రైతులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే.. 50 మంది కిరాయి మూకలు, కాంగ్రెస్ గూండాలు తాగిన మైకంలో పోలీసులతో కలిసి రైతులు ధర్నా చేస్తున్న శిబిరంపై దాడికి తెగబడ్డారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబులు, గుడ్లు, రాళ్లు, చెప్పులు వేసి రైతులను తీవ్రంగా అవమానించారని, హింసాయుత వాతావరణాన్ని సృష్టించారని మండిపడ్డారు. 'మా వాళ్లు తిరగబడితే.. ఆ 50 మంది కాంగ్రెస్ గూండాల్లో ఒక్కడూ మిగిలేవాడు కాదు. ప్రజాస్వామ్యంలో హింస సమాధానం కాదు కాబట్టే మా వాళ్లు గమ్మున ఉన్నారు. ఇందులో దుర్మార్గం ఏంటంటే.. డ్యూటీలో ఉన్న పోలీసులు రైతుల నిరసన శిబిరం టెంట్లు కూల్చివేసి, రాళ్లు రువ్వి.. ఆ గూండాలకు వత్తాసు పలకడం. ఇది రేవంత్‌రెడ్డి అనే ఓ పిరికిపంద పాలనకు నిదర్శనం' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రైతులకు సమాధానం చెప్పలేని దద్దమ్మ

రుణమాఫీ, రైతు భరోసాపై ప్రజల్లోకి పోయి రైతులకు సమాధానం చెప్పలేని దమ్ములేని దద్దమ్మ ఈ సీఎం అని కేటీఆర్ అన్నారు. 'మేము అడిగినం. చేతనైతే రా.. ఏ ఊరికి, ఏ మండలానికి పోదామో చెప్పు అని. నీ నియోజకవర్గం కొడంగల్ పోదామా? నువ్ పుట్టిన ఊరు కొండారెడ్డిపల్లి పోదామా? వస్తవా? అని అడిగా. ఎక్కడికీ రాలేదు. కానీ 20వ సారి ఢిల్లీకి పోయిండు. మన గల్లీలోని ప్రజల సమస్యలు తెలుసుకోకుండా సిగ్గులేకుండా ఢిల్లీకి తొత్తుగా, గులాముగా ఈ సీఎం ఢిల్లీకి పోతుండు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను, కిరాయి గూండాలను అడ్డుపెట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, గొంతు నొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

> **దమ్ముంటే.. చర్చకు రా**
>
> 'రైతు రుణమాఫీపై నీకు దమ్ముంటే.. సెక్యూరిటీ లేకుండా, పోలీసు బలగాలను అడ్డుపెట్టుకోకుండా రా. బ్యాంకు అధికారులను, వ్యవసాయ అధికారులను వెంటపెట్టుకోకుండా రా. మేము కూడా వస్తం. ఏ ఊరికి పోతవో చెప్పు.. పోదాం' అని సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. ఎక్కడా చారణా రుణమాఫీ కాలేదని, ఈ విషయంలో రైతులు భగభగ మండుతున్నారని, కాంగ్రెస్ వాళ్లు ఊర్లలోకి వస్తే తరిమికొట్టాలని చూస్తున్నారని చెప్పారు. పోలీసులు, అధికారగణాన్ని అడ్డుపెట్టుకొని తప్పులు చేస్తున్నారని అన్నారు.

మహిళా జర్నలిస్టులు బూతులు తిట్టారా?

సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళాజర్నలిస్టులపై కాంగ్రెస్ గూండాలు దాష్టీకం ప్రదర్శించడంపై కేటీఆర్ మండిపడ్డారు. 'వారు సీఎంను బూతులు తిట్టారా? సీఎం లాగులో తొండలు విడుస్తమన్నారా? చెట్టుకు కట్టేసి కొడ్తమన్నరా? గుడ్లు పీకి గోటీలు ఆడుతమన్నారా? ఏమన్నారు? ఏం తప్పుడు మాటలు మాట్లాడారు? వారు కేవలం సీఎం సొంత ఊరిలో రుణమాఫీ అయిందా? లేదా? అని అడుగుతుంటే.. కాంగ్రెస్ చిల్లరగాళ్లు, గూండాలు ఇద్దరు మహిళా జర్నలిస్టులపై దాడి చేయడమే కాకుండా.. వారిని కొండారెడ్డిపల్లి నుంచి కల్వకుర్తి వెల్దండి పోలీసు స్టేషన్ వరకు కార్లతో వెంబడించి, బెదిరించి వాళ్లమీదపడి రక్కినంత పనిచేశారు. ఇది సీఎం నికృష్ట మనస్తత్వానికి, కాంగ్రెస్ కార్యకర్తల తీరుకు ఇది నిదర్శనం' అని ధ్వజమెత్తారు. వారిద్దరికీ సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'నీ సొంతూరులో, నీ ఇంటిముందు, నీ పార్టీ.. ఇద్దరు ఆడబిడ్డలను అవమానించింది. వాళ్లు నీ బండారం బయటపెట్టినందుకు.. రుణమాఫీ జరగలేదని ప్రజల్లోకి తీసుకెళ్తున్నందుకు.. నిన్నటి నుంచి నికృష్టమైన రోత పుట్టించే వార్తలు, రాతలతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు' అని దుయ్యబట్టారు.

పోలీసులకు అత్యుత్సాహం మంచిదికాదు

'ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారగణం ఏది చెప్తే అది పోలీసులు చేయాలి. కానీ, మీకొక విజ్ఞప్తి. మీరు అత్యుత్సాహం ప్రదర్శిస్తే మంచిది కాదు. మా పిల్లలు రుణమాఫీ జరగలేదని పోస్టు పెడితే పోలీసులు కాల్ చేస్తున్నారు. కరెంటు పోయిందని కాల్ చేస్తే విద్యుత్తు అధికారులు కాల్ చేస్తున్నారు. ఈ అత్యుత్సాహం వద్దు. సంయమనం పాటించండి. అధికారం ఎవడబ్బ సొత్తు కాదు. ప్రజాస్వామ్యంలో అధికారం మారుతుంటుంది' అని కేటీఆర్ సున్నితంగా హెచ్చరించారు. 'మాకు పోలీసుశాఖపై సానుభూతి ఉన్నది. మీకు నా విజ్ఞప్తి ఒక్కటే. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి మిమ్మల్ని అడ్డంపెట్టుకొని పబ్బం గడుపుకోవాలని అనుకుంటుండు. తన పదవిని కాపాడుకునేందుకు మిమ్మల్ని బద్నాం చేస్తుండు' అని అన్నారు. తిరుమలగిరి సంఘటన విషయంలో స్థానిక పోలీసులపై చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం చేసిన వారిపై 307 కేసు పెట్టాలని, కాంగ్రెస్ గూండాలను కచ్చితంగా అదుపులోకి తీసుకోవాలని డీజీపీని కోరినట్టు తెలిపారు. అలాగే కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై దాడిచేసిన గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ లేకపోతే.. మిగతావారి పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని అన్నారు.

ఈ ముఖ్యమంత్రి మూర్ఖుడు

మంచిర్యాలలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే, పోలీసులు వేధింపులు తట్టుకోలేక సత్యనారాయణ అనే బీఆర్ఎస్ నాయకుడు ఆత్మహత్యాయత్నం చేశారని కేటీఆర్ తెలిపారు. అనేక చోట్ల పోలీసులను అడ్డంపెట్టుకొని వేధింపులు కొనసాగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో వ్యవస్థలను అడ్డంపెట్టుకొని బతుకుదామనుకుంటే ముఖ్యమంత్రంత మూర్ఖుడు మరొకడు ఉండడని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని, 30 రోజుల్లో 28 మర్డర్లు, ఈ నగరానికి ఏమైంది? అంటూ ముఖ్యమంత్రి అనుకూల పత్రికల్లోనే వార్తలు వస్తున్నాయని వివరించారు. వీటన్నింటినీ డీజీపీ దృష్టికి తీసుకొచ్చామని, వాటిపై స్పందించాలని డీజీపీని కోరామని వెల్లడించారు. అన్నీ పరిశీలిస్తామని డీజీపీకి చెప్పినట్టు కేటీఆర్ తెలిపారు.

ప్రతి చర్య ఉంటుంది

'సోషల్ మీడియాలో రుణమాఫీ కాలేదని పోస్టు చేసిన మా తమ్ముళ్ల మీద కేసులు పెడుతున్నారు. దాడులు చేస్తున్నారు. ఇక నుంచి మేము కూడా అదే పద్ధతిలో స్పందిస్తాం. చర్యకు ప్రతి చర్య ఉంటుందని డీజీపీకి చెప్పాం' అని కేటీఆర్ అన్నారు. 'పదేండ్లు శాంతియుతంగా రాష్ట్రాన్ని నడిపినం. 14 ఏండ్లు కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినొద్దని సంయమనంగా ఉన్నం. మా సహనాన్ని, మంచితనాన్ని, తెలంగాణపై ఉన్న ప్రేమను చేతగానితనంగా భావిస్తే.. చర్యకు ప్రతి చర్య తప్పదు' అని డీజీపీని, ముఖ్యమంత్రిని హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను మీడియాలో ప్రసారం చేసిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కొంతమంది పోలీసులు మంత్రుల పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని డ్యాన్సులతో పరశించిపోతున్నారని, కేకులు కోస్తూ.. డ్యాన్స్‌లు చేస్తూ, స్పీచ్‌లు ఇస్తున్నారని డీజీపీ దృష్టికి తీసుకెళ్తే.. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, ఆర్ రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, ఎన్ భాస్కర రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, నోముల భగత్, నాయకులు దాసోజు శ్రవణ్, చిరుమల్ల రాకేశ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రావుల శ్రీధర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, ముఠా జయసింహా, పడాల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి ఘటన 'వెరీ అన్-యాక్సెప్టబుల్'!

జర్నలిస్టులపై దాడి అంశంలో మీరు చెప్పగానే స్పందించాను

ఇకపై ఏ సమస్య ఉన్నా నేరుగా చెప్పండి.. అడ్రస్ చేస్తా

కేటీఆర్ వినతులపై డీజీపీ సానుకూల స్పందన

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బీఆర్ఎస్ నేతలపై జరిగిన దాడులు అవాంఛనీయమని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేశామని, కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పోలీసులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని చెప్పారు. శుక్రవారం డీజీపీ జితేందర్‌ను కేటీఆర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్, డీజీపీ మధ్య ఆసక్తికర సంభాషణ సాగిందని అక్కడున్నవారు పేర్కొన్నారు. 'సూర్యాపేటలో జరిగింది ఏమాత్రం కరెక్ట్ కాదు' అని కేటీఆర్ పేర్కొనగా.. 'మీతో ఏకీభవిస్తున్నాను. ఇట్స్ వెరీ అన్-యాక్సెప్టబుల్' అని డీజీపీ సమాధానం ఇచ్చారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మేము పరిపాలించినప్పుడు ఇలా చేశామా? ఇలా జరిగిందా? ఎప్పుడైనా పరిధి దాటి ప్రవర్తించామా? మంత్రిగా నేను కూడా హద్దులు తెలుసుకొని ప్రవర్తించాను కదా' అని కేటీఆర్ గుర్తు చేయగా.. 'అవును. మీరు తెచ్చిన సంస్కరణలే ఇప్పటికీ అమలవుతున్నాయి' అని డీజీపీ పేర్కొన్నట్టు తెలిసింది. 'మా సోషల్ మీడియా కార్యకర్తల మీద అడ్డగోలు కేసులు పెడుతున్నారు. మా హయాంలో మాపై చాలామంది తీవ్ర దుష్ప్రచారం చేశారు. అయినా ఎప్పుడూ కేసులు పెట్టలేదు. కేవలం సీఎం, ఇతర బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితేనే కేసులు పెట్టాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులపై దాడిని ప్రస్తావిస్తూ.. 'జర్నలిస్టులను కూడా కొడితే రాష్ట్రం ఏం కావాలి?' అని కేటీఆర్ ప్రశ్నించగా.. జరిగింది పొరపాటేనని డీజీపీ ఒప్పుకున్నారని తెలిసింది. 'మీరు ఫోన్ చేయగానే నేనే స్వయంగా ఇన్వాల్వ్ అయ్యాను. వాళ్లను ఎస్కార్ట్ ఇచ్చి హైదరాబాద్‌కు పంపాలని పోలీసులను ఆదేశించాను. ఘటనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయించాను' అని డీజీపీ హామీ ఇచ్చినట్టు సమాచారం. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మీరు మా గొంతు నొక్కొద్దు' అని కేటీఆర్ కోరగా.. 'వందశాతం మీతో ఏకీభవిస్తాను. ఇకపై ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నాకే నేరుగా చెప్పండి. పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా' అని డీజీపీ చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

> **రైతుల కోసం ధర్నా చేస్తే దాడులా?: జగదీశ్‌రెడ్డి**
>
> 9 నెలలుగా రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని, పోలీసులు కూడా రాజకీయ నాయకుల డైరెక్షన్‌లో పనిచేయిస్తున్నారని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టానికి వ్యతిరేకంగా కిందిస్థాయి పోలీసులను వాడుకుంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా శాంతిభద్రతలు లేకుండా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కలిసే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థల సేవలకు సంబంధించి ఎవరైనా కాల్ చేస్తే.. వారినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

లోకం పోకడ



నిద్రలో నడిచే అలవాటు కాదు వదినా.. బ్యాంకు ముందు క్యూలో వెనకబడకుండా రాత్రే బయలుదేరి వెళ్తున్నాడు!

సర్కారు వద్ద సమాచారం లేదట!

ఏది అడిగినా అదే సమాధానం

ఆర్టీఐ దరఖాస్తునూ పట్టించుకోరు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో పారదర్శకత లోపించింది. ప్రభుత్వాన్ని ఆర్టీఐ ద్వారా ఏ సమాచారం అడిగినా 'లేదు' అనే సమాధానం వస్తున్నది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, వాటికి కేటాయించిన నిధులపై కూడా సమాచారాన్ని దాచిపెడుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పథకాల ప్రచారానికి, ప్రభుత్వ ప్రచారానికి ఎన్ని నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? అంటే సమాధానం లేదు. పాలనాపగ్గాలు చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు హస్తినకు 20 సార్లు వెళ్లారు. ఒక్కసారి సీఎం బృందం ఢిల్లీ పర్యటనకు ఎంతవుతున్నది? ఇప్పటివరకు ఎంతయింది? అంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మౌనమే సమాధానం. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకొనే అధికారం సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కల్పించింది. కానీ, ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా రేవంత్ సర్కారు సమాచారం దాటవేస్తున్నది. ఆర్టీఐ కింద సమాచారం కోరినా అధికారులు ఇవ్వడం లేదు. కొన్ని తప్పనిసరి సందర్భాల్లో ఇచ్చినా సమాచారం అరకొరగానే ఉంటున్నది. అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లో అనేక ఆర్టీఐ దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.



ఆర్టీఐ నుంచి సమాధానం దొరకని ప్రశ్నలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఢిల్లీ పర్యటనకు ఎన్నిసార్లు వెళ్లింది? ఏ పని మీద వెళ్లింది? వారి పర్యటనకు ఎంత ఖర్చయింది?
- 2023 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకు ఎంతమంది రాష్ట్ర మంత్రులు విదేశాలకు వెళ్లారు? ఏ పని నిమిత్తం వెళ్లారు? వారి విదేశీ పర్యటన ఖర్చు ఎంత?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎంతమంది ప్రభుత్వ అధికారులు, నాయకులు దావోస్ పర్యటనకు వెళ్లారు? ఎన్ని రోజులు, ఎన్ని ప్రాంతాల్లో పర్యటించారు. వారి పర్యటన ఖర్చు ఎంత?
- రాష్ట్రంలో ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమానికి ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది? ప్రచారానికి ఎంత ఖర్చు చేసింది? దరఖాస్తు ఫారాలు ఎన్ని ప్రింట్ చేశారు? వాటి ఖర్చు ఎంత?
- 2023 డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 31 వరకు తెలంగాణ ప్రభుత్వ నీటి పారుదలశాఖలో ఎంత మంది కాంట్రాక్టర్లకు ఎన్ని కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించారు? వాటి వివరాలు వెల్లడించండి?
- రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల అధిక ఫీజుల నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నది? రాష్ట్రంలో డీఈవోలు, ఎంఈవోలు ప్రైవేటు స్కూళ్ల ఫీజుల నియంత్రణకు ఇప్పటివరకు వాళ్ల పరిధిలో ఎన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు? వాటి వివరాలు ఏమిటి?
- రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఇప్పటివరకు మొత్తం ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? అందులో ఎన్ని పరిష్కరించారు? ప్రజాపాలన మెయింట్‌నెన్స్ కోసం ఎంత ఖర్చు చేశారు? వాటి వివరాలు ఇవ్వండి?
- 2024 జూన్ 2న నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం జిల్లాలవారీగా ఎన్ని నిధులు విడుదల చేసింది? హైదరాబాద్ నగరంలో ఎంత ఖర్చు చేశారు? దీనికి సమాధానంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) రూ.3 కోట్లు విడుదల చేసినట్టు తెలిపింది. జిల్లాల సమాచారం తమ వద్ద అందుబాటులో లేదని పేర్కొన్నారు.

జవాబుదారీతనం కరువైంది

"రాష్ట్ర ప్రభుత్వంలో జవాబుదారీతనం కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఎనిమిది నెలలైనా సమాచార కమిషన్ల నియామకం లేదు. సమాచారం అడిగితే దాపరికం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రజాస్వామ్య దేశంలో పౌరుల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. అప్పుడే పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉన్నట్టు. రహస్యం, దాపరికం ఉంటే అది ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం.

-రాజేంద్ర, ఫౌండర్ యూత్ ఫర్ యాంటీ కరప్షన్

చట్టపరంగా చర్యలు తీసుకోండి: టీయూడబ్ల్యూజే



హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): మహిళా జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది. నాగర్కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, కోశాధికారి పీ యోగానంద్, టెమ్జు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రమణకుమార్, టెమ్జు హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యార నవీన్‌కుమార్ సంయుక్తంగా శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భావప్రకటనా స్వేచ్ఛను హరించే వ్యక్తులు ఎంతటివారైనా సరే ఉపేక్షించవద్దని కోరారు. మహిళలు, విధి నిర్వహణలో ఉన్నారనే కనీస విచక్షణ లేకుండా దాడికి పాల్పడి, అసభ్యంగా ప్రవర్తించిన నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తమపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే నేత రమణకుమార్ ఆధ్వర్యంలో డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదుచేస్తున్న మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి

ఆ గూండాలపై చర్యలు తీసుకోండి

- **జర్నలిస్టులకే రక్షణ లేకపోతే ఎలా?**
- **టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డీజీపీకి మహిళా జర్నలిస్టుల వినతి**

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తమపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బాధిత మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి శుక్రవారం డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్టుకు వెళ్లిన తమపై కొందరు ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నదని వివరించారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. స్పందించిన డీజీపీ ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బాధిత జర్నలిస్టులు మీడియాతో మాట్లాడుతూ మహిళలు ఇప్పుడిప్పుడే జర్నలిజంలోకి అడుగుపెడుతున్నారని, అలాంటి వారిపై సీఎం సొంత ఊరిలోనే దాడి జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రమణకుమార్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి యార నవీన్‌కుమార్, ఐజేయూ సభ్యుడు అవ్వారి భాస్కర్, న్యూస్‌లైన్ శంకర్, ప్రవీణ్, ప్రభాకర్, జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి ఘటనపై నివేదిక ఇవ్వండి

నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి, వెల్దండ గ్రామాల్లో గురువారం ఇద్దరు మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర మహిళా కమిషన్ పోలీసులను ఆదేశించింది. బాధిత జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద నాగర్ కర్నూల్ ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి నివేదిక అంచాలని ఆదేశించారు.

మహిళా జర్నలిస్టులపై ట్రోలింగ్

- **ఫోన్లు చేసి వేధింపులు**
- **గ్రూప్స్‌లో ఫోన్ నంబర్లు షేరింగ్**
- **సినిమా పాటలతో అసభ్యకరంగా మీమ్స్**
- **కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జే కీలకం**

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో గురువారం కాంగ్రెస్ మూకల చేతిలో దాడికి గురైన మహిళా జర్నలిస్టులు ఆవుల సరిత, విజయారెడ్డిపై ట్రోలింగ్ మొదలైంది. వారిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నేతలు, ఆ పార్టీ అనుకూలురు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు తెరతీశారు. ఫోన్లు చేసి వేధించేందుకు ప్రయత్నించారు. ఎక్స్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల ద్వారా వేధింపులకు పాల్పడ్డారు. సరిత ఫోన్ నంబర్‌ను గ్రూపుల్లో పెట్టి ఫోన్లు చేయించారు. కొందరు మిస్డ్ కాల్స్ ఇస్తే, మరికొందరు ఫోన్లు చేసి తిట్టారు. ఇంకొందరు వాట్సాప్‌లలో మెసేజ్‌ల ద్వారా బెదిరించే ప్రయత్నం చేశారు. సరిత పాత ఫొటోలు, వివిధ సోషల్ మీడియా గ్రూపులను జల్లెడపట్టి మరీ వెతికి ఆమెపై బురదజల్లే ప్రయత్నం చేశారు. 2018లో ఆమె బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఒక గ్రూపునకు అడ్మిన్‌గా ఉన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నదంటూ రీల్స్, మీమ్స్ చేశారు. కొందరు కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా ప్రతినిధులు సరిత 'ఎక్స్'ఖాతాలో తిట్లదండకం మొదలుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి సరితను ట్రోల్ చేశారు. వరుసగా 4-5 ట్వీట్లు, రీట్వీట్లు చేశారు. సరిత ఫోన్ నంబర్‌ను కూడా సోషల్ మీడియాలో పెట్టారు. 'రేవంతన్న సైన్యం' 'అప్నా హస్తం' 'గీత అయినాల' 'తానోస్' 'మీ కాపలా కుక్క' 'లప్‌పాలిటిక్స్' తదితర పేర్లతోపాటు మరికొన్ని బినామీ పేర్లతో ఉన్న ఖాతాల నుంచి మరికొందరు సరిత, విజయపై ట్రోల్స్ చేశారు.

ప్రత్యేక వీడియోలు

విజయారెడ్డి, సరిత వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారిని మానసికంగా వేధించేలా కొన్ని వీడియోలు రూపొందించారు. అన్యమత ప్రచారానికి వెళ్లినందునే కొండారెడ్డిపల్లి గ్రామస్థులు వెళ్లగొట్టారని కామెంట్లు పెట్టారు. తమపై సినిమా పాటలతో కొన్ని వీడియోలు చేశారని, వేధింపులంటూ సరిత, విజయారెడ్డి ఆవేదన వ్యక్తం చేసినా ట్రోలింగ్‌లు ఆగలేదు. పైగా కొండారెడ్డిపల్లికి వచ్చి రేవంతన్నతో పెట్టుకుంటే ఇలాగే అవుతుందంటూ ఫోన్లు చేసి వేధించారు. తనపై జరుగుతున్న ట్రోలింగ్‌ను డీజీపీ జితేందర్ దృష్టికి సరిత తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి సామ రామ్మోహన్‌రెడ్డి తన పేరు, తన ఫోన్ నంబర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసి తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారని ఫిర్యాదు చేశారు. డీజీపీ, సైబర్ క్రైం పోలీసులు తక్షణం దీనిపై స్పందించాలని, తగిన చర్య తీసుకోవాలని ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు.

నిందితులపై చర్యలు తీసుకుంటాం

జర్నలిస్టులకు మహిళా కమిషన్ హామీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్టు కోసం నాగర్‌కర్నూలు జిల్లాలోని సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి వెళ్లిన జర్నలిస్టులపై గురువారం కాంగ్రెస్ మూకలు దాడిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జర్నలిస్టు సంఘాలతో కలిసి బాధిత జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి హైదరాబాద్‌లోని మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రిపోర్టింగ్‌కు వెళ్లిన తమపై కొందరు గూండాల్లా వ్యవహరించి దాడిచేశారని, అసభ్యకరంగా ప్రవర్తించారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి దారుణ పరిస్థితిని తాము గతంలో ఎక్కడా చూడలేదని అన్నారు. స్పందించిన కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు ఏ రమణకుమార్ ఉన్నారు.

మహిళా జర్నలిస్టులపై దాడి సరికాదు

సీఎం రేవంత్ వర్గీయులు చేసింది తప్పే • చర్చించుకుంటున్న కొండారెడ్డిపల్లి వాసులు

వంగూరు, ఆగస్టు 23: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై దాడి సరికాదని గ్రామస్థులు అంటున్నారు. ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ ఎందరికి వర్తించిందో తెలుసుకునేందుకు వచ్చిన జర్నలిస్టులపై అత్యంత దారుణంగా అల్లరిమూకలు దాడి చేసిన విషయం విదితమే. శుక్రవారం ఈ విషయమై గ్రామంలో పెద్ద ఎత్తున చర్చ జరిగినట్టు తెలిసింది. దాడి మంచిదికాదని పలువురు రైతులు చర్చించుకున్నారు. 'అవును రుణమాఫీ చాలామంది రైతులకు కాలేదనేది వాస్తవం.. అది తెలుసుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం మంచిది కాదు. గ్రామం పేరు చెడగొట్టారు.. అవసరమైతే మరుసటి రోజు కాంగ్రెస్ నాయకులు విలేకరులను పిలిచి వాదన చెప్పాల్సింది.. కానీ వారిపై దాడి చేయడం ఏ మాత్రం సరి కాదు.. ప్రశాంతంగా ఉన్న ఊరికి రాష్ట్రస్థాయిలో చెడ్డ పేరు తెచ్చారు' అని మాట్లాడుకున్నట్టు తెలిసింది.

రేవంత్ పాలనలో మహిళలకు రక్షణ కరువు

మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట, ఆగస్టు 23: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి హామీలను నెరవేర్చలేక అసమర్థ పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. అదిచాలదన్నట్టు రౌడీలను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ అమలుకాక రాష్ట్రమంతా రైతులు రోడ్లపైకి వస్తుంటే సీఎం స్వగ్రామంలో పరిస్థితి ఎలా ఉందోనని మహిళా జర్నలిస్టులు విధి నిర్వహణలో భాగంగా కవరేజీ కోసం వెళ్తే కాంగ్రెస్ గూండాలతో దాడి చేయించడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదనడానికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో చెంచు మహిళలపై జరిగిన లైంగికదాడి ఘటనపైనా మహిళా మంత్రుల స్పందన కరువైందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA



27 మంది భారతీయుల దుర్మరణం

- నేపాల్‌లో నదిలోకి దూసుకెళ్లిన యాత్రికుల బస్సు › 11

శనివారం SATURDAY 24.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 80 ‖ వెల (Price) రూ.6.50

పంచమి

శనివారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-35. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: పంచమి ఉదయం 7-52 వరకు, తదుపరి షష్ఠి తెల్లవారుజామున 5-31 వరకు. నక్షత్రం: అశ్విని సాయంత్రం 6-06 వరకు. వర్జ్యం: పగలు 2-24 నుంచి పగలు 3-53 వరకు, పునర్ వర్జ్యం రాత్రి 3-10 నుంచి తెల్లవారుజామున 4-40 వరకు. రాహుకాలం: ఉదయం 9-10 నుంచి ఉదయం 10-44 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-01 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: ఉదయం 11-26 నుంచి పగలు 12-54 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

రేవంత్ రాజకీయ హైడ్రామా!



హైడ్రా.. అంతా మా ఇష్టం

గండిపేట జలాశయానికి వెళ్లే దారిలోనే ఉన్న రెండు నిర్మాణాలు ఇవి.. నిజానికి ఎడమవైపు ఉన్న కట్టడం జలాశయానికి మరింత సమీపంలో ఉన్నది. అయినా, హైడ్రా కుడివైపు ఉన్న నిర్మాణాన్ని మాత్రమే కూల్చివేసింది. కుడివైపునే, దానికంటే ముందు నిర్మాణంలో ఉన్న మరో కట్టడాన్ని అది ముట్టుకోలేదు. ఎడమవైపు ఉన్న కట్టడం చేసిన ఒప్పేమిటి? కుడివైపు ఉన్న కట్టడం చేసిన తప్పేమిటి. ఒకదాన్ని కొట్టి మరోదాన్ని నిలబెట్టడంలో మాయేమిటి?



వీటిని కూల్చే దమ్ముందా! *ఇది రాష్ట్రమంత్రి, కాంగ్రెస్ ముఖ్యనేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి హిమాయత్‌సాగర్ జలాశయం సమీపంలో ఉన్న విశాలమైన ఫామ్‌హౌస్ (ఎర్రటి పెంకులతో ఉన్నది). దాని పక్కనే నల్లటి పైకప్పుతో ఉన్నది ఆయన సోదరుడి ఫామ్‌హౌస్‌గా చెప్తారు*

1. అసలు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లను నిర్ధారించింది ఎప్పుడు? అక్కడ హద్దురాళ్లున్నాయా? ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను పీకేసి, మట్టి నింపి, ఏండ్ల తరబడి ఫామ్‌హౌస్‌లు కడుతుంటే ప్రభుత్వాలు, విభాగాలు ఏం చేస్తున్నాయి? ఎఫ్‌టీఎల్‌కే హద్దురాళ్లు లేకపోతే ఇక బఫర్‌జోన్‌ను కనుక్కునేది ఎలా?

2. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ 1792 అడుగులా? లేక 1790 అడుగులా? ఈ జలాశయం నిర్వహణను చూసే జలమండలి రికార్డుల్లోనే రెండు రకాల ఎఫ్‌టీఎల్‌లు ఎలా ఉంటాయి? ఎఫ్‌టీఎల్‌ను రెండు అడుగుల మేర కుదించే అధికారం జలమండలికి ఉన్నదా?

3. ఎఫ్‌టీఎల్ మీద స్పష్టత లేదు. హద్దురాళ్లు లేవు. ఇలాంటప్పుడు హైడ్రా దేని ఆధారంగా ఏది ఎఫ్‌టీఎల్‌లో, ఏది బఫర్‌జోన్‌లో నిర్ణయిస్తున్నది? ఏ ప్రకారం కూల్చివేతలకు దిగుతున్నది? హైడ్రా ఏర్పాటు జీవో జాబితాలో పేర్కొనని గ్రామాల్లో (చిల్కూరు, హిమాయత్‌నగర్, అప్పోజిగూడ) సైతం హైడ్రా ఎలా కూల్చివేతలకు పాల్పడుతున్నది?

4. ఉత్తరాది రాష్ట్రాల్లో బుల్డోజర్ న్యాయం నడుస్తున్నది. అది తప్పని సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. కారణం సర్కారే న్యాయం చెప్పడం! ఇప్పుడు హైడ్రా చేస్తున్నదీ అదే. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం తప్పు కాదు. కానీ ఆ పేరుతో నచ్చనివారి కట్టడాలను మాత్రమే ఇష్టారాజ్యంగా ఎట్లా కూల్చేస్తారు. కూల్చివేతకు అవసరమైన ప్రాసెస్ పాటించాలి కదా!

5. కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టే సమస్యే లేదని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్తున్నారు. మరి అక్కడ అనేక నిర్మాణాలున్నా తెలంగాణకు చెందిన ఒక వ్యాపారవేత్త కట్టడాన్ని నోటీసులు కూడా ఇవ్వకుండా, సామాను కూడా తీసుకోనివ్వకుండా ఆసాంతం ఎందుకు కూల్చారు? ఆంధ్రాకు చెందిన నేత కట్టడం కూల్చివేతను ఢిల్లీ నుంచి ఫోన్ రాగానే ఎందుకు ఆపారు? మరిప్పటికైనా మంత్రులు చెప్తున్నట్టు ఈ ప్రభుత్వం చట్టాన్ని అందరికీ ఒకేరకంగా వర్తింపజేస్తుందా? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న అందరి నిర్మాణాలనూ మిగతావారిలాగే కూల్చేస్తుందా? 111 జీవోలో అనుమతులన్నింటినీ సమీక్షిస్తుందా?

6. అక్రమ నిర్మాణం ఎంత తప్పో, ప్రభుత్వమే పక్షపాతపూరితంగా, చట్టాన్ని ఉల్లంఘించి, అక్రమంగా కూల్చివేయడమూ అంతే తప్పు! అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న నెపంతో ప్రభుత్వం చేస్తున్న అక్రమాన్ని ప్రశ్నించొద్దంటే ఎట్లా?

7. 111 జీవో పరిధిలో నిర్మాణాలకు సర్పంచుల అనుమతి చెల్లదని, పంచాయతీ కార్యదర్శి అనుమతి ఉండాలని ప్రభుత్వ న్యాయవాది న్యాయస్థానానికి చెప్పారు. మరి ఈ రూల్ అందరికీ వర్తింపజేస్తారా? ఎందుకంటే సన్నిహితుడి పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉందంటున్న ఫామ్‌హౌస్‌కూ అనుమతిచ్చింది సర్పంచే! కేటీఆర్ మిత్రుడి ఫామ్‌హౌస్‌కూ అనుమతిచ్చింది సర్పంచే!

రాజకీయం చిత్రమైనది. పైకి కనిపించేది ఒకటి, లోపలి మర్మం మరొకటి! అక్రమమేదైనా అక్రమమే. రాజకీయమే జీవితం అనుకున్న వాళ్లకు తన వాళ్లంతా సక్రమంగా, రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే అక్రమంగా కనిపిస్తారు. ప్రస్తుతం హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న వ్యవహారం కూడా అచ్చం ఇలాగే ఉంది. కేసీఆర్ కుటుంబ సభ్యులపై బురద జల్లడమే లక్ష్యంగా సాగుతున్న 'బద్నాం రాజకీయం' టార్గెట్ కూడా ఇదే. జరగనిది జరిగినట్టు, జరిగినది జరగనట్టు మాయచేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు రాష్ట్ర ప్రజలను భ్రమింపజేయడానికి హైడ్రాను వాడుకుంటున్నది. కేటీఆర్ ఫామ్‌హౌస్ అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి తెగబడింది. అసలు హైదరాబాద్ జంట జలాశయాల సమీపంలో పరిస్థితి ఏమిటి? ఎవరెవరికి ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి? వారిలో కాంగ్రెస్ ప్రముఖులెవరు? ఎఫ్‌టీఎల్‌లో ఉన్నవేమిటి? బఫర్ జోన్‌లో ఉన్నవేమిటి? అసలు హైకోర్టు అడిగినట్టు ఎఫ్‌టీఎల్‌ను ఎవరు నిర్ధారించారు? మరి కొందరివే ఎందుకు కూలుస్తున్నారు? కొందరివి ఎందుకు కూల్చడం లేదు? అంతరార్థం సుస్పష్టం.

> **ఆస్తుల ధ్వంసం, తద్వారా ఇమేజ్ హననం కూడా ఒక రాజకీయ ఆయుధమే! అక్రమ కట్టడాలను అడ్డుకోవడం తప్పకాదు. కానీ ఆ పేరుతో చట్టాన్ని ఇష్టారాజ్యంగా వాడుకోవడం, ఒక్కొక్కరికి ఒక్కొక్కరకంగా వర్తింపజేయడం, తద్వారా వ్యక్తిత్వాల కూల్చివేతే అసలు సమస్య. హైడ్రా ద్వారా ప్రభుత్వం చేస్తున్నది ఇదే.**

ఈ నేపథ్యంలో అసలు గండిపేట (ఉస్మాన్‌సాగర్), హిమాయత్‌సాగర్ జలాశయాల పరిధిలో ఏం జరుగుతున్నది? తెలుసుకునేందుకు నమస్తే తెలంగాణ ప్రత్యేక బృందం అక్కడ పర్యటించింది. ఈ పర్యటనలో తెలుసుకున్న విషయాల ఆధారంగా..

ఆయా ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, వాటి ఫొటోలు, గూగుల్ మ్యాప్‌ల సమాహారమైన కథనం నమస్తే పాఠకులకు ప్రత్యేకం.

- **హైడ్రా పరిధి, కూల్చివేతలపై ఎన్నెన్నో సందేహాలు**
- **అసలు జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ పై స్పష్టతుందా?**
- **జలమండలి చిత్రపటాల్లోనే రెండు లెక్కలు ఎందుకు?**
- **హద్దు రాళ్లలో ఉన్నవెన్ని? జల సమాధి అయినవెన్ని?**
- **జలాశయాల్ని పర్యవేక్షించే జలమండలి ఏం చేస్తున్నది?**
- **ఎఫ్‌టీఎల్ సంగతి సరే; మరి బఫర్‌జోన్‌ను కాపాడేదెవరు?**
- **కొన్నింటిని వదిలి, కొన్నింటినే కొట్టి.. ఇదీ హైడ్రా పని**
- **తన పరిధిలో లేని మూడు గ్రామాల్లోనూ కూల్చుడు**

(గుండాల కృష్ణ)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): నోరు మంచిదైతే ఊరు మంచిదైతదంటరు! అట్లనే సర్కారు ఉద్దేశం ప్రజా ప్రయోజనమైతే వీసమెత్తు అనుమానాలు తలెత్తవు. అంతకు మించి ఆరోపణలు అసలే ఉండవు. కానీ హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ ఏజెన్సీ (హైడ్రా) పురుడుపోసుకొని నెల రోజులు కాకముందే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దాని ప్రతి అడుగు అనుమానాలకు తావిస్తున్నది. హైడ్రా కమిషనర్‌గా ప్రభుత్వం నియమించిన ఏవీ రంగనాథ్ ట్రాక్ రికార్డ్‌పై ఏ ఒక్కరికీ సందేహాలు లేవు. కాకపోతే సర్కారు సైగలో... ఆక్రమణలను నిర్ధారించే ప్రభుత్వ శాఖ లోపభూయిష్ట నిర్ణయాలో... కారణమేదైనా! కండ్ల ముందు కనిపించే ఒక నిర్మాణాన్ని అక్రమమంటూ కూల్చివేసిన హైడ్రా... దాని పక్కనే ఉన్న దానిని విస్మరించడమంటే ఇంతకీ కూల్చినది అక్రమమా? వదిలేసినదీ సక్రమమా!? సూటి ప్రశ్నలకు జవాబు ఇవ్వాల్సిన బాధ్యత › 4వ పేజీలో

• ఇది హైకోర్టు న్యాయం

కూల్చివేతలకు ముందు సంబంధిత అధికారి చట్టప్రకారం భవన యజమానికి నోటీసు ఇవ్వాలి కదా? నోటీసు ఇవ్వకుండా కూల్చివేయొచ్చా? ఏ అధికారం కింద కూల్చివేస్తారు? నోటీసు ఇవ్వాలి. ఆక్రమణదారుల, అనధికార నిర్మాణదారుల హక్కుల పత్రాలను ప్రాథమిక పరిశీలన చేయాల్సిందే. - ఆగస్టు 22న హైకోర్టు

• ఇది హైడ్రా న్యాయం

కూల్చివేసిన తన నిర్మాణానికి సంబంధించి ఓ యజమాని హైడ్రా ఉన్నతాధికారి వద్దకు వెళ్లి 'సార్.. కూల్చివేసే ముందు కనీసం నోటీసులు ఇవ్వాలి కదా!' అని అడిగారు. అందుకు ఆ ఉన్నతాధికారి ఇచ్చిన జవాబు ఏమిటంటే 'అలా ముందస్తు నోటీసులు ఇస్తే, మీరు కోర్టుకు వెళ్తారుగా!' అని. ఎవరైనా కోర్టుకు వెళ్లే హక్కుని హైడ్రా ఎలా అడ్డుకుంటుంది. న్యాయం చెప్పాల్సింది కోర్టా? హైడ్రానా?



అనిల్ అంబానీపై సెబీ వేటు

- స్టాక్ మార్కెట్ల నుంచి ఐదేండ్ల నిషేధం
- రూ.25 కోట్ల జరిమానా
- మరో 24 మందిపైనా కొరడా
- రిలయన్స్ హెచ్‌ఎఫ్‌ఎల్ నిధుల దుర్వినియోగమే కారణం › 11

ఏసీబీకి చిక్కిన డిప్యూటీ సీటీవో

రూ.35వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత › 10



జర్నలిస్టులపై, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడిచేసిన గూండాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీజీపీని కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నాయకులు జగదీశ్‌రెడ్డి, కోటిరెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, భాస్కర్‌రావు, కాలేరు వెంకటేశ్, గాదరి కిశోర్, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, రావుల శ్రీధర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ తదితరులు

దాడిచేస్తే తిప్పికొడ్తాం!

- శాంతియుత పద్ధతిలోనే మా నిరసనలు, పోరాటం
- మా ఓపికను చేతకానితనంగా భావించొద్దు
- రైతులకు జవాబు చెప్పలేని దద్దమ్మ రేవంత్‌రెడ్డి
- దమ్ముంటే రుణమాఫీపై పల్లెల్లో చర్చిద్దాం.. రా..!
- సొంతూరిలో మహిళా జర్నలిస్టులపై దాష్టీకమా?
- గూండాలతో బెదిరించి దాడులు చేయిస్తరా?
- తుంగతుర్తిలో కనుసైగతో పొట్టుపొట్టు కొట్టేవాళ్లు
- ఇక నుంచి మీ ప్రతి చర్యకు మా ప్రతిచర్య తప్పదు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్
- శాంతిభద్రతలు అదుపులో ఉంచాలని డీజీపీకి వినతి
- రాష్ట్రంలో అరాచక పాలన: మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాలేదని పోస్టులు పెట్టినా పోలీసులు కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని బీఆర్‌ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై తాము కూడా అదే పద్ధతిలో స్పందిస్తామని, దాడికి ప్రతిచర్య తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉంచాలని కోరుతూ మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం డీజీపీ జితేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పిరికిపంద పాలన నడుస్తున్నదని, రైతులకు సమాధానం చెప్పలేని చేతకాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఆయనకు పాలన చేతకాదని దుయ్యబట్టారు. రుణమాఫీ ధర్నాలు చేస్తుంటే రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ఆఖరికి మహిళా జర్నలిస్టుల పైనా కాంగ్రెస్ గూండాలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రుణమాఫీ, రైతు భరోసా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుండటాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని మండల, › 5వ పేజీలో

2 లక్షల పైన రుణాలకు
కటాఫ్ డేట్

- గడువులోపు 2 లక్షల మీది మొత్తం చెల్లిస్తేనే మాఫీ
- 18 వేల కోట్లు చేశాం.. 12 వేల కోట్లు చేయాలి
- రేషన్‌కార్డు ప్రామాణికం కాదు: మంత్రి పొంగులేటి

దశలవారీగా 2 లక్షలపైన మాఫీ

- **కుటుంబం నిర్ధారణ కాని 4.24 లక్షల మంది కోసం ప్రత్యేక యాప్**
- **మరో 1.24 లక్షల మంది ఆధార్‌లో తప్పులు: మంత్రి తుమ్మల**



హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతు రుణాల మాఫీకి త్వరలోనే కటాఫ్ తేదీని ప్రకటిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న అర్హులైన రైతులు ముందుగా ఆపై రుణాన్ని చెల్లించిన తరువాత మాఫీ చేస్తామని ప్రభుత్వం ముందే ప్రకటించిందని గుర్తుచేశారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని, తెల్ల రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తున్నామనేది పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేశారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ఎక్కడైనా అధికారులు తెల్ల రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని, ఇంకా రూ.12 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉన్నదని వెల్లడించారు. రూ.2 లక్షలకు పైబడిన రుణమాఫీకి నెలో, రెండు నెలలో కటాఫ్ తేదీ పెట్టి, రైతులు ఎక్కువ ఉన్న రుణాన్ని చెల్లించగానే వారి ఖాతాలో రూ.2 లక్షలు జమ › 7వ పేజీలో



సొసైటీ రుణాలు తీసుకోవడంతో అన్ని అర్హతలున్నా తమకు రుణమాఫీ జరగలేదని ఆరోపిస్తూ రెబ్బెన పీఏసీఎస్ ముందు రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

మాఫీ మంటలు

- బ్యాంకుల ముందు కొనసాగుతున్న నిరసనలు
- నిర్మల్ జిల్లా పెంచికల్‌పాడులో రైతుల ధర్నా
- ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో రాస్తారోకో › 7

రుణం కోసం పోయి హఠాన్మరణం

- **కొత్త లోన్ కోసం వెళ్లగా బ్యాంకులో భారీ క్యూ**
- **రుణమాఫీ కాకపోవడంపై పోటెత్తిన రైతులు**
- **లైన్‌లోనే కుప్పకూలిన రైతు గవినోళ్ల కతలప్ప**
- **యాదాద్రిలోనూ మరో రైతుకు గుండెపోటు** › 7

రుణం కోసం పోయి హఠాన్మరణం

- కొత్త లోన్‌కు వెళ్లగా భారీ క్యూ
- లైన్‌లోనే రైతుకు గుండెపోటు
- నారాయణపేట జిల్లాలో ఘటన



కతలప్ప (ఫైల్)

మద్దూర్ (కొత్తపల్లి), ఆగస్టు 23 : రుణం కోసం వచ్చిన ఓ రైతు గుండెపోటుతో బ్యాంకు వద్ద మరణించాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మద్దూరు మండలం బొమ్మన్‌పహాడ్‌కు చెందిన రైతు గవినోళ్ల కతలప్ప అలియాస్ అబ్బాస్ (50) శుక్రవారం మద్దూర్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐకి రుణం కోసం వచ్చాడు. బ్యాంకులో చాలామంది ఉండటంతో క్యూలో నిలబడ్డాడు. ఈ సమయంలో ఒక్కసారిగా కింద పడిపోగా.. స్థానికులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు తెలిపారు. కతలప్పకు భార్య గోవిందమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొత్తగా రుణం కోసం కొన్నిరోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నట్టు వారు తెలిపారు.

యాదాద్రి జిల్లాలో మరో రైతు...



పొలిమెర గోపాల్ (ఫైల్)

రామన్నపేట, ఆగస్టు 23 : డబ్బులను డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లిన రైతు గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామానికి చెందిన పొలిమెర గోపాల్ (72)కు గ్రామంలో మూడెకరాల 35 గుంటల భూమి ఉన్నది. ఆయనకు భార్య, ఐదుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల లక్షా 35 వేలు మాఫీ అయ్యాయి. ఆయన బ్యాంకు ఖాతాలో 80 వేలు ఉండగా.. పెద్ద కుమారుడి ఖాతాకు బదిలీ చేయించేందుకు కుమారుడితో కలిసి మునిపంపులలోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చాడు. డబ్బును బదిలీ చేయించేందుకు పక్కనే ఉన్న పరిచయస్తుడితో ఓచర్ రాయాలని చెప్పి కుర్చీ మీద కూర్చున్నాడు. అంతలోనే నొప్పిగా ఉన్నదని మాట్లాడుతూనే కింద పడిపోయాడు. పక్కనే ఉన్న యువకుడు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

● మా గోస వినేదెవరు?..



ప్రభుత్వం రుణమాఫీ చేసినట్టు చెప్పింది. తమకేమో మాఫీ కాలే. ఏమైందో తెలుసుకునేందుకు ఆఫీసుకొస్తే ఇక్కడ పట్టించుకునేటోళ్లే లేరని రైతులు వాపోయారు. పొద్దుగల్ల నుంచి ఇక్కడే ఉన్నా ఎవరూ తమ గోస పట్టించుకోవడం లేదంటూ నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. మాఫీ కాని రైతులు మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో రైతులు శుక్రవారం ఉదయమే ఆఫీసుకొస్తే ఎవరూ లేరు. 11 గంటలు దాటినా అధికారులు, సిబ్బంది రాకపోవడంతో అసహనానికి గురైన రైతులు నిరసన తెలిపారు. తమ గోస ఎవరితో చెప్పుకోవాల్నో అర్థమైతలేదని భీమ్‌గల్ మండలం కారేపల్లికి చెందిన మహిళా రైతు గుగ్లోత్ జెన్ను ఆవేదన వ్యక్తంచేసింది. -భీమ్‌గల్

● షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ.. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 2.50 లక్షల మంది రైతులు ఉంటే.. ఇప్పటి వరకు మూడు విడతల్లో కేవలం 97,873 మందికి మాత్రమే రూ.846.31 కోట్ల రుణమాఫీ అయిందని వివరించారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. - సంగారెడ్డి కలెక్టరేట్

బ్యాంకుల్లో రుణమాఫీ టోకెన్ క్యూ

లైన్‌లో తోపులాట.. వృద్ధురాలికి గాయం

నర్సింహులపేట, ఆగస్టు 23: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐ పరిధిలో రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 2800 మంది ఉంటే.. 1200 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. బ్యాంకు అధికారులు ఆడిట్ పేరుతో 20 రోజులుగా రుణమాఫీ వచ్చిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 30 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేస్తామని అధికారులు టోకెన్లు ఇస్తుండటంతో.. శుక్రవారం వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో బ్యాంకు వద్ద ఒక్కసారిగా తోపులాట జరిగి రామన్నగూడెం గ్రామానికి చెందిన 68 ఏండ్ల వృద్ధురాలు మంద సోమక్క గాయపడింది. తలకు గ్రిల్ తగలడంతో రక్తస్రావం జరిగింది. ఇంత జరుగుతున్నా బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడతున్నారు.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ఎస్‌బీఐలో టోకెన్ కోసం క్యూ కట్టిన రైతులు

పైసలేమోగానీ.. నా ప్రాణం పోతుండే



బ్యాంకులో తీసుకున్న లోన్ మాఫీ అయిందని నా కొడుకుతో కలిసి బ్యాంకుకు వచ్చిన. ఇక్కడ శాన మంది ఉండటంతో నేను లైన్ల నిలబడిన. బ్యాంకు వాళ్లు వచ్చి తలుపు(షటర్) తీయడంతో ఒక్కసారిగా నెట్టుకున్నారు. దీంతో నా తల ఇనుప కడ్డీకి(గ్రిల్)కు తగిలింది. రక్తం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఏం చేయాలో అర్థం కాలేదు. పైసలు తీసుకునుడేమో కాని కొద్దిగైతే నా ప్రాణం పోతుండే. గాయపడిన నన్ను నా కొడుకు దవాఖానకు తీసుకపోయిండు.

-మంద సోమక్క, రైతు, రామన్నగూడెం

రైతులను చీదరించుకుంటున్నారు



లోన్ పైసలు వచ్చినయని సంబురంగ బ్యాంకుకు వచ్చిన. ఇక్కడ చూస్తే శాన మంది ఉన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతులను చూసి చీదరించుకున్నారు. ఏదో వాళ్ల ఇంట్లో నుంచి పైసలు ఇచ్చినట్టు చూస్తున్నారు. ఓ పేపరు మీద ముద్ర వేసి మంగళవారం (ఈ నెల 27న) రమ్మని చెప్పారు. అధికారులు వాళ్ల ఆడిట్ కోసం 20 రోజుల సంది మా పైసలు ఇవ్వకుండా ఇప్పుడు మళ్ల మంగళవారం రమ్మని చెబుతున్నారు. అధికారులు రైతుల బాధలు తీర్చాలి.

-బానోతు రాంసింగ్, రైతు, బాసుతండా

'మూగ'వేదనైనా ఆలకించరూ..!

- మూగజీవాల విషయంలో సర్కార్ మొద్దునిద్ర వీడాలి
- 1962 సంచార వైద్యసేవల్లో అంతరాయాన్ని నివారించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పశువైద్యశాలల్లో మందుల కొరత, 1962 పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయం.. అయినా మూగజీవాల మౌనరోదనను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖలో నెలకొన్న పరిస్థితులపై ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొన్నదని తెలిపారు. నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవటంతో కాలేయం, జీర్ణాశయం, పేగుల్లో పరాన్నజీవులు చేరి రక్తహీనతకు గురవుతున్నాయని వివరించారు.

దేశానికే ఆదర్శంగా 1962

మూగజీవాల వద్దకే వైద్యసిబ్బంది వచ్చి చికిత్స అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 పశువైద్య సంచార వాహనాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు పశుసంవర్ధకశాఖపై సమీక్షించలేదని దుయ్యబట్టారు. వానకాలంలో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సర్కార్ ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని అన్నారు.

చేపపిల్లల పంపిణీ ఏది?

గొర్రెల పంపిణీని అటకెక్కించిన ప్రభుత్వం చేపల పంపిణీని ఆలస్యం చేస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత చేపల పంపిణీ కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. జూన్ నాటికి టెండర్లను పూర్తయ్యి ఆగస్టు నాటికి సగం చేపపిల్లలు చెరువుల్లోకి చేరేవని, కానీ, ఇంకా ఆ ప్రక్రియ టెండర్ దశలోనే ఉండటం అనుమానాలకు తావిస్తున్నదని వెల్లడించారు.

నేడు ఆర్మూర్‌లో 'రుణమాఫీ' మహాధర్నా

మోర్తాడ్, ఆగస్టు 23: నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు రైతు ఐక్యకార్యాచరణ కమిటీగా ఏర్పడి రుణమాఫీ హామీల అమలు కోసం శనివారం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేసేందుకు తీర్మానాలు చేస్తున్నాయి. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అనుమతి ఇచ్చారని ఐక్య కార్యాచరణ కమిటీ ఇన్‌చార్జి ఇట్టడి లింగారెడ్డి తెలిపారు. కాగా చలో ఆర్మూర్, రాస్తారోకో కార్యక్రమానికి అనుమతులు ఇవ్వలేదని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఆర్మూర్‌లో ఈ నెల 23 సాయంత్రం నుంచి 25 ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని చెప్పారు. సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు



రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఎస్‌బీఐ ఎదుట రైతులు రోడ్డుపై ధర్నా చేశారు.రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కొంతమందికకే మాఫీ చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. -చేర్యాల

● ముఖ్యమంత్రి మాటలన్నీ అబద్ధాలే



అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం బోనకల్లు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టిన సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు, బోనకల్లు మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తదితరులు - బోనకల్లు

● బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు



రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతుండగా, మాఫీ అయినవారు రెన్యూవల్ కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు లోపలికి ఒక్కొక్కరినే అనుమతించడంతో బ్యాంకు బయటే రైతులు గంటల తరబడి నిలబడ్డారు. - ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్

● పైసా వసూల్‌పై రైతుల నిరసన



'ఏ పని కావాలన్నా పైసలు అడుగుతున్నారు.. ఇవ్వకుంటే బయటకు పొమ్మంటున్నరు' అంటూ శుక్రవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు. తాము నేరుగా వెళ్తే ఏ పని చేయడం లేదని, దళారులతో వెళ్తేనే పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు - నాగిరెడ్డిపేట

● రుణమాఫీ చేయకుంటే 'స్థానికం'గా ఓడిస్తాం



పంట రుణాన్ని వెంటనే మాఫీ చేయాలని, లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని నిర్మల్ జిల్లా కుంటాలలో తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టిన పెంచికల్‌పాడ్‌కు చెందిన రైతులు - కుంటాల/కుభీర్



హైదరాబాద్ ప్రజాభవన్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు రెండో విడత లబ్ధిదారులు

దళితబంధు రద్దు చేస్తే అగ్నిగుండమే

- ప్రభుత్వం రెచ్చగొడితే చావుడప్పు కొడతాం
- దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్
- ప్రజాభవన్ ఎదుట లబ్ధిదారుల ధర్నా

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: దళితబంధు రెండో విడుత లబ్ధిదారులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్ ఎదుట దళితబంధు రెండో విడుత లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం మహేశ్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను, పథకాన్ని రద్దుచేస్తే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చుతామని హెచ్చరించారు. జాబితా నుంచి ఏ ఒక్క లబ్ధిదారుడి పేరు తొలగించినా ఊరుకోబోమని చెప్పారు. ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్తంగా చావుడప్పు మోగిస్తామని హెచ్చరించారు. వారంరోజుల్లో దళితబంధు నిధులు జమ అవుతాయని ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి హామీ ఇచ్చి 15 రోజులవుతున్నా ఎలాంటి స్పందనా రాలేదని మండిపడ్డారు. దళితబంధు డబ్బు జమ చేయకుంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బ కొడతామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు ప్రజాభవన్‌కు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. దళితబంధు మంజూరు చేయాలని వినతిపత్రాలను ఇచ్చేందుకు వెళ్తే పట్టించుకునే నాథుడేలేడని తెలిపారు.

2లక్షలు ఇస్తరా? ఇవ్వరా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ 65ఏండ్లు నిండిన టీచర్లను, ఆయాలను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ రెండు నెలల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు బెనిఫిట్స్ కిందరూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెనిఫిట్స్‌కు సంబంధించి ఎలాంటి జీవో విడుదల కాలేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిల్లో పని చేస్తున్న టీచర్లు, ఆయాలకు వాస్తవానికి ఉద్యోగ విరమణ అనేది లేదు. బీజేపీ ప్రభుత్వం 2022లో 65 ఏండ్లు వచ్చేంత వరకు మాత్రమే ఈ కేంద్రాల్లో పని చేసేందుకు అర్హులుగా పరిగణిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిటైర్మెంట్ అయిన 5వేల మంది ఉద్యోగ విరమణ పొంది రెండు నెలలైందని, తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించిన ప్రభుత్వం బెనిఫిట్స్ చెల్లించకుండా చోద్యం చూస్తున్నదని అంగన్‌వాడీ టీచర్లు మండిపడుతున్నారు.

ప్రశ్నించిన టీచర్‌పై వేటు

- అసమగ్ర గురుకుల బదిలీలపై టీచర్ల ధర్నా
- సెక్రటరీ తీరును తప్పుబడుతూ మాట్లాడిన ఉపాధ్యాయురాలి వీడియో వైరల్
- నోటీసులిచ్చి పిలిపించి సస్పెన్షన్ వేటు
- మరో 142మందికి సెక్రటరీ వార్నింగ్
- పరిష్కారానికి బదులు ప్రతీకారం
- సెలువు మంజూరు నిబంధనలూ మార్పు
- గురుకుల సొసైటీ సెక్రటరీ తీరును విమర్శిస్తూ ప్రజాభవన్‌లో ధర్నా

హైదరాబాద్, ఆగస్టు23 (నమస్తే తెలంగాణ): అడ్డదిడ్డంగా బదిలీలు చేశారు. జోన్లనే మార్చారు. పిల్లాపాపలకు దూరమై నానా గోసపడుతూ, మానసిక వేదనతో ఇదేమని అడిగితే ఇప్పుడు ఏకంగా సస్పెండ్ చేశారు. మరో 142 మంది టీచర్లకు సైతం వార్నింగ్ నోటీసులు జారీచేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ సెక్రటరీ తీరు ఇది. మానవీయ దృక్పథంతో స్పందించి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కక్షసాధింపులకు దిగడంతో టీచర్లు నివ్వెరపోతున్నారు. కోర్టు స్టే ఆర్డర్లను, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ 317జీవో బాధితులు, డిస్‌లొకేట్ అయిన గురుకుల ఉపాధ్యాయులను రాత్రికిరాత్రే రిలీవ్ చేసి కార్యాలయానికి రప్పించుకుని, ఆపై గ్రీవెన్స్ నిర్వహించకుండానే అప్పటికప్పుడు 177 మందికి పోస్టింగ్ ఇవ్వడం తెలిసిందే. అప్పటికే జోన్లు మారి, కుటుంబాలకు దూరంగా గడుపుతూ మానసికక్షోభను అనుభవిస్తున్న వారు సెక్రటరీ తీరును నిరసిస్తూ కార్యాలయం ఎదుటే బైఠాయించి నిరసనకు దిగారు. నినాదాలు చేశారు. సాయంత్రమైనా సెక్రటరీ స్పందించకపోవడంతో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి సెక్రటరీ చాంబర్ ఎదుట ధర్నాకు దిగారు. సెక్రటరీతో వాగ్వాదానికి దిగారు. సెక్రటరీ మానవీయ కోణంలో స్పందించి సమస్యను పరిష్కరిస్తారని భావిస్తే అదేమీ లేకుండానే వెళ్లిపోయారు. దీంతో టీచర్లందరూ అక్కడి నుంచి నేరుగా ప్రజాభవన్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. మరోవైపు, కార్యాలయం వద్ద బైఠాయించి, నిరసన చేపట్టిన కార్యక్రమం మొత్తాన్ని అక్కడి సిబ్బంది వీడియో తీసి సొసైటీ సెక్రటరీ వర్షిణికి అందించారు. వీడియో ఫుటేజీల ఆధారంగా ఆమె ధర్నా తెలిపిన సిబ్బందిపై కక్షసాధింపులకు దిగారు. డిసిప్లినరీ యాక్షన్ పేరిట 142 మందికి నోటీసులు జారీ చేయాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు.

టీచర్‌పై అప్పటికప్పుడు వేటు

నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి గురుకులంలో టీజీటీ సోషల్ విధులు నిర్వర్తిస్తున్న విజయనిర్మల కూడా పాల్గొన్నారు. సొసైటీ చేపట్టిన బదిలీలు, ప్రమోషన్లను తీవ్రంగా తప్పుబట్టారు. ఉన్నతాధికారుల తీరువల్లే తమకు అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆమెకు రాత్రికి రాత్రే నోటీసు జారీచేశారు. శుక్రవారం ఉదయమే వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. శుక్రవారం సొసైటీ కార్యాలయానికి చేరుకున్న ఆమె వివరణ తీసుకోకుండానే ఏకపక్షంగా సస్పెండ్ చేశారు.

సెలవు మంజూరు నిబంధనల్లో మార్పు

సెలవుల మంజూరుకు సంబంధించిన నిబంధనలు సైతం మార్చివేస్తూ తాజాగా సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రిన్సిపాల్స్ నుంచి అధికారాలను కత్తిరించి జోనల్ ఆఫీసర్ల చేతిలో పెట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్స్ 3 నెలల వరకు సెలవు తీసుకుంటే ఆర్సీవోల నుంచి, అంతకుమించి సెలవులను తీసుకోవాలనుకుంటే సెక్రటరీ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం 5 రోజుల పాటు సెలవు కావాలంటే జాయింట్ సెక్రటరీ నుంచి, ఐదు నుంచి నెల రోజుల వరకు కావాలంటే అడిషనల్ సెక్రటరీ (అడ్మిన్), నెల నుంచి 6 నెలల వరకు సెలవు కావాలంటే సెక్రటరీ నుంచి అనుమతులు పొందేలా నిబంధనలు మార్చారు. టీచింగ్, నాన్‌టీచింగ్, సీనియర్ అసిస్టెంట్ కన్నా పై క్యాడర్ ఇప్పటి వరకు నెల రోజుల పాటు సెలవు కావాలంటే ప్రిన్సిపాల్, 6 నెలల వరకు కావాలంటే ఆర్సీవోలు, 6 నెలలకు మించి సెలవుపై వెళ్లాలనుకుంటే సెక్రటరీ అనుమతి పొందాల్సి ఉండేది. ప్రస్తుతం 5 రోజుల వరకు సెలవుకావాలంటే ప్రిన్సిపాల్ నుంచి, అంతకు మంచి నెలరోజుల వరకు కావాలంటే జోనల్, మల్టీ జోనల్ ఆఫీసర్ల నుంచి, నెలకు మించి సెలవు కావాలంటే టీచింగ్ స్టాఫ్ అడిషనల్ సెక్రటరీ (అడ్మిన్) నుంచి, మినిస్టీరియల్ స్టాఫ్ జాయింట్ సెక్రటరీ నుంచి అనుమతులను పొందేలా మార్చారు. ప్రిన్సిపాల్స్ అధికారాలకు కళ్లెంవేసి, ఆర్సీవోల అధికారాలను సొసైటీ మొత్తంగా తొలగించింది.

ప్రజాభవన్‌లో టీచర్ల వినతి

ఇటీవల సొసైటీ కార్యాలయంలో ధర్నా చేపట్టినా న్యాయం జరగకపోవడంతో అనేకమంది గురుకుల టీచర్లు, అధ్యాపకులు శుక్రవారం నేరుగా ప్రజాభవన్‌కు చేరుకున్నారు. తొలుత ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి గోడు చెప్పుకున్నారు. 317జీవో, డిస్‌లొకేట్ సమస్యలపై సొసైటీ సెక్రటరీ వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రజాదర్బార్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. న్యాయం చేయాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడం గమనార్హం.

దశలవారీగా 2 లక్షల పై రుణాలు మాఫీ

- కుటుంబ నిర్ధారణకు ప్రత్యేక యాప్ : మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): రూ. 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు దశలవారీగా మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన రుణమాఫీపై అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రూ.2 లక్షలలోపు రుణం కలిగి, కుటుంబ నిర్ధారణ కాని రైతులు 4,24,873 మంది ఉన్నారని తెలిపారు. వీరిందరి వివరాలను సేకరించి కుటుంబ నిర్ధారణ చేసేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు తమ వివరాలను ఇంటికి వచ్చే ఏఈవోకు గానీ, రైతు వేదికల్లో ఉండే ఏఈవోకు గాని అందజేయాలని సూచించారు. రూ.2 లక్షలలోపు రుణం కలిగి ఆధార్‌లో తప్పులతో రుణమాఫీకాని రైతులు 1,24,545 మంది ఉండగా వీరిలో 41,322 మంది సమస్యను పరిష్కరించినట్టు తెలిపారు. మిగిలిన 83,223 మందికి ఇంకా రుణమాఫీ కాలేదని చెప్పారు. రుణమాఫీ తర్వాత బ్యాంకులు వేగంగా రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు రూ.18 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తే.. తిరిగి బ్యాంకులు రైతులకు రూ.10,400 కోట్లు మాత్రమే చెల్లించాయని వివరించారు.

2 లక్షల పైన రుణాలకు కటాఫ్ డేట్

మొదటిపేజీ తరువాయి...

చేస్తామని వివరించారు. ఈ నిబంధన ఎందుకు పెట్టారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, రైతులకు రుణమాఫీ తర్వాత మళ్లీ లోన్ రావాలంటే పూర్తిగా రుణం మాఫీ కావాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అందుకే రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణం రైతులు చెల్లిస్తే వారికి మొత్తం మాఫీ అయి, తర్వాత మళ్లీ రుణం వస్తుందని తెలిపారు. సాంకేతిక కారణాలతో రూ.2 లక్షల వరకు రుణం ఉన్న కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని, వారికి కూడా పూర్తిస్థాయిలో మాఫీ చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు.

మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే

రేవంత్‌రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దించేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇందుకోసం తనను, భట్టి విక్రమార్కను, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సాకుగా చూపుతున్నారని పొంగులేటి పేర్కొన్నారు. కానీ, తమకు అన్ని విషయాలపై స్పష్టత ఉన్నదని, తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అని స్పష్టంచేశారు. రాష్ట్ర క్యాబినెట్‌కు సుతీ సన్నాయి లేదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన సమాధానమిచ్చారు. 'మా క్యాబినెట్‌కు ఏముందో మాకు తెలుసు.. మా క్యాబినెట్ ఎంత స్వేచ్ఛా వాతావరణంలో పనిచేస్తున్నదో మాకు తెలుసు. ఏ పవర్స్ ఉన్నాయో మాకు తెలుసు' అని పేర్కొన్నారు. తల తాకట్టు పెట్టయినా ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పారు.

రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు వేర్వేరుగా ఇస్తాం

తెల్ల రేషన్‌కార్డులకు సంబంధించి మంత్రులతో సబ్‌కమిటీ వేశామని, త్వరలోనే కార్డులు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు తెల్ల రేషన్‌కార్డులను, ఆరోగ్యశ్రీ కార్డులను వేర్వేరుగా ఇస్తామని తెలిపారు. ఇక కొత్త రెవెన్యూ చట్టాన్ని దేశానికి ఆదర్శంగా తీసుకొస్తున్నట్టు తెలిపారు. ప్రజలు, మేధావుల నుంచి సూచనలు, సలహాలు తీసుకునేందుకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో రెవెన్యూ యాక్ట్‌పై కలెక్టరేట్లలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. పేదలందరికీ నాలుగేండ్లలో ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. తొలి విడతలో రూ. 22 వేల కోట్లతో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షలు ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండించారు. నిజంగానే దాడి జరిగి ఉంటే, నివేదిక రాగానే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అర్హత లేని పైలట్ల చేతికి విమానం

ఎయిర్ ఇండియాకు 90 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: అర్హత లేని పైలట్లతో విమానాన్ని నడిపినందుకుగాను టాటా గ్రూప్ యాజమాన్యంలోని 'ఎయిర్ ఇండియా'పై డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ సివిల్ ఏవియేషన్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విమానయాన భద్రతను తీవ్రంగా ప్రభావితం చేసినందుకు రూ.90 లక్షలు జరిమానా విధించింది. ఆ సంస్థ అధికారులు పంకుల్ మాథుర్‌కు రూ.6 లక్షలు, మనీశ్ వాసవడకు రూ.3 లక్షలు ఫైన్ విధించినట్టు డీజీసీఏ శుక్రవారం తెలిపింది. ఎయిర్ ఇండియా కొద్ది రోజుల క్రితం ఓ నాన్-ట్రెయినర్ లైన్ క్యాప్టన్, నాన్-లైన్ ఫస్ట్ ఆఫీసర్‌తో ఓ విమానాన్ని నడిపినట్టు తేలింది.

'జ్ఞానవాపీ వాజుఖానాలో సర్వేకు వీల్లేదు'

ప్రయాగ్‌రాజ్: జ్ఞానవాపీ మసీదు వాజుఖానాలో ఏఎస్ఐ సర్వే చేయడానికి అనుమతి లేదని అలహాబాద్ హైకోర్టుకు మసీదు నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ ప్రాంతాన్ని పరిరక్షించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నందున, సర్వే చేయడానికి వీల్లేదని పేర్కొన్నది. వాజుఖానాలో సర్వే నిర్వహించడానికి అనుమతి కోరుతూ అలహాబాద్ హైకోర్టును ఏఎస్ఐ (పురావస్తు శాఖ) ఆశ్రయించింది. దీనిపై గురువారం అంజుమన్ ఇంతెజామియా కమిటీ కౌంటర్ దాఖలు చేసింది. వాజుఖానా, శివ లింగానికి సంబంధించిన అంశాలు సుప్రీంవిచారణలో ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని పరిరక్షించాలని వారణాసి కలెక్టర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించినట్టు తెలిపింది.

'కించపరిచే ఉద్దేశం ఉంటేనే ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తింపు'

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ (దౌర్జన్యాల నిరోధం) చట్టం ప్రకారం ఏ ఫిర్యాదునైనా నేరంగా పరిగణించాలంటే కేవలం ఫిర్యాదుదారు ఎస్సీ లేదా ఎస్టీ అయినంత మాత్రాన సరిపోదని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. ఫిర్యాదుదారును కించపరిచే ఉద్దేశం నిందితునికి లేనిదే ఈ చట్టం ప్రకారం నేరంగా పరిగణించరాదని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన కేసులో యూట్యూబర్ షాజన్ స్కరియాకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు ముందస్తు బెయిల్‌ను కేరళ హైకోర్టు తిరస్కరించడంపై షాజన్ చేసిన అప్పీల్‌పై సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.



జెలెన్‌స్కీతో మోదీ ఆలింగనం

శాంతి వైపు ఉన్నాం

కీవ్: గత రెండున్నర ఏండ్లుగా సాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో భారత్ ఎప్పుడూ తటస్థంగా లేదని, ఈ యుద్ధంలో భారతదేశం శాంతి వైపు మాత్రమే నిలబడుతున్నదని ప్రధాని మోదీ అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధక్షేత్రంలో గాయపడ్డ సైనికులు, ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు 4 'భీష్మ క్యూబ్స్'ను మోదీ ఉక్రెయిన్‌కు అందజేశారు.

మగ జాతి అంతమవుతుందా?!



- క్రమంగా కనుమరుగవుతున్న 'వై' క్రోమోజోమ్స్
- 900 జన్యువుల నుంచి 55కు పడిపోయిన వైనం
- జపాన్ పరిశోధకుల అధ్యయనంలో కీలక విషయాలు
- లింగ నిర్ధారణలో 'వై' క్రోమోజోమ్స్‌దే కీలక పాత్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 23/(స్పెషల్ టాస్క్ బ్యూరో): తల్లి కడుపులోని బిడ్డ లింగాన్ని నిర్ధారించడంలో పురుషుల శుక్రకణాల్లోని వై-క్రోమోజోమ్స్ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, గడిచిన కొంతకాలంగా ఈ జన్యువుల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్నదని, రానున్న కాలంలో ఇవి కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదని జపాన్‌లోని హొక్కయిడో యూనివర్సిటీ పరిశోధకులు చేసిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇదే జరిగితే, భవిష్యత్తులో పురుష జననాలు ఉండకపోవచ్చని పరిశోధకులు అంచనాకు వచ్చారు. అయితే, వైద్యశాస్త్రంలో అమల్లోకి వచ్చిన వినూత్న పద్ధతులు, ఆవిష్కరణల ద్వారా కొత్త జన్యువుల సృష్టితో ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడం అంత పెద్ద కష్టమేమీ కాదని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వివరాలు 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

కనుమరుగు ఇలా..

మనుషులు సహా క్షీరదాల వంటి పాలిచ్చే ఆడ జంతువుల్లో రెండు 'ఎక్స్' క్రోమోజోమ్స్ ఉంటాయి. మగవాటిలో ఒక ఎక్స్ క్రోమోజోమ్‌తో పాటు ఒక వై క్రోమోజోమ్ కూడా ఉంటుంది. ఇదే గర్భంలోని శిశువు లింగాన్ని నిర్ధారిస్తుంది. అయితే, పురుషుల్లోని ఎక్స్ క్రోమోజోమ్‌లో 900 వరకూ వివిధ రకాల జన్యువులు ఉండగా, 'వై' క్రోమోజోమ్‌లో మాత్రం వాటి సంఖ్య 900 నుంచి 55కు పడిపోయినట్టు పరిశోధకులు గుర్తించారు. గడిచిన 166 మిలియన్ సంవత్సరాల్లో ఈ మేరకు జన్యువుల క్షీణత జరిగినట్టు తెలిపారు. ఇది కొనసాగితే రానున్న 110 లక్షల ఏండ్లలో 'వై' క్రోమోజోమ్‌లోని మిగిలిన 55 జన్యువులు(ఎస్ఆర్‌వై జన్యువులు) కనిపించకుండా పోవచ్చని, గర్భంలోని ప్రతి శిశువు ఆడ శిశువుగానే పుట్టొచ్చని అభిప్రాయపడ్డారు.

వై క్రోమోజోమ్ ఎందుకు కీలకం?

గర్భం దాల్చిన 12 వారాల తర్వాత వృషణాలు ఏర్పడటాన్ని క్రమబద్ధీకరించే వాటిని ఈ 'వై క్రోమోజోమ్' ప్రేరేపిస్తుంది. గర్భస్థ పిండం వృషణాలు పురుష హార్మోన్లను (టెస్టోస్టిరాన్ వంటివాటిని) తయారు చేస్తాయి. ఫలితంగా బిడ్డ మగ శిశువుగా రూపొందుతాడు. అందుకే ఈ 'వై క్రోమోజోమ్'ను మాస్టర్ సెక్స్ జీన్‌గా పిలుస్తారు.

అలా జరుగొచ్చు కూడా..

తూర్పు ఐరోపాలో కనిపించే మోల్ వోల్స్ అనే ఎలుక జాతికి చెందిన మగ జంతువులు, జపాన్‌లో కనిపించే మగ స్పైన్ ఎలుకల్లో ఇప్పటికే 'వై' క్రోమోజోమ్స్ అంతరించిపోయాయని పరిశోధకులు తెలిపారు. అయినప్పటికీ, 'వై' క్రోమోజోమ్‌లోని జన్యువుల లక్షణాలు కలిగిన మరికొన్ని కొత్త జన్యువులు(ప్యూ జీన్స్) ఆయా మగ జీవుల్లో కొత్తగా పుట్టుకురావడంతో వాటి జాతి అంతరించిపోలేదని, కొత్తగా మగ పిల్లలు కూడా పుడుతున్నట్టు పరిశోధకులు తెలిపారు. మనుషుల్లోనూ ఇలానే జరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

కర్ణాటక పుట్టలో హైదరాబాద్ పాములు

- 187 కోట్ల 'వాల్మీకి' స్కామ్‌లో తెలంగాణకు 45 కోట్లు
- భాగ్య నగరానికి చెందిన 9 కంపెనీల ఖాతాలకు సొమ్ము
- ఈ సొమ్ముతోనే ఎన్నికల్లో మద్యం, వాహనాల కొనుగోలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని 'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'లో వెలుగు చూసిన రూ.187 కోట్ల విలువైన కుంభకోణం హైదరాబాద్‌కూ పాకింది. ఈ విషయం సిట్ నివేదిక, ఈడీ విచారణలో తేలింది. కుంభకోణంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల ఖాతాలకు రూ.44.6 కోట్లు జమ అయినట్టు సిట్ నివేదిక వెల్లడించింది.

ఏమిటీ స్కామ్?

'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ.187 కోట్లు పక్కదారి పట్టాయి. వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకునే ముందు రాసిన ఆరు పేజీల సూసైడ్ నోటులో స్కామ్ గురించి బయటపెట్టారు. దీనిపై విచారణ జరపాలని ఒత్తిడి పెరగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు చేసింది. ఈడీ సైతం రంగంలోకి దిగింది. లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే 'వాల్మీకి కార్పొరేషన్' నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది. కుంభకోణంలో భాగమైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, మరో ఇద్దరు బ్యాంకు అధికారులు సహా మొత్తం 11 మందిని ఈడీ అరెస్ట్ చేసింది.

హైదరాబాద్‌కు నగదు బదిలీ ఇలా..

రూ.187 కోట్లలో తెలుగు రాష్ట్రాలకు రూ.90 కోట్లు చేరినట్టు సిట్ అంతర్గత నివేదికలో వెల్లడించింది. సిట్ నివేదిక ప్రకారం.. వాల్మీకి కార్పొరేషన్ అప్పటి ఎండీ పద్మనాభ్, అకౌంట్స్ అధికారి పరశురామ్ బెంగళూరులోని యూబీఐ బ్యాంకు ఎంజీ రోడ్డు బ్రాంచీలో మార్చి 30, 2024న రూ.50 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ డిపాజిట్‌పై అదే రోజు రూ. 45 కోట్ల రుణం తీసుకొని, హైదరాబాద్‌లోని ఆర్బీఎల్ బ్యాంకుకు చెందిన 9 ఖాతాలకు రూ.44.6 కోట్లను బదిలీ చేశారు.

ఆ డబ్బుతో ఏం చేశారు?

హైదరాబాద్‌కు చేరిన రూ.44.6 కోట్ల నగదుతో లోక్‌సభ ఎన్నికల ముందు పెద్దయెత్తున మద్యం, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు బదిలీకి వినియోగించిన బ్యాంకు ఖాతాలు నకిలీవని అనుమానం వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కామ్‌కు పాల్పడిందని, స్కామ్‌లోని రూ. 44.6 కోట్లు హైదరాబాద్‌కు చేరడాన్ని చూస్తే, ఇక్కడి కాంగ్రెస్‌కు కూడా ఈ స్కామ్‌తో సంబంధం ఉన్నట్టు అర్థమవుతున్నదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆ మంత్రి మాటలకు అర్థమేంటి?

కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు ఇచ్చినట్టే, రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చంటూ కర్ణాటక మంత్రి సతీశ్ జార్కిహోళి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. 'వాల్మీకి' సామాజికవర్గానికి చెందిన బలమైన నేత జార్కిహోళి ఈ వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే.. ఈ స్కామ్‌లోనే సీఎంకు నోటీసులు వస్తాయా? అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

హైదరాబాద్‌లో ఏ కంపెనీ ఖాతాలో ఎంత డబ్బు అంటే??

సిట్ నివేదిక ప్రకారం సిస్టమ్ అండ్ సర్వీస్ కంపెనీకి రూ. 4.55 కోట్లు, రామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 5.07 కోట్లు, స్కిల్‌మ్యాప్ ట్రైనింగ్‌కు, రూ. 4.84 కోట్లు, స్వాప్ డిజైన్‌కు రూ. 5.15 కోట్లు, జీఎన్ ఇండస్ట్రీస్‌కు రూ. 4.42 కోట్లు, నోవెల్ సెక్యూరిటీకు రూ. 4.56 కోట్లు, సుజల్ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 5.63 కోట్లు, గ్రాబ్ ఏ గ్రబ్‌కు రూ. 5.88 కోట్లు, వీ6 బిజినెస్‌కు రూ. 4.50 కోట్లు అందాయి.

సిట్ రెండో చార్జిషీట్‌లో ప్రధాన నిందితుల పేర్లు గాయబ్

'వాల్మీకి స్కామ్' విచారణ పక్కదారి పడుతున్నట్టు అర్థమవుతున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రెండో ఛార్జిషీట్‌లో కుంభకోణంలో ప్రధాన నిందితులైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, బ్యాంకు ప్రధానాధికారి పేర్లు కనిపించకపోవడం ఈ అనుమానాలకు తావిస్తున్నది.

కాపాడటానికేనా?

తొలి ఛార్జిషీట్‌లో నాగేంద్ర, బసనగౌడ, సుచిస్మితా రావల్ పేర్లను ప్రస్తావించిన సిట్.. శివమొగ్గ జిల్లా కోర్టుకు గురువారం సమర్పించిన రెండో ఛార్జిషీట్‌లో వారి పేర్లను ప్రస్తావించలేదు. కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జేజీ పద్మనాభ, మాజీ అకౌంట్స్ అధికారి పరశురామ్ జీ దుర్గాన్నవార్ పేర్లను మాత్రమే సిట్ ప్రస్తావించింది. దీంతో మాజీ మంత్రి, కార్పొరేషన్ చైర్మన్, యూబీఐ బ్యాంకు చీఫ్ మేనేజర్‌ను కాపాడటానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

రాహుల్.. మౌనమేంటి?

'ముడా' స్కామ్‌పై నోరు మెదపని కాంగ్రెస్ అగ్రనేత

అసహనంతో సిద్ధరామయ్య.. తేల్చుకోవడానికి ఢిల్లీకి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ముడా కుంభకోణానికి సంబంధించి సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటిస్తూ తనకు అండగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి మాత్రం సరైన సంఘీభావం లభించకపోవడంపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసహనంతో ఉన్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంపై ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని సిద్ధరామయ్య జీర్ణించుకోలేకపోతున్నట్టు సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. అదానీ, బెంగాల్‌లో వైద్యురాలి హత్యాచార ఘటన, ఇలా దేశంలోని ప్రతీ అంశంపై స్పందిస్తున్న రాహుల్.. తనకు మద్దతుగా ఒక్క ప్రకటన కూడా చేయకపోవడంపై సిద్ధరామయ్య అసంతృప్తితో రగిలిపోతున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఈ విషయంపై ఢిల్లీలోనే తేల్చుకోవాలని ఆయన నిర్ణయించుకొన్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే శుక్రవారం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వరతో కలిసి ఆయన హస్తినకు వెళ్లి రాహుల్‌తో భేటీ అయినట్టు తెలుస్తున్నది. కాగా, ఈ భేటీలో ముడా స్కామ్‌లో అధిష్ఠానం నుంచి మద్దతు, ఈ కేసులో న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలి? బీజేపీ కుట్రలను తిప్పికొట్టే వ్యూహం తదితర అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తున్నది.

తొలుత ఖర్గే కూడా..

ముడా స్కామ్‌లో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ గత శనివారం అనుమతి ఇచ్చిన సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా బెంగళూరులోనే ఉన్నారు. దీనిపై మీడియా ప్రశ్నించగా.. 'గవర్నర్ నిర్ణయం నాకు తెలియదు. న్యాయవాదులతో చర్చించిన తర్వాతే మాట్లాడుతా' అంటూ వెళ్లిపోవడం సిద్ధరామయ్యకు షాకిచ్చింది. దీంతో సిద్ధరామయ్య వర్గం ఖర్గే తీరును ఎండగట్టింది. దీంతో 'బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం కుట్రలకు దిగుతున్న'దంటూ ఖర్గే ప్రకటన చేయాల్సి వచ్చింది.

ముడా స్కామ్‌లో సిద్ధరామయ్యపై కోర్టు ధిక్కరణ కేసు

ముడా కేసులో సిద్ధరామయ్యపై ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. తనకు ఖరీదైన ప్రాంతంలో స్థలాన్ని కేటాయించమని ముడా అధికారులకు సిద్ధరామయ్య భార్య పార్వతి లేఖ రాశారని స్నేహమయి కృష్ణ అనే వ్యక్తి తన పిటిషన్‌లో ఆరోపించారు. లేఖలో కీలక సమాచారాన్ని వైట్‌నర్‌తో కొట్టివేశారని, కోర్టుకు ఈ విషయాలు తెలియజేయకుండా సిద్ధరామయ్య ఉపశమనం పొందారని ఆరోపించారు.

ఖాళీ అవుతున్న హాస్టళ్లు

- హత్యాచార ఘటనతో ఆర్‌జీ కర్ కళాశాల విద్యార్థినులు, డాక్టర్లలో భయాందోళన
- సీబీఐ విచారణలో వెలుగు చూసిన కొత్త కోణం



తాళాలు వేసివున్న హాస్టల్ రూమ్‌లు

కోల్‌కతా, ఆగస్టు 23: జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనతో కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల విద్యార్థినులు, మహిళా డాక్టర్లు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక్కొక్కరు హాస్టళ్లు, కళాశాల ప్రాంగణం వదిలి సొంతూర్లకు వెళ్లడం ప్రారంభించారు. ఈ నెల 14న కొందరు దుండగులు కర్రలు, రాళ్లు, రాడ్లతో దవాఖాన ప్రాంగణంలోకి చొరబడి దాడులు చేయడంతో వీరిలో భయాందోళనలు మరింత పెరిగాయి. అప్పటి నుంచి పెద్ద సంఖ్యలో హాస్టళ్లను వదిలిపెట్టి వెళ్లారు. దీంతో ఇప్పుడు లేడీస్ హాస్టళ్లన్నీ ఖాళీగా మారిపోయాయి. గతంలో క్యాంపస్ హాస్టళ్లలో 160 మంది మహిళా జూనియర్ డాక్టర్లు ఉండగా, ఇప్పుడు 17 మంది మాత్రమే ఉన్నారని, నర్సింగ్ హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు చెప్తున్నారు.

గడియ లేకపోవడమే ఘటనకు కారణమా?

ట్రెయినీ డాక్టర్ హత్యాచారం జరిగిన సెమినార్ హాల్ తలుపు గడియ విరిగి ఉండటం ఇప్పుడు సీబీఐకి కొత్త అనుమానాలు కలిగిస్తున్నది. ఆమెను అంత క్రూరంగా హింసిస్తున్నప్పుడు బయటకు శబ్దం వినిపించి ఉండాలని సీబీఐ భావిస్తున్నట్టు సమాచారం. ఈ కేసులో అరెస్టయిన నిందితుడు సంజయ్ రాయ్‌కు కోర్టు శుక్రవారం 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది.

విధుల్లోకి చేరిన వైద్యులు

11 రోజుల పాటు సమ్మె నిర్వహించి విధులకు దూరంగా ఉన్న వైద్యులు శుక్రవారం మళ్లీ విధుల్లో చేరారు. సుప్రీం కోర్టు సూచన మేరకు సమ్మె విరమిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ ప్రకటించాయి. దీంతో శుక్రవారం దేశంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు విధుల్లోకి చేరారు.

తమిళనాడు ఘటనలో నిందితుడి ఆత్మహత్య!

చెన్నై: తమిళనాడులో నకిలీ ఎన్‌సీసీ శిబిరంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ప్రధాన నిందితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు! నిందితుడు శివరామన్‌ను పోలీసులు ఆగస్టు 19న అరెస్టు చేశారు. అంతకు ముందే అతడు పురుగుల మందు తాగాడని, దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయాడని పోలీసులు ప్రకటించారు.

రేప్ బాధితురాలి ఆత్మహత్య

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌లో సామూహిక అత్యాచారం బాధితురాలు ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె తండ్రి తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలిని ముగ్గురు వ్యక్తులు ఈ నెల 17న తీసుకెళ్లి, సామూహిక అత్యాచారం చేసి, ఓ పాఠశాల వద్ద పడేశారు. ఆమెను గుర్తించిన ఓ వ్యక్తి ఆయనకు ఫోన్ చేసి, చెప్పారు. ఆమె హెల్ప్ లైన్ ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు సామూహిక అత్యాచారం నేరం జరిగినట్లు కేసు నమోదు చేయడానికి తిరస్కరించారు. కేవలం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు మాత్రమే కేసు నమోదు చేశారు.

నాలుగేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

జైపూర్: రాజస్థాన్‌లోని గంగా నగర్‌లో నాలుగేళ్ల బాలికపై ఆమె బంధువు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె తల్లి గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లినపుడు ఈ దారుణం జరిగింది. ఆమె తల్లి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో వచ్చి చూసేసరికి ఆ బాలిక గాయపడి, ఏడుస్తుండటాన్ని గమనించారు. బాధితురాలిని సూరత్‌గఢ్‌లోని దవాఖానలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

లైంగిక దాడి తర్వాత పెండ్లి.. అయినా 20 ఏండ్ల జైలు

కోటా: రాజస్థాన్‌లో 17 ఏండ్ల మైనర్ బాలికను అపహరించి, అత్యాచారం చేసిన వ్యక్తికి 20 ఏండ్ల జైలు శిక్ష పడింది. లైంగి దాడి తర్వాత బాధితురాలిని నిందితుడు పెండ్లి చేసుకొన్నా కోర్టు శిక్షను ఖరారు చేయడం గమనార్హం. బుండి సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిషన్‌పుర గ్రామంలో కౌశల్ రాజ్ అనే వ్యక్తి 2019లో ఒక మైనర్ బాలికను అపహరించాడు. పోక్సో చట్టం కింద కోర్టు, ముద్దాయికి 20 ఏండ్ల జైలు, రూ.1.30 లక్షల జరిమానా విధించింది.



బాలికపై లైంగిక దాడికి నిరసనగా నాగావ్ జిల్లాలో స్థానికుల ఆందోళన

అస్సాంలో బాలికపై గ్యాంగ్ రేప్

- ట్యూషన్ నుంచి వస్తుండగా అఘాయిత్యం
- స్థానికుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

గువాహటి, ఆగస్టు 23: దేశంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. తాజాగా అస్సాంలోని నాగావ్ జిల్లా దింగ్ ప్రాంతంలో 14 ఏండ్ల బాలిక సామూహిక లైంగిక దాడికి గురైంది. బాలిక ట్యూషన్ నుంచి తిరిగి వస్తుండగా అడ్డగించిన ముగ్గురు వ్యక్తులు ఈ దురాగతానికి ఒడిగట్టారని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. గ్యాంగ్ రేప్ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బాలిక సైకిల్‌పై ఇంటికి వస్తుండగా, బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డగించి సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను రోడ్డు పక్కన ఒక కుంట సమీపంలో వదిలేసి వెళ్లారు. అనంతరం బాలికను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని నాగావ్‌లోని ఓ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితుల్లో ఒకరిని అరెస్టు చేశామని, మిగతా వాళ్ల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హిమంత బిశ్వ చెప్పారు.



బస్ బోల్తా..27 మంది మృతి

నేపాల్‌లో నదిలోకి దూసుకెళ్లిన మహారాష్ట్ర యాత్రికుల బస్సు

ముంబై, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): నేపాల్‌లో శుక్రవారం ఉదయం ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. 41 మంది భారత యాత్రికులతో వెళ్తున్న బస్సు నదిలోకి పడటంతో మహారాష్ట్రకు చెందిన 27 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బస్సు తనాహున్ జిల్లా ముగ్లింగ్ సమీపంలో కొండల ప్రాంతంలో వెళ్తుండగా అదుపు తప్పి పక్క లోయలోని మర్స్యంగడి నదిలోకి బోల్తా కొట్టింది.

దైవ దర్శనం కోసం వెళ్తుండగా..

భుసావల్ గ్రామానికి చెందిన 104 మంది బృందం దైవదర్శనం కోసం రెండు రోజుల క్రితం నేపాల్ వెళ్లింది. ప్రమాదంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.



మెదడులోకీ మైక్రో ప్లాస్టిక్

అంకారా, ఆగస్టు 23: మానవ శరీరాన్ని ప్లాస్టిక్ ఆక్రమించేస్తున్నదని, ఆఖరికి మెదడు కణజాలంలోకి కూడా మైక్రోప్లాస్టిక్ చేరిందని పరిశోధకులు గుర్తించారు. మృత దేహాల నుంచి మెదడు, కాలేయం, మూత్రపిండాల నమూనాలను సేకరించిన పరిశోధకులు అధ్యయనం చేయగా అన్నింటిలో ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉన్నట్టు గుర్తించారు. 91 మెదడు నమూనాలను పరిశీలించగా ఇతర అవయవాల కంటే ఎక్కువ మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు న్యూ మెక్సికో యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు మాథ్యూ కాంపెన్ తెలిపారు. 24 మెదడు నమూనాల్లో అయితే మొత్తం బరువులో 0.5 శాతం వరకు ప్లాస్టిక్ ఉన్నట్టు చెప్పారు. డిమెన్షియా, అల్జీమర్స్ వంటి సమస్యలు ఉన్న వారి మెదళ్లలో ప్లాస్టిక్ ఎక్కువ ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు.




చైనాలో డ్రోన్లతో ఫుడ్ డెలివరీ

బీజింగ్, ఆగస్టు 23: చైనా డ్రోన్ల ద్వారా ఆహార డెలివరీని ప్రారంభించింది. ప్రపంచంలోని అద్భుత కట్టడాల్లో ఒకటైన గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను సందర్శించేవారికి ఫుడ్ డెలివరీ దిగ్గజం మెయిటువాన్ ఈ సేవలు అందించనుంది. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా వద్ద ఓ హోటల్ పైకప్పు నుంచి సమీపంలోని వాచ్ టవర్ వరకు ఈ సేవలను ఏర్పాటు చేసినట్టు మెయిటువాన్ డైరెక్టర్ యాన్ యాన్ తెలిపారు. సాధారణంగా ఫుడ్ డెలివరీ చేసేందుకు కనీసం 50 నిమిషాల సమయం పడుతుందని, అదే డ్రోన్ల ద్వారా అయితే కేవలం 5 నిమిషాల్లోనే చేరవేయవచ్చని చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకే ఆర్డర్లను స్వీకరిస్తామని, ఆ తర్వాత గ్రేట్ వాల్‌పై పర్యాటకులు పడేసిన వ్యర్థాలను రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించేందుకు డ్రోన్లను ఉపయోగిస్తామని తెలిపింది.

ఆఫీస్ బయట ఫ్రీ బర్డ్స్!

- పని గంటల తర్వాత యజమానులను ఉద్యోగులు పట్టించుకోవాల్సిన పని లేదు
- ఫోన్లు, సందేశాలను తిరస్కరించే హక్కు
- ఆస్ట్రేలియాలో 26 నుంచి అమల్లోకి కొత్త చట్టం



కాన్‌బెర్రా, ఆగస్టు 23: ఉద్యోగుల పని సంబంధిత మానసిక సమస్యలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఆస్ట్రేలియాలో తీసుకొచ్చిన ఒక కొత్త చట్టం ఈ నెల 26 నుంచి అమల్లోకి రానున్నది. ది ఫెయిర్ వర్క్ అమెండ్‌మెంట్(రైట్ టూ డిస్‌కనెక్ట్) చట్టం కింద ఉద్యోగులు పని గంటలు పూర్తయ్యాక తమ యజమానులను, వారి నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. బాస్‌లను విస్మరించే హక్కును ఈ చట్టం కల్పిస్తుంది. యాజమాన్యాల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలను, చెప్పే పనులను తిరస్కరించే ఉద్యోగులకు ఈ చట్టం కొంత మేర రక్షణ కల్పిస్తుందని భావిస్తున్నారు. అయితే ఈ చట్టంలో కొన్ని మినహాయింపులు కూడా పొందుపరిచారు. ఉద్యోగుల తిరస్కరణను అసమంజసమైనదనిగా చెప్పేందుకు సదరు ఉద్యోగి జాబ్ రోల్, బాధ్యతలు, కారణం వంటి వాటి ద్వారా కొన్ని ప్రత్యేక పరిస్థితులను చట్టంలో పేర్కొన్నారు.

యాజమాన్య సంఘాల వ్యతిరేకత

ఆస్ట్రేలియా తీసుకొచ్చిన ఈ కొత్త చట్టాన్ని కంపెనీల యాజమాన్య సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. హడావుడిగాఈ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శిస్తున్నాయి.

ఉద్యోగి తిరస్కరణ అసమంజసమని పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు:

- యజమాని సంప్రదించడానికి కారణం
- ఆ కాంటాక్ట్‌ను ఎలా చేశారు? ఇది ఉద్యోగి వ్యక్తిగత పనికి ఎంత మేర విఘాతం కలిగించింది?
- ఉద్యోగి చేసిన అదనపు పని గంటలకు అదనపు చెల్లింపులు చేశారా?
- కంపెనీలో ఉద్యోగి పాత్ర, బాధ్యతల స్థాయి.
- ఉద్యోగికి ఉన్న కుటుంబ, వ్యక్తిగత బాధ్యతలు.



కష్టకాలంలో కమల్ సలహా

రజనీకాంత్ తాజాగా తన 'దళపతి'నాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా షూటింగ్‌లో జరిగిన ఓ సంఘటన గురించి ఆయన చెబుతూ.. ''దళపతి'లో అమ్రీష్‌పురీ పాత్ర మెయిన్ విలన్. క్రూరుడైన రాజకీయనాయకుడిగా నటించారాయన. ఆయన కాంబినేషన్‌లో ఓ సన్నివేశం ఉంది. సినిమాలో చాలా ముఖ్యమైన సన్నివేశం అది. ఆ సీన్‌లో ఆయనతో నేను సవాల్ విసురుతా. మణిరత్నం ముందే చెప్పారు 'ఈ సీన్ చాలా కీలకం.. మీరు ఎంత బాగా చేస్తే ఆ సీన్ అంతబాగా పండుతుంది' అని. నేను కూడా ఛాలెంజ్‌గా తీసుకున్నా. అయితే ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా చేసినా మణిరత్నం మాత్రం తృప్తి పడటంలేదు. లెక్కలేనన్ని టేకులు తీసుకున్నా. కానీ ఓకే మాత్రం అవ్వడంలేదు. చివరికి నాపై నేను నమ్మకం కోల్పోయే పరిస్థితికొచ్చా. ఏం చేయాలో అర్థం కాక, షూటింగ్‌కి కాస్త గ్యాప్ రాగానే నా మిత్రుడు కమల్‌హాసన్‌కి కాల్ చేసి, విషయం చెప్పా. తను నవ్వి.. 'ఇలాంటిది జరుగుతుందని ముందే తెలుసు. ఓ పనిచెయ్.. ఆ సన్నివేశాన్ని మణిరత్నాన్ని నటించి చూపించమను.' అని సలహా ఇచ్చారు. తను చెప్పింది పాటించా. వెంటనే సమస్య తీరిపోయింది. నేనేం చేస్తే దాన్నే ఓకే చేశారు.' అంటూ నవ్వుతూ చెప్పుకొచ్చారు రజనీ. ఈ జ్ఞాపకంతో రజనీ, కమల్‌ల స్నేహం ఎంత బలమైందో మరోసారి అర్థమైంది.

బాలీవుడ్ నుంచి పిలుపు

ఒకానొక దశలో శ్రీలీల నటించిన సినిమా శుక్రవారానికి ఒకటి విడుదలయ్యేది. అసలు ఈ అమ్మాయి ఇన్ని సినిమాలకు డేట్స్ ఎలా ఇస్తుంది? అనే విషయంపై ఫిల్మ్ వర్గాల్లో చర్చలు ఓ రేంజ్‌లో జరిగాయి. అయితే.. అన్ని సినిమాలు చేసినా విజయాలు మాత్రం అరాకొరే. ధమాకా, భగవంత్ కేసరి సినిమాలు మినహాయిస్తే చెప్పుకోదగ్గ విజయాలు ఈ ముద్దుగుమ్మకు రాలేదనే చెప్పాలి. అందుకే.. రాశి కంటే వాసి ముఖ్యమని భావిస్తున్నది శ్రీలీల. అవకాశాలు వస్తున్నా ఆచితూచి నిర్ణయాలు తీసుకునే పనిలో ఉంది. తాజాగా ఓ అగ్ర హీరో సినిమాలో ఐటమ్ సాంగ్ కోసం శ్రీలీలను కలిస్తే సున్నితంగా తిరస్కరించిందని ఫిల్మ్ వర్గాల టాక్. ఇదిలావుంటే.. ప్రస్తుతం శ్రీలీల చేస్తున్న సినిమాలు ఉస్తాద్ భగత్‌సింగ్, ఆర్‌టీ 75. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ డెబ్యూ మూవీలో కూడా శ్రీలీల పేరే ఎక్కువ వినిపిస్తున్నది. ఇదిలావుంటే.. బాలీవుడ్‌లో సిద్దార్థ్ మల్హోత్ర కథానాయకుడిగా నటిస్తున్న 'మిట్టి' చిత్రంలో శ్రీలీల ఓ కీలక పాత్ర పోషించనుందని బాలీవుడ్ మీడియాలో కథనాలు ప్రసారమవుతున్నాయి. కథాగమనంలో తన పాత్ర కీలకంగా ఉండటంతో శ్రీలీల ఈ సినిమాకు వెంటనే అంగీకరించిందని తెలిసింది. అక్టోబర్‌లో ఈ సినిమా ప్రారంభం కానున్నదట. వీటితోపాటు తమిళంలో కూడా రెండు సినిమాలకు ఈ అందాలభామ సంకతం చేసినట్టు తెలుస్తున్నది. ఏది ఏమైనా.. దూకుడు తగ్గించి, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్న ఈ తెలుగమ్మాయికి ఇకనైనా విజయాలు పలకరిస్తాయో లేదో చూడాలి.



నిజంగా ఆశ్చర్యపోయాను



సూపర్‌స్టార్ కొడుకుననే భేషజం ఇసుమంత కూడా కనిపించదు రామ్‌చరణ్‌లో. పాన్‌ఇండియా హీరో స్థాయికి ఎదిగినా ఇప్పటికీ ఒదిగే వుండటం ఆయన స్టైల్. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఇష్టాఇష్టాల గురించి చెప్పుకొచ్చారు రామ్‌చరణ్. తన సినిమాల్లో తనకు నచ్చిన సినిమా ఏంటి? అనడిగితే తడుముకోకుండా ఆరంజ్, రంగస్థలం సినిమాల పేర్లు చెప్పేశారు రామ్‌చరణ్. 'మగధీర' గురించి ప్రస్తావిస్తే.. 'అది నా అభిమానులకు ఇష్టమైన సినిమా. నా కెరీర్‌ని నిలబెట్టిన సినిమా కూడా'.. అని సమాధానమిచ్చారు చరణ్. అంతే కాదు, తనకు సినిమాల్లో యాక్షన్ సినిమాలంటే ఇష్టమని, దుస్తుల్లో సంప్రదాయ దుస్తులకే ప్రాధాన్యత ఇస్తానని ఆయన చెప్పుకొచ్చారు. ఇష్టమైన హీరోహీరోయిన్లు? అనడిగితే.. తమిళ హీరో సూర్య, సమంత అని సూటిగా బదులిచ్చారు. ఇక తన జీవితంలో మరచిపోలేని ఫ్యాన్ మూమెంట్ గురించి చెబుతూ 'ఇండియాలో నాకు చాలామంది అభిమానులున్నారు. వాళ్లు నాపై అభిమానం చూపించడం కామన్. అయితే.. 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రమోషన్స్‌కి జపాన్ వెళ్లాం. అక్కడ ఓ 70ఏళ్ల వృద్ధురాలు నాకు 180 పేజీల పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చింది. అది ఓపెన్‌చేసి చూస్తే. అందులో నేను చేసిన పాత్రలు, చిత్రాలకు సంబంధించిన బొమ్మలు ఉన్నాయి. వాటిని ఆమె స్వయంగా గీశారట. నిజంగా ఆశ్చర్యపోయాను. ఆమెది నా భాష కాదు, నా దేశం కాదు. కానీ అభిమానంతో నా బొమ్మలు గీశారు. జీవితంలో మరిచిపోలేని సంఘటన అది.' అంటూ గుర్తుచేసుకున్నారు రామ్‌చరణ్.

రవితేజకు తీవ్రగాయం



అగ్ర నటుడు రవితేజ కుడి చేతికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో శస్త్ర చికిత్స జరిగింది. ఆయన్ని ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. వివరాల్లోకెళ్తే.. 'ఆర్‌టీ 75'(వర్కింగ్ టైటిల్) సినిమా చిత్రీకరణ జరుగుతుండగా ప్రమాదవశత్తూ రవితేజ కుడి చేతికి స్వల్ప గాయమైంది. గాయం చిన్నదే అయినా.. దాన్ని లెక్క చేయకుండా అవిశ్రాంతంగా చిత్రీకరణలో పాల్గొనడం వల్ల అది తీవ్రమైందని వైద్యులు పేర్కొన్నారు. దీంతో శస్త్రచికిత్స చేయడం తప్పలేదని వారు అన్నారు. రవితేజ గాయపడిన విషయం తెలుసుకున్న అభిమానులు షాక్‌కి గురయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో కామెంట్లు కూడా పెడుతున్నారు. ఇక 'ఆర్‌టీ 75' సినిమా వివరాల్లోకెళ్తే.. రచయిత భాను భోగవరపు దర్శకుడిగా మారి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈసినిమాను తీర్చిదిద్దుతున్నారు. శ్రీలీల ఇందులో కథానాయిక.

మిరాయ్ ఓ అద్భుతం



'హను-మాన్'తో పాన్ ఇండియా విజయాన్ని సొంతం చేసుకున్న తేజ సజ్జా కథానాయకుడిగా రూపొందుతోన్న సూపర్‌హీరో మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఈ సినిమా విడుదల కానుంది. తేజా పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఈ సినిమా న్యూ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో తేజా యోధుడుగా కనిపించనున్నాడు. దానికి తగ్గట్టే పోస్టర్ కూడా డిజైన్ చేశారు. పోస్టర్‌లో మండుతున్న ఐరెన్ రాడ్‌ను పట్టుకుని పైకి చూస్తున్న తేజాను చూడొచ్చు. తేజా నేపథ్యంలో పురాతన దేవాలయం కనిపిస్తున్నది. సినిమాపై ఆసక్తిని పెంచేలా పోస్టర్ ఉందని చెప్పొచ్చు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరపై కొత్త ప్రపంచాన్ని చూపించనున్నాడని, అత్యుత్తమ సాంకేతిక విలువలతో సినిమా ఉంటుందని నిర్మాత చెబుతున్నారు. మంచు మనోజ్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, స్క్రీన్‌ప్లే, మాటలు, కెమెరా, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని, నిర్మాణం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.

హత్య వెనక రహస్యం



మల్లెపువ్వు, మెంటల్‌కృష్ణ, కలవరమాయే మదిలో వంటి చిత్రాలను తీసిన నిర్మాత మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా మారారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ఎమ్4 ఎమ్' (మోటివ్ ఫర్ మర్డర్). సంభీత్ ఆచార్య, జోశర్మ జంటగా నటిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్‌కు అద్భుతమై స్పందన లభిస్తున్నదని, హత్యా నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే థ్రిల్లర్ చిత్రమిదని, వసంత్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెలిపారు. ఈ చిత్రానికి కథ: మోహన్ వడ్లపట్ల, జోశర్మ, రాహుల్ ఆడబాల, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల.

హేమపై సస్పెన్షన్ ఎత్తివేత



బెంగళూరు డ్రగ్స్ కేసు నేపథ్యంలో సినీ నటి హేమపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా) నిర్ణయం తీసుకుంది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపింది. కొద్ది రోజుల క్రితం బెంగళూరు రేవ్ పార్టీ డ్రగ్స్ వ్యవహారంలో అక్కడి పోలీసులు హేమను అరెస్ట్ చేశారు. అనంతరం 'మా' ఆమెపై సస్పెన్షన్ విధించింది. అయితే ఇటీవల విడుదల చేసిన వీడియోలో తాను ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని, దేశంలోనే ఉన్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నట్లు హేమ తెలిపింది. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని, 'మా'తనకు అండగా నిలవాలని ఆమె అభ్యర్థించింది. ఈ విషయాలతో 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు లేఖ రాయడంతో పాటు మెడికల్ సర్టిఫికెట్‌లను కూడా అందజేసింది. ఈ ఆధారాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఎగ్జిక్యూటివ్ కమిటీ హేమపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.



27 మంది భారతీయుల దుర్మరణం

- నేపాల్‌లో నదిలోకి దూసుకెళ్లిన యాత్రికుల బస్సు › 11

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

నిపుణ — Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శనివారం SATURDAY 24.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 80 ‖ వెల (Price) రూ.6.50

పంచమి

శనివారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-35. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: పంచమి ఉదయం 7-52 వరకు, తదుపరి షష్ఠి తెల్లవారుజామున 5-31 వరకు. నక్షత్రం: అశ్విని సాయంత్రం 6-06 వరకు. వర్జ్యం: పగలు 2-24 నుంచి పగలు 3-53 వరకు, పునర్ వర్జ్యం రాత్రి 3-10 నుంచి తెల్లవారుజామున 4-40 వరకు. రాహుకాలం: ఉదయం 9-10 నుంచి ఉదయం 10-44 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-01 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: ఉదయం 11-26 నుంచి పగలు 12-54 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

రేవంత్ రాజకీయ హైడ్రామా!



హైడ్రా.. అంతా మా ఇష్టం

గండిపేట జలాశయానికి వెళ్లే దారిలోనే ఉన్న రెండు నిర్మాణాలు ఇవి.. నిజానికి ఎడమవైపు ఉన్న కట్టడం జలాశయానికి మరింత సమీపంలో ఉన్నది. అయినా, హైడ్రా కుడివైపు ఉన్న నిర్మాణాన్ని మాత్రమే కూల్చివేసింది. కుడివైపునే, దానికంటే ముందు నిర్మాణంలో ఉన్న మరో కట్టడాన్ని అది ముట్టుకోలేదు. ఎడమవైపు ఉన్న కట్టడం చేసిన ఒప్పేమిటి? కుడివైపు ఉన్న కట్టడం చేసిన తప్పేమిటి. ఒకదాన్ని కొట్టి మరోదాన్ని నిలబెట్టడంలో మాయేమిటి?

రాజకీయం చిత్రమైనది. పైకి కనిపించేది ఒకటి, లోపలి మర్మం మరొకటి! అక్రమమేదైనా అక్రమమే. రాజకీయమే జీవితం అనుకున్న వాళ్లకు తన వాళ్లంతా సక్రమంగా, రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే అక్రమంగా కనిపిస్తారు. ప్రస్తుతం హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న వ్యవహారం కూడా అచ్చం ఇలాగే ఉంది. కేసీఆర్ కుటుంబ సభ్యులపై బురద జల్లడమే లక్ష్యంగా సాగుతున్న 'బద్నాం రాజకీయం' టార్గెట్ కూడా ఇదే. జరగనిది జరిగినట్టు, జరిగినది జరగనట్టు మాయచేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు రాష్ట్ర ప్రజలను భ్రమింపజేయడానికి హైడ్రాను వాడుకుంటున్నది. కేటీఆర్ ఫామ్‌హౌస్ అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి తెగబడింది. అసలు హైదరాబాద్ జంట జలాశయాల సమీపంలో పరిస్థితి ఏమిటి? ఎవరెవరికి ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి? వారిలో కాంగ్రెస్ ప్రముఖులెవరు? ఎఫ్‌టీఎల్‌లో ఉన్నవేమిటి? బఫర్ జోన్‌లో ఉన్నవేమిటి? అసలు హైకోర్టు అడిగినట్టు ఎఫ్‌టీఎల్‌ను ఎవరు నిర్ధారించారు? మరి కొందరివే ఎందుకు కూలుస్తున్నారు? కొందరివి ఎందుకు కూల్చడం లేదు? అంతరార్థం సుస్పష్టం.

ఆస్తుల ధ్వంసం, తద్వారా ఇమేజ్ హననం కూడా ఒక రాజకీయ ఆయుధమే! అక్రమ కట్టడాలను అడ్డుకోవడం తప్పుకాదు. కానీ ఆ పేరుతో చట్టాన్ని ఇష్టారాజ్యంగా వాడుకోవడం, ఒక్కొక్కరికి ఒక్కొక్కరకంగా వర్తింపజేయడం, తద్వారా వ్యక్తిత్వాల కూల్చివేతే అసలు సమస్య. హైడ్రా ద్వారా ప్రభుత్వం చేస్తున్నది ఇదే.

ఈ నేపథ్యంలో అసలు గండిపేట (ఉస్మాన్‌సాగర్), హిమాయత్‌సాగర్ జలాశయాల పరిధిలో ఏం జరుగుతున్నది? తెలుసుకునేందుకు నమస్తే తెలంగాణ ప్రత్యేక బృందం అక్కడ పర్యటించింది. ఈ పర్యటనలో తెలుసుకున్న విషయాల ఆధారంగా..

ఆయా ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, వాటి ఫొటోలు, గూగుల్ మ్యాప్‌ల సమాహారమైన కథనం నమస్తే పాఠకులకు ప్రత్యేకం.

- **హైడ్రా పరిధి, కూల్చివేతలపై ఎన్నెన్నో సందేహాలు**
- **అసలు జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌పై స్పష్టతుందా?**
- **జలమండలి చిత్రపటాల్లోనే రెండు లెక్కలు ఎందుకు?**
- **హద్దు రాళ్లలో ఉన్నవెన్ని? జల సమాధి అయినవెన్ని?**
- **జలాశయాల్ని పర్యవేక్షించే జలమండలి ఏం చేస్తున్నది?**
- **ఎఫ్‌టీఎల్ సంగతి సరే; మరి బఫర్‌జోన్‌ను కాపాడేదెవరు?**
- **కొన్నింటిని వదిలి, కొన్నింటినే కొట్టి.. ఇదీ హైడ్రా పని**
- **తన పరిధిలో లేని మూడు గ్రామాల్లోనూ కూల్చుడు**

(గుండాల కృష్ణ)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): నోరు మంచిదైతే ఊరు మంచిదైతదంటరు! అట్లనే సర్కారు ఉద్దేశం ప్రజా ప్రయోజనమైతే వీసమెత్తు అనుమానాలు తలెత్తవు. అంతకుమించి ఆరోపణలు అసలే ఉండవు. కానీ హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ ఏజెన్సీ (హైడ్రా) పురుడుపోసుకొని నెల రోజులు కాకముందే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దాని ప్రతి అడుగు అనుమానాలకు తావిస్తున్నది. హైడ్రా కమిషనర్‌గా ప్రభుత్వం నియమించిన ఏవీ రంగనాథ్ ట్రాక్ రికార్డ్‌పై ఏ ఒక్కరికీ సందేహాలు లేవు. కాకపోతే సర్కారు సైగలో... ఆక్రమణలను నిర్ధారించే ప్రభుత్వ శాఖ లోపభూయిష్ట నిర్ణయాలో... కారణమేదైనా! కండ్ల ముందు కనిపించే ఒక నిర్మాణాన్ని అక్రమమంటూ కూల్చివేసిన హైడ్రా... దాని పక్కనే ఉన్న దానిని విస్మరించడమంటే ఇంతకీ కూల్చినది అక్రమమా? వదిలేసినదీ సక్రమమా!? సూటి ప్రశ్నలకు జవాబు ఇవ్వాల్సిన బాధ్యత › 4వ పేజీలో

• ఇది హైకోర్టు న్యాయం

కూల్చివేతలకు ముందు సంబంధిత అధికారి చట్టప్రకారం భవన యజమానికి నోటీసు ఇవ్వాలి కదా? నోటీసు ఇవ్వకుండా కూల్చివేయొచ్చా? ఏ అధికారం కింద కూల్చివేస్తారు? నోటీసు ఇవ్వాలి. ఆక్రమణదారుల, అనధికార నిర్మాణదారుల హక్కుల పత్రాలను ప్రాథమిక పరిశీలన చేయాల్సిందే. - ఆగస్టు 22న హైకోర్టు

• ఇది హైడ్రా న్యాయం

కూల్చివేసిన తన నిర్మాణానికి సంబంధించి ఓ యజమాని హైడ్రా ఉన్నతాధికారి వద్దకు వెళ్లి 'సార్.. కూల్చివేసే ముందు కనీసం నోటీసులు ఇవ్వాలి కదా!' అని అడిగారు. అందుకు ఆ ఉన్నతాధికారి ఇచ్చిన జవాబు ఏమిటంటే 'అలా ముందస్తు నోటీసులు ఇస్తే, మీరు కోర్టుకు వెళ్తారుగా!' అని. ఎవరైనా కోర్టుకు వెళ్లే హక్కుని హైడ్రా ఎలా అడ్డుకుంటుంది. న్యాయం చెప్పాల్సింది కోర్టా? హైడ్రానా?



వీటిని కూల్చే దమ్ముందా!

ఇది రాష్ట్రమంత్రి, కాంగ్రెస్ ముఖ్యనేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి హిమాయత్‌సాగర్ జలాశయం సమీపంలో ఉన్న విశాలమైన ఫామ్‌హౌస్ (ఎర్రటి పెంకులతో ఉన్నది). దాని పక్కనే నల్లటి పైకప్పుతో ఉన్నది ఆయన సోదరుడి ఫామ్‌హౌస్‌గా చెప్తారు

1. అసలు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లను నిర్ధారించింది ఎప్పుడు? అక్కడ హద్దురాళ్లున్నాయా? ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను పీకేసి, మట్టి నింపి, ఏండ్ల తరబడి ఫామ్‌హౌస్‌లు కడుతుంటే ప్రభుత్వాలు, విభాగాలు ఏం చేస్తున్నాయి? ఎఫ్‌టీఎల్‌కే హద్దురాళ్లు లేకపోతే ఇక బఫర్‌జోన్‌ను కనుక్కునేది ఎలా?

2. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ 1792 అడుగులా? లేక 1790 అడుగులా? ఈ జలాశయం నిర్వహణను చూసే జలమండలి రికార్డుల్లోనే రెండు రకాల ఎఫ్‌టీఎల్‌లు ఎలా ఉంటాయి? ఎఫ్‌టీఎల్‌ను రెండు అడుగుల మేర కుదించే అధికారం జలమండలికి ఉన్నదా?

3. ఎఫ్‌టీఎల్ మీద స్పష్టత లేదు. హద్దురాళ్లు లేవు. ఇలాంటప్పుడు హైడ్రా దేని ఆధారంగా ఏది ఎఫ్‌టీఎలో, ఏది బఫర్‌జోనో నిర్ణయిస్తున్నది? ఏ ప్రకారం కూల్చివేతలకు దిగుతున్నది? హైడ్రా ఏర్పాటు జీవో జాబితాలో పేర్కొనని గ్రామాల్లో (చిల్కూరు, హిమాయత్‌నగర్, అప్పోజిగూడ) సైతం హైడ్రా ఎలా కూల్చివేతలకు పాల్పడుతున్నది?

4. ఉత్తరాది రాష్ట్రాల్లో బుల్డోజర్ న్యాయం నడుస్తున్నది. అది తప్పని సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. కారణం సర్కారే న్యాయం చెప్పడం! ఇప్పుడు హైడ్రా చేస్తున్నదీ అదే. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం తప్పు కాదు. కానీ ఆ పేరుతో నచ్చనివారి కట్టడాలను మాత్రమే ఇష్టారాజ్యంగా ఎట్లా కూల్చేస్తారు. కూల్చివేతకు అవసరమైన ప్రాసెస్ పాటించాలి కదా!

5. కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టే సమస్యే లేదని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్తున్నారు. మరి అక్కడ అనేక నిర్మాణాలున్నా తెలంగాణకు చెందిన ఒక వ్యాపారవేత్త కట్టడాన్ని నోటీసులు కూడా ఇవ్వకుండా, సామాను కూడా తీసుకోనివ్వకుండా ఆసాంతం ఎందుకు కూల్చారు? ఆంధ్రాకు చెందిన నేత కట్టడం కూల్చివేతను ఢిల్లీ నుంచి ఫోన్ రాగానే ఎందుకు ఆపారు? మరిప్పటికైనా మంత్రులు చెప్తున్నట్టు ఈ ప్రభుత్వం చట్టాన్ని అందరికీ ఒకేరకంగా వర్తింపజేస్తుందా? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న అందరి నిర్మాణాలనూ మిగతావారిలాగే కూల్చేస్తుందా? 111 జీవోలో అనుమతులన్నింటినీ సమీక్షిస్తుందా?

6. అక్రమ నిర్మాణం ఎంత తప్పో, ప్రభుత్వమే పక్షపాతపూరితంగా, చట్టాన్ని ఉల్లంఘించి, అక్రమంగా కూల్చివేయడమూ అంతే తప్పు! అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న నెపంతో ప్రభుత్వం చేస్తున్న అక్రమాన్ని ప్రశ్నించొద్దంటే ఎట్లా?

7. 111 జీవో పరిధిలో నిర్మాణాలకు సర్పంచుల అనుమతి చెల్లదని, పంచాయతీ కార్యదర్శి అనుమతి ఉండాలని ప్రభుత్వ న్యాయవాది న్యాయస్థానానికి చెప్పారు. మరి ఈ రూల్ అందరికీ వర్తింపజేస్తారా? ఎందుకంటే సన్నిహితుడి పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉందంటున్న ఫామ్‌హౌస్‌కూ అనుమతిచ్చింది సర్పంచే! కేటీఆర్ మిత్రుడి ఫామ్‌హౌస్‌కూ అనుమతిచ్చింది సర్పంచే!



అనిల్ అంబానీపై సెబీ వేటు

- స్టాక్ మార్కెట్ల నుంచి ఐదేండ్ల నిషేధం
- రూ.25 కోట్ల జరిమానా
- మరో 24 మందిపైనా కొరడా
- రిలయన్స్ హెచ్‌ఎఫ్‌ఎల్ నిధుల దుర్వినియోగమే కారణం › 11

ఏసీబీకి చిక్కిన డిప్యూటీ సీటీవో

రూ.35వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత › 10



జర్నలిస్టులపై, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడిచేసిన గూండాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీజీపీని కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నాయకులు జగదీశ్‌రెడ్డి, కోటిరెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, భాస్కర్‌రావు, కాలేరు వెంకటేశ్, గాదరి కిశోర్, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, రావుల శ్రీధర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ తదితరులు

దాడిచేస్తే తిప్పికొడ్తం!

- శాంతియుత పద్ధతిలోనే మా నిరసనలు, పోరాటం
- మా ఓపికను చేతకానితనంగా భావించొద్దు
- రైతులకు జవాబు చెప్పలేని దద్దమ్మ రేవంత్‌రెడ్డి
- దమ్ముంటే రుణమాఫీపై పల్లెల్లో చర్చిద్దాం.. రా..!
- సొంతూరిలో మహిళా జర్నలిస్టులపై దాష్టీకమా?
- గూండాలతో బెదిరించి దాడులు చేయిస్తరా?
- తుంగతుర్తిలో కనుసైగతో పొట్టుపొట్టు కొట్టేవాళ్లు
- ఇక నుంచి మీ ప్రతి చర్యకు మా ప్రతిచర్య తప్పదు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్
- శాంతిభద్రతలు అదుపులో ఉంచాలని డీజీపీకి వినతి
- రాష్ట్రంలో అరాచక పాలన: మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాలేదని పోస్టులు పెట్టినా పోలీసులు కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని బీఆర్‌ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై తాము కూడా అదే పద్ధతిలో స్పందిస్తామని, దాడికి ప్రతిచర్య తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉంచాలని కోరుతూ మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం డీజీపీ జితేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పిరికిపంద పాలన నడుస్తున్నదని, రైతులకు సమాధానం చెప్పలేని చేతకాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఆయనకు పాలన చేతకాదని దుయ్యబట్టారు. రుణమాఫీ ధర్నాలు చేస్తుంటే రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ఆఖరికి మహిళా జర్నలిస్టులపైనా కాంగ్రెస్ గూండాలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రుణమాఫీ, రైతు భరోసా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుండటాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని మండల, › 5వ పేజీలో

2 లక్షల పైన రుణాలకు

కటాఫ్ డేట్

- గడువులోపు 2 లక్షల మీది మొత్తం చెల్లిస్తేనే మాఫీ
- 18 వేల కోట్లు చేశాం.. 12 వేల కోట్లు చేయాలి
- రేషన్‌కార్డు ప్రామాణికం కాదు: మంత్రి పొంగులేటి

దశలవారీగా 2 లక్షలపైన మాఫీ

- **కుటుంబం నిర్ధారణ కాని 4.24 లక్షల మంది కోసం ప్రత్యేక యాప్**
- **మరో 1.24 లక్షల మంది ఆధార్‌లో తప్పులు: మంత్రి తుమ్మల**



హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతు రుణాల మాఫీకి త్వరలోనే కటాఫ్ తేదీని ప్రకటిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న అర్హులైన రైతులు ముందుగా ఆపై రుణాన్ని చెల్లించిన తరువాత మాఫీ చేస్తామని ప్రభుత్వం ముందే ప్రకటించిందని గుర్తుచేశారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని, తెల్ల రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తున్నామనేది పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేశారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ఎక్కడైనా అధికారులు తెల్ల రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని, ఇంకా రూ.12 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉన్నదని వెల్లడించారు. రూ.2 లక్షలకు పైబడిన రుణమాఫీకి నెలో, రెండు నెలలో కటాఫ్ తేదీ పెట్టి, రైతులు ఎక్కువ ఉన్న రుణాన్ని చెల్లించగానే వారి ఖాతాలో రూ.2 లక్షలు జమ › 7వ పేజీలో



సొసైటీ రుణాలు తీసుకోవడంతో అన్ని అర్హతలున్నా తమకు రుణమాఫీ జరగలేదని ఆరోపిస్తూ రెబ్బెన పీఏసీఎస్ ముందు రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

మాఫీ మంటలు

- బ్యాంకుల ముందు కొనసాగుతున్న నిరసనలు
- నిర్మల్ జిల్లా పెంచికల్‌పాడులో రైతుల ధర్నా
- ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో రాస్తారోకో › 7

రుణం కోసం పోయి హఠాన్మరణం

- **కొత్త లోన్ కోసం వెళ్లగా బ్యాంకులో భారీ క్యూ**
- **రుణమాఫీ కాకపోవడంపై పోటెత్తిన రైతులు**
- **లైన్‌లోనే కుప్పకూలిన రైతు గవినోళ్ల కతలప్ప**
- **యాదాద్రిలోనూ మరో రైతుకు గుండెపోటు** › 7

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శనివారం SATURDAY 24.8.2024

హైదరాబాద్ HYDERABAD


పేజీలు: 14+4
Pages: 14+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 80 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com
/ntdailyonline

మగ జాతి అంతమవుతుందా?!



క్రమంగా కనుమరుగు అవుతున్న 'వై' క్రోమోజోమ్స్

› ॥ 900 జన్యువుల నుంచి 55కు పడిపోయిన వైనం

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

అక్రాస్.. ఎవరికి హర్షం?

సాంఘిక సంక్షేమ గురుకుల బదిలీలల వెనుక కాంగ్రెస్ నేత



వచ్చే ఏడాది 'ఎమ్మెల్సీ' కోసం ఇప్పటినుంచే పావులు

- అక్రమాలకు సహకరించిన ఓ యూనియన్ నాయకుడు
- గురుకులాల్లో 'నమస్తే తెలంగాణ' కథనం దుమారం
- అవకతవకలపై ఆరా తీస్తున్న ముఖ్యమంత్రి ఆఫీస్
- మరో పాత్రధారి డాటా ఎంట్రీ ఆపరేటర్ అదృశ్యం

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీలో వెలుగు చూస్తున్న అక్రమాల వెనుక ఉన్నది ఎమ్మెల్సీ ఆశావహులేనని తెలిసింది. తమ రాజకీయ భవిష్యత్తు కోసం గురుకుల ఉపాధ్యాయులను ఆగం పట్టించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. › 10

ఏ సొసైటీలోనూ లేనివిధంగా సోషల్ వెల్ఫేర్ సొసైటీలోనే బదిలీలు ఇంత గందరగోళంగా ఉండడానికి కాంగ్రెస్ పార్టీలోని కీలక నేతతోపాటు మరో యూనియన్ నేత కారణమన్న చర్చ జరుగుతున్నది.

డీఎల్ బదిలీలు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టుల ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై 'సీఎం శాఖలోనే పదోన్నతుల అక్రాస్' పేరిట 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన ప్రత్యేక కథనం దుమారం రేపుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం గుట్టుగా విచారణను చేపట్టడం గమనార్హం.



ఢిల్లీలో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సమావేశమైన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు

బాబు ఎత్తుకు రేవంత్ చిత్తు!

- తెలంగాణకు రూ.2500 కోట్ల నష్టం
- రాష్ట్రానికి వచ్చే నిధులు ఏపీకి మళ్లింపు
- రాష్ట్ర ఖజానా నుంచి జమచేసిన కేంద్రం
- రేవంత్ మౌనంపై అధికారుల విస్మయం

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై ఏపీ సీఎం చంద్రబాబు మరోసారి తన బ్రాండ్ రాజకీయాలు ప్రయోగించారు. ఫలితంగా తెలంగాణ ఖజానాకు భారీ కన్నం పడింది. బాబు తనదైన శైలిలో ఢిల్లీలో చక్రం తిప్పడంతో తెలంగాణకు ఏకంగా రూ.2,500 కోట్ల నష్టం వాటిల్లింది. సమైక్య రాష్ట్రంలో విదేశీ బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పుల్లో తెలంగాణ వాటా కూడా ఏపీ కట్టిందంటూ బాబు కేంద్రాన్ని నమ్మించారు. దీంతో రాష్ట్రానికి రావాల్సిన నిధుల నుంచి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూ.2,500 కోట్లను ఏపీకి మళ్లించడం గమనార్హం. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రివర్గం ఎవరూ › 8వ పేజీలో

1,779 కోట్ల రుణమివ్వండి

- రాష్ట్రంలో 93 లక్షల గృహాలకు ఫైబర్ కనెక్షన్ మా లక్ష్యం
- జాతీయ క్రీడల నిర్వహణకు మాకు అవకాశమివ్వండి
- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి › 8

సర్కారు దవాఖానలో కుర్చీలోనే కాన్పు

- అర్ధరాత్రి వేళ.. నల్లగొండ దవాఖానలో ఘటన
- మొదట దేవరకొండ వెళ్తే డ్యూటీకి రాని డాక్టర్
- అక్కడినుంచి అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు..
- పురిటి నొప్పులు వస్తున్నా వైద్యుల కాలయాపన
- దేవరకొండ డాక్టర్, స్టాఫ్ నర్సుల సస్పెన్షన్
- నల్లగొండ సిబ్బందికి షోకాజ్ నోటీసులు › 10



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో కుర్చీలో కూర్చోబెట్టి మహిళకు ప్రసవం చేసిన వైద్యసిబ్బంది



వైద్య రంగంలోకి వరల్డ్‌బ్యాంక్!

రాజనర్సింహతో బ్యాంకు ప్రతినిధుల భేటీ

సూపర్ స్పెషాలిటీకి నిధులు కోరిన మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు అడుగులు పడుతున్నాయి. మొదట వైద్యారోగ్య రంగంలోకి ఆ సంస్థ ప్రవేశించనున్నది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సచివాలయంలో ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి నిధులు సమకూర్చాలంటూ వైద్యారోగ్యశాఖ నుంచి ప్రతిపాదనలు అందజేశారు. రాష్ట్రంలోని సూపర్ స్పెషాలిటీ దవాఖానల్లో మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించడానికి, అత్యాధునిక › 8వ పేజీలో

కర్ణాటక పుట్టలో హైదరాబాద్ పాములు



- 187 కోట్ల 'వాల్మీకి' స్కామ్‌లో తెలంగాణకు 45 కోట్లు
- భాగ్య నగరానికి చెందిన 9 కంపెనీల ఖాతాలకు సొమ్ము
- ఈ సొమ్ముతోనే ఎన్నికల్లో మద్యం, వాహనాల కొనుగోలు?

140 ఏండ్ల చరిత్ర మాది అని చెప్పుకొనే ఆ జాతీయ పార్టీ ఇప్పుడు అస్థిత్వం కోసం పాకులాడుతున్నది. ఆ సమయంలోనే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల ఖర్చుల కోసం అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల పెద్దలను ఆ అధిష్ఠానం సంప్రదించింది. గిరిజనాభివృద్ధి కోసం కేటాయించిన రూ. 187 కోట్ల నిధులను దారి మళ్లించాలనుకొన్నారు. వ్యతిరేకించిన ఓ ఉద్యోగిని తప్పించి పార్టీ నేతలు, అధికారులు కావాల్సిన పని చేసుకుపోయారు. దీన్ని జీర్ణించుకోలేని ఆ ఉద్యోగి ఆత్మహత్య చేసుకొన్నాడు. పోతూపోతూ లేఖ రూపంలో స్కామ్ గుట్టును రట్టు చేశాడు. అదే కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్న 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్! దారిమళ్లిన రూ.187 కోట్లలో రూ.45 కోట్లు హైదరాబాద్‌కు చేరాయి. మరి, ఆ డబ్బు ఎవరికి దక్కింది? › ॥

హైదరాబాద్‌లో ఏ ఫర్మ్ ఖాతాలోకి ఎంత?

సిట్ నివేదిక ప్రకారం

- సిస్టమ్ అండ్ సర్వీస్ కంపెనీ: 4.55 కోట్లు,
- రామ్ ఎంటర్‌ప్రైజెస్: 5.07 కోట్లు,
- స్కిల్‌మ్యాప్ ట్రైనింగ్ : 4.84 కోట్లు
- స్వాప్ డిజైన్: 5.15 కోట్లు,
- జీఎన్ ఇండస్ట్రీస్: రూ. 4.42 కోట్లు
- నోవెల్ సెక్యూరిటీ: రూ. 4.56 కోట్లు,
- సుజల్ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 5.63 కోట్లు
- గ్రాబ్ ఏ గ్రబ్‌కు రూ. 5.88 కోట్లు
- వీ6 బిజినెస్ : రూ. 4.50 కోట్లు

రాహుల్.. మాట్లాడవేం!

'ముడా' స్కామ్‌పై నోరు మెదపని కాంగ్రెస్ అగ్రనేత


అసహనంతో సిద్ధరామయ్య.. తేల్చుకోవడానికి ఢిల్లీకి!

› ॥

ఆఫీస్ దాటితే అడిగేదే లేదు

- పని గంటల తర్వాత యజమానులను ఉద్యోగులు పట్టించుకోవాల్సిన పని లేదు
- ఫోన్లు, సందేశాలను తిరస్కరించే హక్కు
- ఆస్ట్రేలియాలో 26 నుంచి రైట్ టు డిస్‌కనెక్ట్ యాక్ట్

› ॥



గోల్డ్ బాండ్లకు గుడ్‌బై!

- అమ్మకాల్ని ఆపేసే దిశగా కేంద్రం యోచన
- అధిక బంగారం ధరలతో చెల్లింపులు భారం
- మదుపరులకు లాభాలున్నా.. ఖజానాకు నష్టాలు › 11
- అందుకే ఎస్‌జీబీలకు స్వస్తి అంటున్న సర్కారీ వర్గాలు

వీటిని కూల్చే దమ్ముందా?!

అవి హైదరాబాద్‌కు తాగు నీళ్లందించిన జంట జలాశయాలు. ఇప్పడవి కుంటలయ్యాయి. పక్కనే రాజభవనాలు వెలిశాయి. అవన్నీ ప్రముఖులవే. అందులోనూ కాంగ్రెస్ నాయకులవే అధికం. చెరువుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు అపరిమిత అధికారాలు అప్పగించిన సర్కారు అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతానంటున్నది. కానీ జలాశయాల సమీపంలో కట్టుకున్న కాంగ్రెస్ నాయకుల ఫాంహౌస్‌లు మాత్రం సర్కారుకు కనిపించడం లేదు. వీటి జోలికి వెళ్లని ప్రభుత్వం కొంతమందినే లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నది. ఇప్పడు కాంగ్రెస్ నేతల రాజభవనాలను సర్కారు నేటమట్టం చేసేందుకు సాహసిస్తుందా?


ఫామ్‌హౌస్ కథా కమామిషుపై నమస్తే తెలంగాణ ప్రత్యేక బృందం గుండాల కృష్ణ, కడవేర్గు రాజశేఖర్, దుద్దాల రాజు, బేగరి శ్రీనివాస్‌లు ఫొటోగ్రాఫర్ రజినీకాంత్‌తో కలిసి అందిస్తున్న ప్రత్యేక కథనం...





పొంగులేటి..
ఈ రాజప్రాసాదాలేంటి?

ఏంటి ఈ ఫొటో చూడగానే గోవాలోని రిసార్టులు అనుకొంటున్నారా? కాదు మన హైదరాబాదే. హిమాయత్‌సాగర్‌కు ఆనుకొని ఉన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుల గెస్ట్ హౌస్‌లు ఇవి. ఎరుపు రంగు రూఫ్‌టైల్స్‌తో మెరిసిపోతున్న విలాసవంతమైన నిర్మాణం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిది. ఆధునికత ఉట్టిపడేలా నలుపు రంగు షెడ్స్ ఉన్నవి ఆయన సోదరుడివి. ఈ నిర్మాణాల పక్కనే జలాశయం కనిపిస్తున్నది కదూ. వాస్తవానికి ఈ గెస్ట్ హౌస్‌లు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని స్పష్టమైన ఆరోపణలు ఉన్నాయి. కానీ దీన్ని నిర్ధారించే జలమండలి రాళ్లు ఎక్కడున్నాయో... ఉన్న ప్రదేశం నిజమైనదో! కాదో!! తేల్చుకోలేని దుస్థితి. ఈ నేపథ్యంలో కచ్చితంగా ఈ నిర్మాణాలు బఫర్‌జోన్‌లోనే ఉన్నాయనేది చూసే ప్రతి ఒక్కరికీ ఇట్టే అర్థమవుతుంది.










పట్నం శివారుల్లో
‘పట్నం’ వారి గెస్ట్‌హౌస్


ఏవావ్.. ఇదేంటి? నీటి మధ్యలో ఐల్యాండ్. అందులో ఎంతో అందమైన భవనం. ఈ ఫొటో చూడగానే.. లేక్‌వ్యూ పాయింట్ అంటే ఇట్లుండాలి. అనుకొంటున్నారు కదూ..! అయితే, ప్రస్తుత ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అభిరుచిని మీరు పొగడాల్సిందే మరి. ఎందుకంటే ఈ భవంతి ఆయనదే. ఇంకో విషయం ఆయన రూటు ఎంతో సపరేటు. ఎందుకంటారా? లేక్‌వ్యూ పాయింట్ కోసమని చెరువు గట్టున విల్లా కట్టుకోవడం చూసే ఉంటాం. అయితే, ఆయన ఏకంగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లోనే తన గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారు. ఇది జగమెరిగిన సత్యం. దాదాపు దశాబ్దంన్నర కిందట జంట జలాశయాల చెంతన కేవలం ఫాంహౌస్‌ల సంస్కృతి మాత్రమే ఉండేది. కానీ గెస్ట్‌హౌస్ సంస్కృతిని పట్నం వారే పట్నానికి ప్రవేశపెట్టారనేది రంగారెడ్డి జిల్లాలో బాగా ప్రాచుర్యంలో ఉన్న ప్రచారం.





కేవీపీ కథ పేరు ‘అనంతం’..


‘ఇసంత రా.. అంటే ఇళ్లంతా నాదే అన్నాడట.. వెనుకటికి ఒకడు’.. ఇప్పుడు మీరు చదువబోయే వార్త కూడా అలాంటిదే. కేవీపీ రామచంద్రరావు అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఢిల్లీ నుంచి గల్లీదాకా బాగా తెలిసిన పేరు. అవునా..? ఇక, విషయంలోకి వద్దాం. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో తొలుత కొద్దిగా ఓ నిర్మాణం మొదలైంది. ఇంకేంటి.. సందు దొరికింది కదా.. ఆ తర్వాత అతితక్కువ కాలంలోనే బఫర్‌జోన్‌లోనూ పూర్తిస్థాయి నిర్మాణాలతో చివరకు ఓ అందమైన గెస్ట్‌హౌస్ సిద్ధమైంది. అది కేవీపీ రామచంద్రరావుదే. విశాలమైన రహదారులతో చెరువు కనిపించకుండా చుట్టేసిన ఈ గెస్ట్‌హౌస్‌కు ‘అనంతం’గా నామకరణం చేసుకున్నారు ఆయన. చుట్టూ భారీ ప్రహరి నిర్మాణంతో పాటు లోపల కూడా భారీ నిర్మాణాలు ఉన్నాయి.



వైవీ.. నడిమధ్యలో ఠీవీ!

ఏపశువులు తినకుండా చెట్లను కాపాడటానికి ఈ ప్రహరి కట్టారనుకొంటున్నారా? అయితే, మీరు పొరపడినట్లే. సాగరం నోట్లో మట్టికొట్టి ఈ నిర్మాణాన్ని చేపట్టారు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పూర్తిగా విస్తరించి ఉన్న ఈ నిర్మాణం టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిది. ఏకంగా సాగర్‌లో భారీ ట్రక్కులతో వందల క్యూబిక్ మీటర్ల మట్టి పోసి రిజర్వాయర్ కుంచించుకుపోయేలా చేశారు. ఆరు అడుగుల ఎత్తున కొత్తగా మట్టి నింపారనేది స్థానికులు చెబుతున్న వాస్తవం. మట్టికే దాదాపు అర కోటి వరకు ఖర్చు చేశారని భోగట్టా. ప్రస్తుతానికి చుట్టూ భారీ ప్రహరి నిర్మాణం పూర్తయింది. ఇప్పటికైతే ఇంకా నిర్మాణాలు మొదలు కాలేదు.





వివేకం వారి Vస్తరణ స్టోరీ!

ఎర్రని నేలల్లో, పచ్చటి చెట్ల మధ్య తెల్లని పాలరాతి భవనంలా మెరిసిపోతున్న ఈ భారీ ఫాంహౌస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిది. దశాబ్దాల కిందటనే పూర్తిగా బఫర్‌జోన్‌లో పెద్ద ఎత్తున ఈ ఫాంహౌస్ నిర్మాణం జరిగింది. ఇది కాకుండా కొంతకాలం కిందట మరో బహుళ అంతస్తుల భవనాన్ని కూడా నిర్మించారు. అదైతే పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉందనేది బహిరంగ రహస్యం. విశాలమైన రహదారులతో డెడ్‌ఎండ్‌గా ఉన్న ఈ ఫాంహౌస్ గేటు ముందుకు వెళ్లారో ఎక్కువసేపు అక్కడ ఉండలేరు. ఎందుకంటే అక్కడి భారీ సంఖ్యలో ఉన్న సెక్యూరిటీ గార్డులు మిమ్మల్ని తరిమికొట్టడానికి పరిగెత్తుకొని వస్తారు మరి.



సర్పంచ్ అనుమతితో సీఎం బంధువు ఫాంహౌస్

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామ పరిధిలో ఫాంహౌస్ ఇది. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీప బంధువు రవికాంత్‌రెడ్డి పేరిట ఉంది. 111 జీవో నిబంధనలకు నీళ్లొదిలి చేపట్టిన నిర్మాణం ఇది. నిబంధనల ప్రకారం ఉన్న విస్తీర్ణంలో కేవలం పది శాతం మాత్రమే నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించి ఈ అందమైన భవనాన్ని నిర్మించారు. ముఖ్యంగా ఈ నిర్మాణాలకు వట్టినాగులపల్లి అప్పటి సర్పంచ్ అనుమతులు ఉన్నాయే తప్ప ప్రభుత్వం హైకోర్టులో వాదించినట్టు పంచాయతీ కార్యదర్శిదిగానీ, మున్సిపాలిటీ అనుమతులు గానీ లేవు.



సాగరంలో కొలువుదీరిన శ్రీ‘నిధి’

సాగర గర్భంలో నిధులు ఉంటాయని అంటారు. అదేమో గానీ.. సాగరంలోనే కొలువుదీరిన ఈ శ్రీనిధిని చూశారా? ఇంద్రభవనాన్ని తలదన్నేలా ఉంది కదూ ఈ ఇల్లు. ఇక, ఆ క్రీడా మైదానం గురించి ఎంత చెప్పినా తక్కువే కదూ. హిమాయత్‌సాగర్‌ను ఆనుకొని ఒక మహా సామ్రాజ్యంలా నిర్మితమైన ఈ శ్రీనిధి విద్యా సంస్థలు, వాటి యజమాని కేటీ మహి నివాస సముదాయాన్ని చూసేందుకు రెండు కండ్లు కూడా సరిపోవు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సుపరిచితుడు దీని యజమాని పేరు కేటీ మహి అని సమాచారం. అంతేకాదు... గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడే భారీ నగదు మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో పొంగులేటి కోసమే నగదును తరలిస్తున్నారనే వాస్తవం గుప్పుమంది. కాగా ఈ నివాస సముదాయం కొంత ఎఫ్‌టీఎల్‌లో ఉందనేది సుస్పష్టం. ఇక.. బఫర్‌జోన్‌ను పూర్తిగా ఆక్రమించుకొని భారీ నిర్మాణాలు చేపట్టారు. దీంతో పాటు క్రీడా మైదానంలోనూ నిర్మాణాల జోరు. ఇలా హిమాయత్‌సాగర్‌ను ఆనుకొని దాదాపు వంద ఎకరాల వరకు ఇది ఉంటుందనేది స్థానికంగా ఉన్న ప్రచారం.

